# మహాకాలుని పిలుపు
# (మాస్టర్ ఆర్.కె. లెటర్స్ - 1)




✺ నేను వ్రాసే ఈ పంక్తులు ఆధ్యాత్మిక సంస్థలలో ఉన్న వ్యక్తులను ఉద్దేశించి వ్రాసినవి కావు.

- సాధనలో తీవ్రత తెచ్చుకొని,
  సమర్పణ యొక్క పరాకాష్టని అందుకొని,
- ఆ సమర్పిత వ్యక్తిత్వాన్ని "గురుసత్తా" చేతిలో ఒక మైనపుముద్ద వలె మార్చి,
- ప్రజ్ఞావతరణ కొరకు కావలసిన పరిస్థితులు నెల కొల్పుకొని, నిష్కళంక కల్కి అవతారము అంద జేసే బాధ్యతలను అన్ని పరిస్థితులలోనూ ఎంతో ఉత్కృష్టమైన త్యాగంతో చేయగల పౌరుష వంతులకు ఈ వాక్యాలు వ్రాస్తున్నాను.

డా॥ ఎమ్. శ్రీరామకృష్ణ M.Sc., Ph.D.

# మహాకాలుని పిలుపు



ఎడిటర్: పి. సీతారాముడు

శ్రీ తారణ నామ సంవత్సరం,
అధిక శ్రావణ బహుళ అమావాస్య ఆదివారం.
15.8.04.

వెల: రూ. 100.00

ప్రతులకు:
పి. సీతారాముడు,
H/o. శ్రీ కె. భాస్కరరావు,
7-3-14, నరసయ్య అగ్రహారం,
భీమవరం - 534 203, ప.గో. జిల్లా.
ఫోన్ నెం. 94407 53115.

డి.టి.పి. :
ఇంద్ర, భీమవరం.

పబ్లిషర్స్ :
విశ్వకర్మ పబ్లికేషన్స్, భీమవరం.

ప్రింటర్స్ :
సాయి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, భీమవరం.

***పరిజనులకు నమస్కారం.***

మాస్టరుగారు చెప్పే విషయాలను గురించి ఇంకాస్త స్పష్టంగా తెలుసుకోవటానికి, మాస్టరుగారు చెప్పే మార్గంలో ఇంకా సవ్యంగా నడవటానికి ఉపయోగపడతాయి అనే ఉద్దేశ్యంతో గతంలో సాధకులకు మాస్టరుగారు అందించిన లెటర్స్‌ని రెండు భాగాలుగా ప్రచురిస్తున్నాను.

గతంలో లేఖామాల - 1991, లేఖామాల - 1992, లేఖామాల - 1993 పేరుతో వెలువడిన 3 పుస్తకాలను ప్రస్తుతం "మహాకాలుని పిలుపు" అనే పేరుతో మొదటి భాగంగా ప్రచురిస్తున్నాను. జూన్ 95 నుండి మార్చి 99 వరకు "యుగసంధి ప్రబోధం" మాసపత్రికలో వచ్చిన లెటర్స్‌ని రెండవ భాగంగా త్వరలో ప్రచురిస్తాను.

నేను ప్రచురిస్తోన్న మాస్టరుగారి పుస్తకాలను రెగ్యులర్‌గా తీసుకొంటూ ఈ ప్రయత్నానికి సహకరిస్తోన్న సాధకుల సంఖ్య చాలా తక్కువగా ఉంటోన్నందు వలన తక్కువ ధరలో పుస్తకాలను అందించటం సాధ్యం కావటం లేదు.

తక్కువ ధరలో మాస్టరుగారి పుస్తకాలను ఆకాంక్షించే పరిజనులు ఈ పుస్తకాలను ఫోటోస్టాట్ తీయించుకొని ఉపయోగించుకోవలసినదిగా కోరుచున్నాను.

సీతారాముడు

# మహాకాలుని పిలుపు

## (మాస్టర్ ఆర్.కె. లెటర్స్ - 1)



విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | లేఖామాల -1991 | 4 |
| 2. | లేఖామాల -1992 | 28 |
| 3. | లేఖామాల -1993 | 44 |

# లేఖామాల - 1991



గురువుల ఊహలకు నిర్దిష్టమైన రూపము యిచ్చి తీరుతామని ప్రతిజ్ఞ చేసిన వారి శిష్యులందరూ వ్యక్తిగత గురుసాంప్రదాయాల పరిధిలోనే యిరుక్కుని పోయి, తమ గురువుల లక్ష్యాన్ని గుర్తించక, అత్యున్నతమైన ఈ సమయాన్ని వృథా చేయకుండా,

అన్ని శిష్యవర్గములు ఒకే శిష్య సముదాయ
ముగా మారి, గురుతత్వ రహస్యాన్ని అర్థము
చేసుకొని, అమృతత్వముతో నిండిపోయే
నవసమాజానికి బీజములుగా మారి,
గురువులు ఆశించిన సమాజాన్ని
పృథ్విపై మనమందరము
తీసుకురాగలమని ఆశిస్తున్నాను.



# ముందు మాట

(1991లో మాస్టరుగారు అందించిన లెటర్స్‌తో కూడిన "లేఖామాల - 1" అనే పుస్తకానికి మాస్టరుగారు వ్రాసిన ముందుమాట)

అధ్యాత్మిక సాధన కత్తి మీద సాము వంటిది.

ముఖ్యంగా సాధకుడు స్నేహశీలి, కరుణామయుడు, అహంకారరహితుడు అయిన సద్గురువు భౌతిక సాన్నిధ్యంలో సాధన చేయకుండా ఉన్నప్పుడు ప్రతీ అడుగునా సందేహాలతో సతమతమౌతూ ఎన్నుకున్న మార్గము నుంచి చ్యుతుడు అవటం జరుగుతుంది.

అంతేగాక ఈనాటి మానవ శరీర నిర్మాణము ముఖ్యంగా వరుణ, యమగ్రహాల (Neptun, Uranus) సంబంధిత సూక్ష్మచక్రాలతో అడ్డదిడ్డంగా పనిచేసే విధానం లో ఉండటం వలన సృష్టి యొక్క అవగాహన లేనప్పుడు సాధనలో అనేక విఘ్నాలు, భ్రమలు ఏర్పడతాయి.

- ఈనాటి శరీర నిర్మాణము, దేశ కాల పరిస్థితులలో నేను స్వయముగా 20 సంవత్సరాలు పాటు జరిపిన వైజ్ఞానిక సాధనా పద్ధతుల ఫలితమే ఈ "లేఖామాల".
- ఈ సాధనలను తు.చ. తప్పకుండా ఆచరించిన వారు, అనేక జన్మల నుంచి కనిపించకుండా వెనువెంటనే వుండి ప్రోత్సహిస్తున్న వారి వారి గురుదేవుల సూక్ష్మ సంపర్కము తప్పని సరిగా పొందుటయేగాక,

ఈనాటి పరిణామక్రమములో తను చేయవలసిన కార్యక్రమాలను సుస్పష్టంగా గుర్తించగలుగుతారు అన్నది నా విశ్వాసము.

పూజ్య గురుదేవులు, మాతాజీల ఆశీర్వాదము, తమ తమ గురువుల సాక్షాత్కారము, గాయత్రీమాత అనుగ్రహ ప్రసాదము ఈ ఉత్తరములలో చెప్పబడిన సాధనలవల్ల మీ అందరికీ అభిస్తాయి అని ఆశిస్తూ,

- ఈ యుగసంధి కాలంలో విభిన్న గురువుల శిష్యులు అందరూ - ఒక సహజ ప్రేమమయ కుటుంబ వాతావరణాన్ని పృథ్వి మీదకు దింపి, గురువుల కార్య క్రమాలకు తమ వంతు సహకారాన్ని అందిస్తారని ఆశిస్తున్నాను.

ఈ పుస్తకము సాధన సర్వస్వము కాదు. సాధన పలువిధాలు. అందు వల్ల ఇందులో ఉన్న సాధనలేగాక, ఎటువంటి సాధనయైనా సక్రమ పద్ధతిలో అర్థము చేసుకొని చేస్తే తప్పక సత్ఫలితాలు యిస్తుంది.

- సాధనలోని తీవ్రత పెంచుకుంటూ, సాధనను క్రమ పద్ధతిలో చేయటాన్ని ఈ పుస్తకం మీకు తెలుపగలిగితే ఈ ప్రచురణ సఫలమైనట్లే.

సాధకులకు వీలుగా ఒక నిర్ణీత ప్రణాళికాబద్ధంగా విషయాలు తెలపాలని నాకు స్ఫూర్తినిచ్చి, రోజూ అనేక గంటలు, కొన్ని నెలలు వెచ్చించిన నా మిత్రుడు శ్రీ వై.పి. రామసుబ్బయ్య నిరంతరశ్రమ ఫలితమే ఈ ఉత్తరములు.

ఈ ఉత్తరములు పుస్తక రూపము దాల్చడానికి కారకులైన శ్రీ మంచెళ్ల లక్ష్మీనారాయణ దంపతులు, శ్రీ పి. సదానందమూర్తిగారికి నా ధన్యవాదములు.

ఈ పుస్తకాన్ని చదివిన తరవాత సాధన చేయాలని ప్రేరణ కలిగితే నా ఆశయము సిద్ధించినట్లే.

మీ
శ్రీరామకృష్ణ



# పూర్ణిమా మౌన ధ్యానము - ఆవశ్యకత

ఉత్తిష్ఠ! జాగ్రత!! ప్రాప్యవరాన్ నిభోధత!!!

ARISE ! AWAKE !!

STOP NOT TILL THE GOAL IS REACHED!!!

ఈనాడు దేశ విదేశాలలో అనేక ఆధ్యాత్మిక సంస్థలు నెలకొల్పబడుతున్నాయి. ప్రతీ సంస్థలోని వ్యక్తులు రానున్న భవిష్యత్ కాలాన్ని మానవజాతికి ఒక అధిగమించలేని జటిల సమస్యగా వర్ణిస్తూ, ఆ తరవాత కాలము తిరిగి ఒక నవ చైతన్యపూరిత యుగంగా అభివర్ణిస్తున్నారు.

అన్ని సంస్థల వెనుకవున్న గురువులు, వారి ప్రముఖ అనుయాయులు చెప్పేది సంగ్రహంగా ఏమిటంటే,

① పరిణామక్రమంలో మానవజాతి ఇప్పుడు ఒక విచిత్ర మైన సంధికాలంలో ఉన్నది.

② పృథ్వీగ్రహము, శుక్రగ్రహము, మరియొక గ్రహము పైన మాత్రమే

మానవజాతికి దైవీ ప్రణాళికలో భాగస్వాములు అగుటకు దశలవారిగా దీక్షా ప్రణాళిక ఏర్పాటు చేయ బడినది.

③ కేవలము 5 ఇంద్రియముల ద్వారా లభించగలిగే జ్ఞానానికి మాత్రమే పరిమితమైన మానవజాతి,

అతీంద్రియ శక్తులను గుర్తించి, వాటిని తమ దైనందిన జీవితములో ఎవరికీ, ఏవిధమైన హాని కలుగకుండా ఉపయోగించుట.

④ సృష్టి యొక్క బహు ఆయామి (Multi-dimensional) చేతనత్వ రహస్యాన్ని తెలుసుకొని,

కేవలము భౌతిక జగత్తులోనేగాక, ఇంకా అనేక dimensions లో స్వేచ్ఛగా అదే స్థితిలో ఉన్న అనేకు లతో కలసి పనిచేయుట.

⑤ దీక్షా ప్రకరణములోని ఒక రహస్యాన్ని ఈ క్రింది విధంగా తెలుపవచ్చును.

- "వృక్ష జగత్తు"కు (Plant Kingdom), ఖనిజ జగత్తు (Mineral Kingdom) లోని రేడియో ధార్మికత (Radio Activity) హేతువు.
- వృక్షజగత్తులోని రేడియో ధార్మికత "జంతువర్గా"నికి (Animal Kingdom) హేతువు.
- జంతువర్గములోని రేడియో ధార్మికత "మానవసృష్టి"కి కారణము (Human Kingdom).
- మానవ జగత్తులోని రేడియో ధార్మికత "అతి మానవ చేతనత్వాన్ని" (Super Man) సృష్టిస్తుంది.

⑥ తమ పరిణామక్రమాన్ని చాల తొందరగా పూర్తి చేయడానికి మానవజాతికి లభించిన "దీక్షా విధాన ప్రక్రియ" దేవతలకి లేదు.

అంటే దేవతలు తమ పరిణామక్రమాన్ని ప్రాకృతిక మైన కొన్ని కోట్ల సంవత్సరాలలో పొందగలరు.

*కానీ మానవుడు దీక్షా ప్రణాళిక వల్ల 7 సంవత్సరాలలోనే పూర్తి పరిణతను సాధించగలడు.*

అందువల్ల దేవతా శక్తులను ఉపయోగించుకొనుట నేర్చుకోవాలి. అడుక్కోవటము కాదు.

⑦ రానున్న కాలంలోని సమాజం (Civilization) దేవ మానవ భ్రాతృత్వ సమాజంగా రూపొందుతుంది.

⑧ ఇవన్నీ జరగడానికి నేడు ఉన్న భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేవు. కనుక అనేక భూకంపాలు, అగ్ని

ప్రమాదాలు, యుద్ధాలు, జల ప్రళయాలు రాబోయే నూతన సుందరమైన దివ్య సమాజానికి కావలసిన భూఖండాలను తిరిగి నిర్మిస్తాయి.

పై సంఘటనలన్నీ జరగాలి అంటే గురువులు, ఇతర గ్రహాల నుంచి వచ్చి పృథ్వీ పరిణామక్రమంలో పాలు పంచుకుంటున్న మన ఊహకే అందని అతి ఉదాత్త ఆత్మలు, దేవతా శక్తులతో పాటు ఈ దివ్య ప్రణాళికను అర్థం చేసుకున్న కొంతమంది మానవ సమూహాలు అవసరము.

- మనో వాక్కాయ కర్మల ఏకీకరణయే (ఆలోచించేది కోరుకొనుట, కోరుకున్నదే చేయుట) మానవుడు మొట్టమొదట నేర్చుకోవలసిన పాఠము.

ఆధ్యాత్మిక సోపానాలలో మొదటి మెట్టు ఇదే.
చివరి మెట్టూ ఇదే.

ప్రాకృతిక వాతావరణాన్ని అనుసరించి తన పనులకు అనుగుణ్యంగా ప్రకృతిని ఉపయోగించుట మానవజాతి నేర్చిన విద్య.

- పైన చెప్పిన 8 విషయములు (8 Points) నేర్చుకొని, వాటిని ఉపయోగించుకొనుటకు, తెలుసుకొనుటకు నెలలోని రెండు రోజులు బాగా ఉపయోగపడతాయి.

అవే అమావాస్య, పౌర్ణిమలు.

- ఒక సంవత్సరకాలంలో మానవుడు భౌతిక ప్రపంచ పరిధిని దాటి బహు ఆయామి (Multi-dimensional) చేతనత్వముతో సంబంధము పెట్టుకొనగలిగే సంవత్సరములోని 24 సూక్ష్మ, గుప్త, సరళ కాల పరిమాణాన్నే గాయత్రీ ఛందస్సు అన్నారు.
- భౌతిక జగత్తులోని పంచేంద్రియాల ద్వారా దీనిని వినియోగించుకోవాలి కనుక దానిని "పంచముఖీ గాయత్రి" అన్నారు.

లభించిన శక్తి మొత్తాన్ని ఒక్క దైవీ ప్రణాళికకు మాత్రమే ఉపయోగిస్తే అది "ఏకముఖీ గాయత్రి" అవుతుంది.

- ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగష్టులలోని 5 పూర్ణిమలు సుమారు ఒక కోటి 95 లక్షల సంవత్సరాల చరిత్ర గలిగిన ఈ మానవజాతి భవిష్యత్తును నిర్ణయిస్తాయి.
- సంపూర్ణ ఆధ్యాత్మిక సాధనకు గురు మంత్రము,

"As above, so below".

దీనిని అనుసరించి పూర్ణిమనాడు సాయంసమయంలో తూర్పు, పశ్చిమ దిశలలో పరిపూర్ణంగా ఉండే చంద్రుడు (మనస్సు), కుంకుమ వర్ణంలో ఉండే సూర్యుడు (అమ్మవారు) మనకు కనిపిస్తారు. అంచేత ఆ రోజు మౌనంగా కూర్చోగలిగితే మనలో వున్న సూర్యుడు (ఆత్మ) మన మనసులలో పూర్తిగా ప్రతిబింబించి, దైవీ ప్రణాళికను అర్థంచేసుకొనే పరిస్థితి ఏర్పడుతుంది.

అందువల్ల మౌనము అనే ప్రక్రియను పూర్ణిమనాడే గాక దాని ముందు నుంచి సాధన చేస్తూ ఉంటే "పూర్ణిమ మౌన ధ్యానము"లో సత్ఫలితాలు కలుగుతాయి.

ఈ సాధనా పద్ధతిలో అందరూ పాలుపంచుకొని,
మానవజాతి చరిత్రలో లభించిన ఈ మహత్తరమైన తరుణాన్ని సద్వినియోగపరచుకొన్న వారిలో
మన అందరి పేర్లు ఉంటాయని ఆకాంక్షిస్తూ,

ఇట్లు
శ్రీరామకృష్ణ

P.S. : దీనిని అనేకసార్లు చదివి అంతరార్థాన్ని గ్రహించగోర్తాను. - R.K.





గుంటూరు,
25-4-91

దివ్యాత్మన్,

మీకు ఇది వరకు చెప్పిన ప్రకారము గాయత్రీ పరివార్ సభ్యులలో ఈ భీషణ యుగసంధి కాలములో, పూజ్య గురుదేవులు వెలిగించిన అఖండ జ్యోతి కిరణాలు పృథ్వి మీదే కాక ఇంకొక రెండు గ్రహాలకి, సూక్ష్మ జగత్తులో 66.6 శాతము ఆక్రమించుకుంటూ, కారణ జగత్తులో 33.3 శాతము ఆక్రమించవలెను.

✧ ఈ దిశలో పయనించిన పూజ్య గురుదేవుల ఆత్మీయ పరిధిలో సాహసం చూపగలిగే వ్యక్తులు, ఈ పత్రములలో (letters) ఇవ్వబడుతోన్న ప్రతి చిన్న సలహాను తు.చ. తప్పకుండా పాటించితీరాలి.

సాహసం చేయగలిగే అతి విశిష్టమైన ప్రజ్ఞా పరిజనులకు నిత్య నియమావళిని క్రింద పొందుపరుస్తున్నాను. వీరు గాయత్రీ పరివార్‌లో మిలటరీలో చెప్పబడే Special task force Commondos గా రూపొంది తీరుతారు.

① మీ యింటి డ్రాయింగ్ రూమ్‌లో పూజ్య గురుదేవులు, మాతాజీ, గాయత్రీ మాత ఫొటోలు బయటి నుంచి లోనికి వచ్చేవారికి తక్షణమే కనపడేటట్లు అమర్చాలి.

② కుటుంబములోని చిన్న పెద్ద అందరు సభ్యులు ఎన్ని సార్లు గది గుమ్మము బయటికి దాటితే అన్ని సార్లు ఆ చిత్ర పటముల ముందు జోళ్ళు లేకుండా శిరస్సు వంచి కళ్ళు మూసుకొని మూడు సార్లు గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించి గాయత్రీ మంత్ర రక్షణా వలయంతో బయటికి వెళ్తున్నట్లు భావించుకోవాలి. లోపలికి వచ్చినపుడు మళ్ళీ మూడు సార్లు గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించి గురుదేవులు, మాతాజీ, గాయత్రీమాత సహర్షముగా ఇంటిలోనికి ఆహ్వానిస్తున్నట్లు భావించాలి. రక్షణావలయాన్ని తొలగించుకున్నట్లు భావించాలి.

③ కల్పసాధనలో పూజ్య గురుదేవులు అందించిన "3 బంధములను" తెలిసిన వ్యక్తి సమక్షంలో మొదటి రోజు 3 నిమిషాలు అభ్యాసం చేసి పై పూర్ణిమ నాటికి 15 నిమిషాల పాటు చేసే సామర్థ్యాన్ని తెచ్చుకోవాలి.

④ నిత్య జీవితంలో ఏ వ్యక్తితో మాట్లాడినా, మనస్సులో అతనిలోవున్న ప్రేమమూర్తి గురుదేవులకు నమస్కరిస్తూ, పైకి మాత్రము మామూలుగా నిత్యకార్యక్రమాలకు సంబంధించిన మాటలు మాట్లాడాలి.

⑤ కాలిగోళ్ళు, చేతిగోళ్ళు పూర్తిగా కత్తిరించుకొని ఉండాలి. (వీలైతే వారానికి ఒకసారి)

⑥ ప్రొద్దున్నకాని, సాయంత్రము కాని కుటుంబంలోని ప్రతి సభ్యుడు (అతిథి ఉన్నా సరే) మీరు నిర్ణయించుకున్న కాలాని (time) కి సాధ్యమయినంత వరకు స్వచ్ఛమైన తెల్లని బట్టలలో కూర్చుని, చీరాల నుండి ప్రచురితమైన "శాంతికుంజ్‌లోని నిత్య కార్యక్రమాలు" లో చెప్పిన నిత్య పూజా కార్యక్రమాన్ని అనుసరిస్తూ, కనీసము 18 సార్లు ఉచ్ఛ స్వరముతో పూజ్య గురుదేవులు అందించిన లయతో గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించాలి.

⑦ ఈ విశిష్ఠ తీవ్ర ఆచరణా కార్యక్రమంలో పాలుపంచుకునే ప్రతి వ్యక్తి రాత్రి నిద్రపోయే ముందు తన దగ్గర ఉన్న డైరీలో పూజ్య గురుదేవులు అందించిన యుగ నిర్మాణ యోజన సత్సంకల్పములు 18 చదివి, ఎంత వరకు పాటించారో నిజాయితీ (honest) గా పొందుపరచుకోవాలి. ఈ 18 సూత్రాలు వచ్చే 5 పూర్ణిమల లోపల పూర్తిగా పాటించడం అలవరచుకోవాలి.

⑧ గాయత్రీ పరివార్ ద్వారా పంపించిన కరపత్రములు చాలా శ్రద్ధతో అతి ఉత్తమ విద్యార్థి చదివినట్లు చదివి, notes తయారుచేసుకొని, ఈ విధానాలను ఇతరులందరూ కలసి పాటించేటట్లు చేయండి.

✧ పూజ్య గురుదేవులు విశ్వ కుండలినీ జాగరణ ప్రక్రియలో సుమారు 1200 మందిని ఉపయోగించుకోబోతున్నారు. ఈ 5 పూర్ణిమలలో ఆ 1200 మందిలో మీరు కూడా భాగస్వాములు అవడానికి తగిన వివరణలు, సాధనా ప్రక్రియలు అందివ్వబడతాయి.

✧ ధైర్యముండి కాలచక్రగతిని త్రిప్పగలిగే వీరులకి,
కామ, క్రోధ, లోభాలను జయించే ధీరులకి,
ఇదే ఆహ్వానం!

నిరాశా దృక్కులతో, కళ్లల్లో నీరు నింపుకొనివున్న
"నిష్కళంక ప్రజ్ఞావతారమూర్తి" పూజ్య గురుదేవులకు
మీరందరు ఇవ్వగలిగే,
ఇంటింటా జరిగే ఈ ప్రయత్నాలు,
ఆ నూతన సృష్టి నిర్మాణానికి సంకేతాలు.

మీ
శ్రీరామకృష్ణ

✧❋✧❋✣❋✧❋✧



గుంటూరు,
2-5-91

ప్రియ గాయత్రీ పరిజనులకు,

నమస్కారములు!

బుద్ధావతారపు ఉత్తరార్థంలో నిష్కళంక ప్రజ్ఞావతారంగా మహాకాలుని ఆదేశానికి మేర, రాబోయే విశ్వజిత్ మహాయజ్ఞానికి అంకురార్పణగా, ఇంటింటా జరిగే దీప యజ్ఞరూపమైన, యుగ యజ్ఞరూపమైన వాజపేయ యజ్ఞాలు, గాయత్రీ పరిజనులకు రాజసూయ యజ్ఞముగా పరిణతి చెంది, సాహసము గల ఆత్మ సమర్పణ చేసుకొనే ధీశాలురకు, సూక్ష్మజగత్తు నుండి పూజ్య గురుదేవులు అందించే ఆహ్వానము మేరకు ఈ యజ్ఞ ప్రక్రియలు అన్నింటిని నరమేధ యజ్ఞముగా మార్చగలగాలి.

❋ గాయత్రీ పరివార్ భావనలు, ఆలోచనలు, ఆకాంక్షలు పూజ్య గురుదేవుల స్థాయికి తీసుకుని వెళ్ళటానికి మనందరిలోను విశేష సాధనా శక్తి, మహాకాలుని నుంచి విశిష్ట శక్తిపాతము అవసరము.

శక్తిపాతము గురుదేవుల బాధ్యత.

సాధన మన వ్యక్తిగత బాధ్యత.

❋ ఈ ఐదు పూర్ణిమలలో (రానున్నవి 4) షట్చక్రజాగరణ, మూడు గ్రంథుల భేదన, పంచకోశ అనావరణకి అతి స్పష్టమైన, ఆరోగ్యవంతమైన అంకురార్పణ జరగాలి.

శ్రీ దానికి మొదటి రెండు చరణాలుగా మొదటి రెండు ఉత్తరాలలోని సాధనకు సంబంధించిన ప్రతీ మాట ఈ క్షణం నుంచి అమలులో పెట్టమని కోరుచున్నాను.

ॐ "సాధన ఎన్ని గంటలు చేశాము" అన్నదానికి ప్రాముఖ్యత ఇవ్వకుండా, భావ సంవేదనల తీవ్రత ఎంత వరకు వచ్చింది, మనస్సుని ఎంత పరిష్కరించుకోగలిగాము అన్నది చూసుకోండి.

ఇది ఎలా చేసుకోవాలి అన్న దానికి పూజ్య గురుదేవుల ఆత్మకథలోని "రెండు మనస్సుల మల్ల యుద్ధము" అనే (9వ) అధ్యాయము అతి జాగ్రత్తగా అధ్యయనం చేయండి.

అంతేగాక "భావ సంవేదనల గంగోత్రి" పుస్తకమును, దానిలో చెప్పిన విషయము పూర్తి ఆచరణలోకి వచ్చేంత వరకు తిరిగి తిరిగి చదవండి.

"యుగ నిర్మాణ యోజన సత్సంకల్పములలో" ప్రతీ రోజు రాత్రి పడుకునే ముందు ఎన్ని సంకల్పాలను ఆచరణలో పెట్టారో డైరీలో వ్రాయండి.

☹ ఇంతకు ముందు పంపించిన రెండు ఉత్తరాలలోని మిగతా కార్యక్రమాలన్నీ ఈపాటికి ఆచరణలో పెట్టేసి ఉంటారు అని ఆశిస్తున్నాను.

ఆచరణలో పెట్టిన వ్యక్తుల చిరునామాలు, వారి వయస్సు, వృత్తితో సహా హరిద్వార్ మాతాజీకి సాధనా వివరములు తెలుపుతూ పంపించండి. మాకు కూడా ఒక కాపీ పంపించండి.

ॐ ఇప్పటి వరకు చేస్తున్న కార్యక్రమాలకు ఇంకొక రెండు కార్యక్రమాలు జత చేయండి.

### 1. బలివైశ్వ దేవహవనము

ప్రతి ఇంట్లో అన్నము వండగానే ఒక చిన్న చెంచా ఉడికిన అన్నము తీసుకుని, చల్లారిన తరవాత రెండు చుక్కలు నెయ్యి వేసి, ఒక చిటికెడు బెల్లము పొడి వేసి గుజ్జులాగ కలపండి. దీనిని 5 చిన్న చిన్న ఉండలుగా చేయండి. (ఉండల పరిమాణము కంది బద్ద అంత ఉంటే చాలు). సన్నని చితుకులతో అతి చిన్న మంట తయారు చేయండి. దానిలో ఒక్కొక్క ఉండను గాయత్రీ మంత్రానికి స్వాహా కలిపి "ఇదం గాయత్ర్యై ఇదం నమమ" అంటూ 5 సార్లు 5 ఉండలను వేసేయండి.

❋ పై ప్రక్రియ చేసే ప్రతి కుటుంబము రాబోయే కరువు కాటకాలలో ఆహారానికి లోపం లేకుండా ఉంటుంది.

### 2. స్వాధ్యాయము

వారానికి 3 సార్లయినా (మూడు అరగంటలు) లేక వారానికి ఒక రోజు ఒక గంట స్వాధ్యాయము చేయాలి.

ఇది మౌనము పాటించే రోజులలో ఉండకూడదు.

స్వాధ్యాయానికి ప్రస్తుతము పైన చెప్పిన "భావ సంవేదనల గంగోత్రి" మరియు ఆత్మకథలోని "రెండు మనసుల మల్లయుద్ధము" మొదలెట్టండి.

❋ చదివి బాగుంది అనుకొనుట కాదు కావలసింది, ఆ చదివిన దానిని మన జీవితములో ఎంత వరకు ఆచరణలో పెట్టామో చూసుకోండి.

ఐదు పూర్ణిమలలో ఒక పూర్ణిమ అయిపోయినది. ఇంకా నాలుగు మిగిలి వున్నవి. కాల చక్రభ్రమణము చూస్తూ ఉండగానే తిరిగి పోతుంది.

❋ పూజ్య గురుదేవుల వ్యధ, బాధ, తపన, తొందర అర్థము చేసుకొని, మహాకాలుని చేతిలో నేటి అవాంఛనీయతల మీద ఒక "ఆగ్నేయాస్త్రం" గా మనం సంధింపబడాలి అంటే సాధనలోని తీవ్రతను పెంచండి.

మీలోని చిన్న చిన్న కోరికల్ని భస్మము చేసుకొని,
పూజ్య గురుదేవుల అనుంగు శిష్యులుగా రూపొంది,
హిమాలయాలలో ఉన్న దివ్య పురుషులతో భుజములు కలిపి,
ఒక దధీచి, ఒక విశ్వామిత్రుడు, ఒక వశిష్ఠుడుగా మీరు మారతారని ఆశిస్తూ,

మీ
శ్రీరామకృష్ణ

P.S. : సాధనలో తీవ్రత పెంచుకుంటూ, ఇతరులు, కుటుంబ సభ్యులయినా మనతో కలసి రావడం లేదని బాధపడవద్దు. నేను చెప్పిన ఎదురెదురుగా వున్న వేశ్యా - సన్యాసి కథ గుర్తుతెచ్చుకోండి.

అందరూ కలసి ముందుకు వెళ్ళడం మంచిదే,
అందరూ కలసి సాధన చేయుట మంచిదే.
కానీ ఎవరో సాధన చేయుట లేదని ఆలోచిస్తూ కూర్చుంటే మన మనస్సులు పరిష్కరించబడుట కుదరదు.

R.K.

P.S. : "కల్పసాధన" పుస్తకంలోని 70 నుండి 91 వ పేజీ వరకు ఇవ్వబడిన మూడు ముద్రలు, మూడు ప్రాణాయామాలు, మూడు యోగాలు ధ్యాన పూర్వకముగా చదివి, మీకు నచ్చినవి నిర్ధారించుకొని, మరుసటి రోజు నుంచే సాధన మొదలు పెట్టవలసినదిగా కోరుచున్నాను. R.K.

❋✣❋✣☆✣❋✣❋



## ఎప్పటికీ ఆరిపోని మండే అగ్నికణాన్ని నేను

సుధాబీజ్ బోనేసే పహలే కాలకూట్ పీనా హోగా
పహన్ మౌత్‌కా ముకుట్ విశ్వహిత్ మానవ్‌కో జీనా హోగా

(అమృత బీజములు నాటే ముందు కాలకూట విషాన్ని త్రాగాలి.
విశ్వశ్రేయస్సు కోసము మృత్యువు అనే కిరీటాన్ని పెట్టుకుని మానవుడు జీవించవలసి ఉంటుంది.)

ఇవి 50 సంవత్సరాల క్రిందట అఖండజ్యోతి మాసపత్రికలో మొదటి పేజీలో అచ్చు అయిన మొదటి పంక్తులు.

ఈ పంక్తులు వ్రాసిన యుగపురుషులు, పండిత శ్రీరామశర్మ ఆచార్య స్వయముగా విశ్వమంతా వ్యాపించి ఉన్న దుష్ప్రవృత్తుల హాలాహలాన్ని త్రాగి, జీవచ్ఛవాలలో అమృతము పోసి, అనేక కోట్ల మందికి సంజీవనిని రుచి చూపించి, జూన్ 2, 1990 గాయత్రి జయంతి నాడు తన చేతనత్వమును గాయత్రీలో కలిపేసి, తన భౌతిక జీవితము మీద తెరదించివేశారు.

❋ పూజ్య గురుదేవుల 80 సంవత్సరముల జీవితము యొక్క ప్రతి నిమిషమును విశ్లేషణ చేసి చూస్తే, అనేక గ్రంథములు వ్రాయవచ్చును. ఆయన వ్యక్తిత్వాన్ని, కర్తృత్వాన్ని మాటల ద్వారా కాగితము మీద పెట్టలేము.

❋ ఆయన వంటి బహుముఖ వ్యక్తిత్వముగల యుగపురుషుని "నిష్కళంక ప్రజ్ఞావతారము"గానే గుర్తించగలము.

శ్రద్ధాంజలి రూపముగా ఈ చిన్న పుస్తకములో "యుగపురుష్ కో ఏక్ పావన్ శ్రద్ధాంజలి" అనే అఖండజ్యోతి యొక్క ఆగస్టు, సెప్టెంబరు 1990 సంయుక్త అంకములోని గురుదేవుల జీవన విధానము ఒక స్మారికగా ఇస్తున్నాము. బీజరూపములో సుసంస్కారాలు నిద్రించి ఉన్న వ్యక్తులు దీని వల్ల ప్రేరణ పొందగలిగితే, అదే ఆ గురువుకు నిజమైన శ్రద్ధాంజలి.

❋✣❋✣☆✣❋✣❋

విశాఖపట్నం,
9-5-91

ప్రియ గాయత్రీ పరిజనులకు,

నమస్కారములు !

- మౌనము,
- ముందు గదిలో పంచ దేవతా పటము పెట్టి బయటకు వెళ్తున్నప్పుడు రక్షణ వలయంలో ఉండుట,
- యుగనిర్మాణ యోజనా సత్సంకల్పములు ప్రొద్దున్న, సాయంత్రము చదివి, పడుకొనే ముందు ఆచరించిన సూత్రములను డైరీలో గుర్తు పెట్టుకొనుట,
- కుటుంబ సభ్యులు అందరు కలసి 18 సార్లు గురుదేవుల లయతో గాయత్రీ మంత్రోచ్చారణ చేయుట,
- పగలు పూట అన్నము వండిన తరవాత బలివైశ్య దేవ హవనం చేయుట (ఇది రాత్రి చేయనక్కరలేదు),
- ఒక రోజు మౌనము అరగంట సేపు, రెండవరోజు అరగంట సేపు స్వాధ్యాయము చేసుకొంటూ ఉండి ఉంటారు అని ఆశిస్తున్నాను.
- ఈపాటికి కల్పసాధనలో ఉన్న 70 నుండి 91 వ పేజీ వరకు ఇవ్వబడిన విషయములు ఆకళింపు చేసుకుని సాధన యొక్క మొదటి చరణము దాటుతున్నారు అని నమ్ముతున్నాను.

✣ దుర్లభమైన మానవ దేహం పొంది పూజ్య గురుదేవులు వంటి మహా పురుషుని అడుగు జాడలలో కొన్ని అడుగులు వేసిన తరువాత ఇప్పుడు నీరస పడితే, అనంతమైన లాభం బదులు చాలా నష్టపోతాము.

అందువల్ల ఎలాగో అలాగ కుటుంబ సభ్యులు అందరూ కలసి అతి తీవ్ర ప్రయత్నంతో మానవజాతిని మహోన్నత శిఖరాలకు తీసుకుని వెళ్ళగలిగే సాధకులుగా రూపొందవలసిన అవసరం చాలా ఉంది.

✣ సాధారణంగా మానవ సమాజానికి తాము చేసే పిచ్చి పనుల ఫలితాల నుంచి తప్పించుకోవటానికి భగవంతుని అవసరం ఏర్పడుతుంది.

కానీ యుగసంధి కాలములో, ప్రస్తుత పరిస్థితులలో, ముఖ్యంగా మహాకాలుని సమగ్ర ప్రణాళికను మనకు నేరుగా అందించే పూజ్య గురుదేవుల శిష్యుల అవసరము భగవంతునికి ఏర్పడింది.

✣ మనిషి భగవంతుడి వెంటపడే రోజులు పోయి, భగవంతుడే మనిషి వెంటపడే ఈ స్వర్ణిమకాలంలో రోజుకు 2, 3 గంటల్ని సాధనకు వెచ్చించలేక, కేవలం బద్ధకంతో, నిర్లక్ష్యంతో ఈ అవకాశాన్ని పోగొట్టుకోవద్దని అనేక సార్లు నీరు నిండిన కనులతో గురుదేవులు అడుగుతూనే ఉన్నారు.

పూజ్య గురుదేవులకు తగిన శిష్యులుగా మారటానికి,
ఆయన ఋణము తీర్చుకొనుటకు ఇంకా 9 సంవత్సరాల వ్యవధి ఉన్నది.
అందువల్ల నిద్రలేచిన సింహాల వలే ఏ మాత్రము ఆలస్యము చేయకుండా
పై కార్యక్రమాలన్ని ఆచరణలో పెట్టి, తరువాత చేయవలసిన కార్యక్రమాల స్థాయిని
అందుకొనుటకు తయారుగా ఉంటారని ఆశిస్తూ,

మీ
శ్రీరామకృష్ణ

P.S.: ఈ లెటర్‌తో పాటు పంపించిన శ్రద్ధాంజలి పుస్తకములోని 7 అధ్యాయాల యొక్క సారాంశములను మళ్ళీ మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.

R.K.

గుంటూరు.
28-6-91

ప్రియమైన గాయత్రీ పరిజనులకు,

నమస్కారములు!

మహాకాలుని సందేశము, పూజ్య గురుదేవుల ఆదేశము, వందనీయ మాతాజీ సంరక్షణలో అతివేగంగా పయనిస్తున్న ఈ 20వ శతాబ్దపు చివరి దశాబ్దము మన గాయత్రీ పరివార్ సభ్యులకు, వారి మిత్రులకు, బంధువులకు ఒక విశిష్ట ఛాలెంజ్‌గా, సవాలుగా ముందుకు దూసుకు వస్తోంది.

☆ మౌనము, జపము, ధ్యానము తీవ్రత పెంచుటయే గాక కాలపరిమితిని కూడా పెంచండి.

- మీకు వీలయినప్పుడు కనీసము రోజుకి మూడు అర గంటల కాలాన్ని కేటాయించండి. ఇది కనీసపు పరిమాణం. ఇంకా ఎంత పెంచగలిగితే అంత పెంచండి. కానీ ఈ కార్యక్రమాల వల్ల మీ నిత్య జీవితపు కార్యక్రమాలకు ఏ విధమైన ఆటంకము కలుగకుండా చూసుకోండి.

☆ యుగనిర్మాణ యోజన సంత్సంకల్పములు - 18, యుగ యజ్ఞ మంత్రములు - 14, గాయత్రీ చాలీసా, గాయత్రి హారతి కుటుంబములో సభ్యులందరికి జూలై 20వ తేది లోపల కంఠతా వచ్చేటట్లు చూడండి (ఎవరినీ బలవంత పెట్టవద్దు).

1994 గురుపూర్ణిమ నాటికి మనలోని చాలామంది రాజసూయ యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి తమని తాము నరమేధ యజ్ఞానికి అన్ని రకాలుగా పాత్రత సంపాదించుకుంటారనే ఆశిస్తున్నాను.

దీనికి నాందిగా అక్టోబరు 1991 నవరాత్రి విశేష అనుష్ఠానములో సాధన అతి తీవ్రస్థాయికి చేరుకొని, రాబోయే రోజుల్లో నిత్యము మన సాధనా తీవ్రతను ఏ స్థాయిలో మెయిన్‌టెయిన్ చేయాలో తెలుసుకుందాము.

అందువల్ల వీలైనంత మంది నవరాత్రి సాధనా కార్యక్రమాలలో (నవరాత్రి సాధనా ప్రక్రియలో) మీ కుటుంబ, వ్యక్తిగత సమస్యలను ప్రక్కన పెట్టి తప్పక పాలు పంచుకొనండి. అంతేగాక క్రొత్తవారిని కూడ ఈ సాధనలో పాలుపంచుకోడానికి ప్రోత్సహించండి. ప్రస్తుతము ఈ కార్యక్రమము ఒంగోలులో నిర్వహిద్దామని అనుకుంటున్నాము. మహాకాలుని ఈ విశిష్ట ఆహ్వానాన్ని తప్పక ఉపయోగించుకొనండి.

☆ రోజల్లా సాధ్యమైనంత వరకు డీప్ బ్రీతింగ్ చేస్తూ ఉండండి. కాని అలసట వచ్చేటట్లు చేయకండి. చేసే విధానము తెలియకపోతే చీరాల కేంప్‌కు వచ్చిన వాళ్ళని అడగండి.

☆ మొత్తము సాధనా రహస్యం, సాధనలోని పరిపక్వత, సాధన యొక్క సిద్ధి ఈ డీప్ బ్రీతింగ్ అలవాటులోనే ఉన్నది.

మీ నిత్య కార్యక్రమములలో పైన చెప్పినవన్నీ చేస్తూ,
స్వాధ్యాయ సత్సంగాలను మరవకండి.

మీ
శ్రీరామకృష్ణ



గుంటూరు
11-8-91

గాయత్రీ పరిజనులకు

నమస్కారములు!

1991 నుంచి 2000 సంవత్సరము వరకు మానవ జాతి వికాస క్రమానికి ఒక కొత్త మలుపు యిచ్చి, 84 లక్షల జీవరాసులతో సహా ఈ మొత్తము భూగ్రహమును అమృతత్వస్థాయికి తీసుకొని వెళ్ళి, ఈనాడు పవిత్ర గ్రహములలో ఒకటికాని ఈ గ్రహమును, పవిత్ర గ్రహముగా మార్చవలెనని విశ్వప్రణాళికను నిర్ణయించే "అతి ముఖ్య మహాత్ముల కూటమి" సంకల్పించినది.

✡ 1910-11 సంవత్సరములు మానవజాతి వికాస పరిణామ చరిత్రలో చాల విశిష్టమైన ప్రాముఖ్యతను సంతరించుకున్న సంవత్సరములు.

- ఏప్రిల్ 1910లో శ్రీ అరవిందులు తమ పూర్ణయోగాన్ని ప్రారంభించారు.
- అదే సంవత్సరము మే నెలలో మాస్టర్ సి.వి.వి. తన భృక్తరహిత తారక రాజయోగాన్ని అందించారు.

అంతవరకు సూక్ష్మ శరీరంతో చేయబడే రాజ యోగము, నశ్వరముగా భావించబడిన స్థూల జగత్తును పరిపూర్ణ అమరత్వం వైపుకు తీసుకు వెళ్ళే ప్రయత్నాలు తీవ్రముగా ఆరభించిన రోజులవి.

✡ (?) 1914-16 సంవత్సరాలలో శ్రీ శిరిడీ సాయిబాబా మూడు రోజులు తన శరీరాన్ని విడచి మానవ జాతికి సంజీవిని విద్యను ప్రసాదించుటలో భాగంగా సూక్ష్మ జగత్తులో జరిగిన ఒక రహస్య సమావేశంలో పాల్గొని వచ్చిరి (ఇటువంటి ప్రయత్నమే భక్త తుకారాం కూడా చేసి సాధించారు). అలా తిరిగి రాగలుగుటయే సంజీవిని విద్యకు భూమి మీద పరిస్థితులు అను కూలంగా ఉన్నాయని తెలుపుతోంది.

✡ 1861వ సం॥లో ఇటువంటి ప్రయత్నమే బాబాజి అనే సాంకేతిక నామముతో "భూమి ఉన్నంత వరకు నేను, నా చెల్లెలు మాతాజీతో కలసి మృత్యువును అధి గమించి ఉంటాను" అని వాగ్దానము చేస్తూ లాహిరీ మహాశయుని ద్వారా అమరత్వ సిద్ధికి అనువైన ప్రథమ సోపానాలు ఏర్పరిచారు.

✡ 1910వ సం॥లో జూలై 26వ తేదీన శుక్రగ్రహం నుండి యోగసాధకులకు అమృతసిద్ధి గావించుటకు సంజీ విని విద్యకు అధినాధుడైన శుక్రుడు అంగీకరించెను.

- 1918వ సం॥లో శ్రీ శిరిడీ సాయిబాబా శివశక్తిని మాత్రమే ఉపయోగించుకున్న శరీరాన్ని వదిలి, అర్ధ నారీశ్వర పరిపూర్ణత వల్ల అమరత్వానికి దగ్గరగా వెళ్ళే భౌతిక శరీర నిర్మాణానికి ప్రయత్నాలు మొదలెట్టారు.
- అదే సంవత్సరములో క్రియాయోగ దీక్ష ప్రాక్ పశ్చిమా లలో సమన్వయ పరచిన పరమహంస యోగానంద వైదిక ప్రమాణాల ఆధారంగా "యోగదా సత్సంగ బ్రహ్మచర్య విద్యాలయాన్ని" స్థాపించారు.

✡ 8 సంవత్సరాల తరువాత 1926 నవంబరులో శుక్ర గ్రహము నుంచి వచ్చిన ఈ అంగీకారము భూమి మీద జ్యోతి కిరణ జల్లులుగా వర్షించటాన్ని శ్రీ అరవిందులు ధృవీకరించారు.

- అదే నెల 23వ తారీఖున శ్రీ సత్యసాయి బాబా అవతరణ జరిగినది.

ఈ విధముగా లాహిరీ మహాశయ - బాబాజీ, పరమహంస యోగానంద - యుక్తేశ్వర్ గిరి, మేడమ్

బ్లావెట్స్కీ - మాస్టర్ మౌర్య, మాస్టర్ సి.వి.వి. - మాస్టర్ ఇ.కె. - శిరిడీ సాయి - సత్యసాయి - ప్రేమ సాయి (?), శ్రీరామశర్మ ఆచార్య - సర్వేశ్వరానందజీ ...(?), తాతయ్యగారు- ప్రభాకరశాస్త్రిగారు వారి వారి సమూహాలతో,

2000 A.D. నాటికి పృథ్వివి కూడ పవిత్రగ్రహంగా మార్చివేసి తీరుతామని 1857వ సం॥ మే నెలలో సంకల్పము తీసుకున్నారు.

✡ భౌతిక జగత్తులో ఆ సంవత్సరమే భారతీయ స్వాతంత్ర్య సంగ్రామంగా ప్రకటీకరింపబడినది.

- దీని తరువాత వరుసగా జరిగిన సంగ్రామాలన్నీ కూడ భూమి మీద అమృతత్వాన్ని తీసుకురావడానికి పరమ గురువులు చేసే ప్రయత్నాలకు చిహ్నాములు.

✡ ప్రథమ ప్రపంచ మహాయుద్ధకాలంలో (1914-18) స్థూల శరీరంలోని పరమాణువుల వికేంద్రీకరణ జరిగి నూతన యోగాభ్యాసానికి అనువైన శరీర నిర్మాణాలు జరిగాయి.

✡ ద్వితీయ ప్రపంచ మహాయుద్ధము (1939-45) లో సూక్ష్మజగత్తులో జరిగిన మార్పులు ఊహాకే అందవు.

- ముఖ్యముగా Jews బాధలన్నిటికి కారణము,
- హిట్లర్ ఉన్నతికి - అవనతికి కారణమైన Spear of Destiny (Jesus Christ ను శిలువవేసినప్పుడు రోమన్ సైనికుడు ప్రక్కటెముకలో గ్రుచ్చిన బల్లెము) పాత్ర,
- హిమాలయాలలో ఉన్న Green Lodge పాత్ర,
- Rudolph Steiner అనే పరమ గురువుల శారీరక ఆయుధము పాత్ర, చాలా మందికి తెలియదు.

కానీ ద్వితీయ ప్రపంచ మహాయుద్ధము జరిగిన సంవత్సరాలలో ఇటు అధ్యాత్మికముగా, అటు రాజనీతి కంగా U.N.O. నిర్మాణానికి దారితీసిన పరిస్థితులకు సూక్ష్మ జగత్తులోని అమరత్వ నిర్మాణ శక్తిధారలు ఏవిధంగా పని చేస్తున్నాయో గుర్తించగలిగితే,

రమణ మహర్షి, యోగి అరవిందులు, మాస్టరు C.V.V., మాస్టరు E.K., పండిత శ్రీరామశర్మ ఆచార్య, శిరిడీ సాయి, సత్యసాయి ప్రయత్నాలలో అంతర్లీనంగా ఉన్న సూక్ష్మశక్తిధారలేగాక, కారణ జగత్తు నుంచి వెలువడుతున్న బ్రహ్మాండమైన శక్తిధారలు ఈ పది సంవత్సరాల (1990 - 2000) కాలంలో పృథ్వీ గ్రహమును ఎంత గొప్పగా తీర్చి దిద్దుతుందో మనము ఊహించగలుగుతాం.

ఊహల ద్వారానే పనులు జరిగిపోతే యిన్ని ప్రయత్నాలు అనవసరం.

గురువుల ఊహలకు నిర్దిష్టమైన రూపము యిచ్చి తీరుతామని ప్రతిజ్ఞ చేసిన వారి శిష్యులందరూ వ్యక్తిగత గురుసాంప్రదాయాల పరిధిలోనే యిరుక్కుని పోయి, తమ గురువుల లక్ష్యాన్ని గుర్తించక, అత్యున్నతమైన ఈ సమయాన్ని వృథా చేయకుండా,

అన్ని శిష్యవర్గములు ఒకే శిష్యసముదాయముగా మారి,
గురుతత్వ రహస్యాన్ని అర్థము చేసుకొని,
అమృతత్వముతో నిండిపోయే నవసమాజానికి బీజములుగా మారి,
2000 సంవత్సరము నాటికి గురువులు ఆశించిన సమాజాన్ని
పృథ్విపై మనమందరము తీసుకురాగలమని ఆశిస్తూ,

మీ
శ్రీరామకృష్ణ.

P.S. : ఇంతకు ముందు పంపిన ఉత్తరములన్ని చదివిన తరువాత ఈ ఉత్తరమును చదవండి.

కృష్ణాష్టమి, 2.9.91
విజయవాడ

ప్రియమైన గాయత్రీ పరిజనులకు

నమస్కారములు!

గాయత్రీ సాధన, తద్వారా భౌతిక జీవితంలో ప్రతిబింబించే సావిత్రి గురించి ఈ 5 పూర్ణిమలలో చాలా విశదంగా సాధన చేస్తూ చర్చించుకున్నాము.

♣ ప్రకృతిలో ఉండే 3 విశిష్ట శక్తిధారలకు త్రివేణీ సంగమము లాంటిదే, త్రిపదా గాయత్రి.

మానవశరీరంలో యిడ, పింగళ, సుషుమ్నా నాడులుగా,
భారత దేశంలో గంగ, యమునా, సరస్వతులుగా,
ప్రకృతిలో జీవశక్తి, ప్రాణశక్తి, కుండలినీ శక్తులుగా,
ఈ విరాట్ ప్రపంచంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా,
సాధనా మార్గంలో బ్రహ్మ, విష్ణు, రుద్రగ్రంధుల భేదనగా మనము అర్థము చేసుకున్న ఈ గాయత్రి మంత్ర స్వరూపము సకల శాస్త్రాల నిలయము.

సాధన అనేది ఒక కురుక్షేత్రమే,
ఒక మహాభారతమే.

✧ అందువల్ల సాధనలో తీవ్రత పెంచినప్పుడు వ్యక్తిగతంగా ఆరోగ్య, స్నేహాల పరిధిలో ఒడుదుడుకులు, కుటుంబ వ్యవస్థలో కీచులాటలు, సామాజికంగా తీవ్ర మనస్తాపము కలిగించే సన్నివేశాలు, మీ జీవితాలలో కాని, మీకు తెలిసిన గాయత్రీపరివార్ సభ్యుల జీవితాలలో కాని వచ్చి ఉండవచ్చును.

✼ ఈ పరిస్థితులు సహజమే గాక, మీ సాధన పరిపక్వ స్థితిని పొందుచున్నది అని తెలిపే చిహ్నములు.

అందువల్ల బాహ్య పరిస్థితులు మీకు ఎంత ఆందోళన కలిగించినను, సంఘటనలు ఎంత అరుచికరమైనవి అయినను, పరస్పర సంబంధాలు ఎంత వత్తిడికి గురి అయినను మీరు ఏ మాత్రము తొణకకుండా నిలబడి, ఈ 5 పూర్ణిమలు పూర్తిచేసినందుకు నా హృదయ పూర్వక అభినందనలు స్వీకరించండి.

❀ కానీ ఇది ఆరంభం మాత్రమే.
చివరి దశాబ్దంలోని మొదటి సంవత్సరం మాత్రమే.

శ్రీ మనము అందరం కలసి ఇంకా ఎన్నో శిఖరాలను అధిరోహించాలి.
- ఎంతో మందిని కలుపుకొని ముందుకు సాగాలి.

శ్రీ దీని కోసమే మన జీవితంలో మనస్సును ద్వంద్వాలకు అతీతంగా ఉంచుకోండి.
- వ్యక్తులలో ద్వేషాలను పెరగనీయకండి.

శ్రీ మనం సామరస్యతను సాధించాలి.
- దానికి ఎన్ని రకాల త్యాగాలను ఇవ్వవలసి వచ్చినా, మన వ్యక్తిత్వాన్ని అహంకారాన్ని ప్రక్కన పెట్టవలసి వచ్చినా ఏమాత్రము సందేహించకండి.

❂ అనుక్షణము మీ హృదయంలో అందరి మీద (నచ్చని వాళ్ళ మీద, నచ్చిన వాళ్ళ మీద) ప్రేమ తరంగాలను ప్రసరింప చేయండి. మీరే ప్రేమమూర్తులైపొండి. ఎవరి మీద అసహనంకాని, చికాకుగాని రానివ్వకండి.

శ్రీ ఈ 5 పూర్ణిమలలో నాటిన విత్తనములు రాబోయే వసంత పంచమిలోగా ఆరోగ్యవంతమైన మొక్కలుగా మనం మారుతూ, ప్రతివ్యక్తి ఇంకొక 25 మంది చేత గాయత్రీ మంత్రము చేయిస్తాను అనే దీక్ష తీసుకోండి.

ఎప్పుడో వేల వేల సంవత్సరాల తరవాత లభించే అవకాశము,
అంతేగాక అతి విశిష్టమైన గురువును సంపాదించుకున్న మనము,
ఈ చివరి రోజులలో గురువుకు నిరాశ కలిగించకుండా ప్రవర్తించాలని దీక్ష తీసుకుందాము.
ఇప్పటి నుంచి జరిగే ప్రతి సాధనా శిబిరానికి అత్యవసర పరిస్థితులలో తప్ప పాల్గొనకుండా
ఉండము అనే నిర్ణయాన్ని తీసుకుంటారని ఆశిస్తూ,

మీ
శ్రీరామకృష్ణ



విజయవాడ
4.9.91

ప్రియమైన గాయత్రీ పరిజనులకు,

నమస్కారములు!

పూజ్య గురుదేవుల జీవితం అంతా "సాధన వల్ల సిద్ధి" అనే సందేశాన్ని తెలుపుతుంది.

- సాధన పరంగా మనము తయారు చేసుకోవలసిన మనోభూమిని ఆయన "ఆత్మకథ"లో వివరించారు.
- పంచకోశ జాగరణ - సాధనా శిబిరానికి ముందు రెండు మనస్సుల మల్లయుద్ధము, నాలుగు హిమాలయ యాత్రలు, పంచ వీరభద్రసాధన ద్వారా ఆయన సాధించదలచుకున్న లక్ష్యములను హృదయంగమము చేసుకోండి.
- డీప్ బ్రీథింగ్, మౌనము, ధ్యానము మరవవద్దు.
- గుర్తు వచ్చినప్పుడల్లా అందరూ సుఖంగా వుండాలనే భావతరంగాలను అన్ని వైపుల ప్రసారణ చేయండి.
- పరస్పరము అవగాహన తగ్గిన మిత్రులతో కలిసి తిరిగి ప్రేమమయ వాతావరణము నిర్మించటానికి ప్రయత్నించండి.
- యుగసంధి కాలంలోని ఈ 10 సంవత్సరములు సమాజ నిర్మాణానికి ఎంత ప్రాముఖ్యత సంతరించుకున్నవో, వ్యక్తిగత నిర్మాణానికి, వ్యక్తిగత సాధనలో ఉత్కృష్టస్థితిని అందుకొనుటకు ఇంకా ఎక్కువ ప్రాముఖ్యత కలిగిన రోజులని మరచిపోవద్దు.
- "మనం మారితే యుగం మారుతుంది" అని పిలుపు నిచ్చిన గురుదేవుల వాక్యాలను మరువవద్దు.

సాధనలోని తీవ్రత ఇంకా, ఇంకా పెంచండి. దానితో సమానంగా ప్రేమతత్వము పెరిగి అందరూ కలసి మెలసి జీవించగలిగే వాతావరణాన్ని నిర్మించండి.

ఋషులు అందించిన అన్నింటికంటే శ్రేష్ఠమైన, పంచముఖీ గాయత్రీ సాధన శ్రీశైలంలో చేయబోతున్నాము. దానికి ముందుగా గురుదేవులు హిందీలో వ్రాసిన ముఖ్య అంశములను స్వాధ్యాయము కొరకు (గాయత్రీ మహావిజ్ఞాన్ - 3వ భాగము) మీ ముందుంచుచున్నాను. (మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశముల సంక్షిప్త వివరణ త్వరలో పంపిస్తాను.)

దీనిని కలిసి చదివి, అనేక మంది చేత చదివించి, తెలుసుకోవాలి అనుకున్న విషయములు ఒకచోట వ్రాసుకొని, దానిని అక్కడున్న వ్యక్తులతో చర్చించుకొని, ఆచరణలో పెట్టగలిగే సాధనలు ఆచరణలో పెట్టేసి (?),

ఒక స్పష్టమైన అవగాహనతో శ్రీశైలం క్యాంపుకు రమ్మని కోరుతూ,

మీ
మారెళ్ళ శ్రీరామకృష్ణ



గుంటూరు
16.9.91
8.55 పి.ఎమ్.

ప్రియమైన గాయత్రీ పరిజనులకు,

నమస్కారములు!

వందనీయ మాతాజీ ఈ సంవత్సరమును "శక్తి సాధన" సంవత్సరముగా ప్రకటించిరి.

పృథ్వీ గ్రహపు చరిత్రలో, ఇక్కడ వికాసక్రమాన్ని పొందుచున్న 4 కక్ష్యలకు (ఖనిజ, వృక్ష, జంతు, మానవ సముదాయాలు) యుగసంధికి సంబంధించిన ఈ పది సంవత్సరములు నిర్ణయాత్మకమైనవి.

✳ మనమందరము ఒక విశిష్ట కార్యసాధన కొరకు పూజ్య గురుదేవుల ద్వారా గుర్తించబడి ఎన్నుకోబడ్డ వారమే.

- భూమి మీద తీసుకురావలసిన, మనము ఈనాడు ఊహించలేని పరిస్థితులకు, ఈ 10 సంవత్సరాల కాలములో మొదటి సంవత్సరము అంతా కూడా ఒక విధంగా బీజారోపణ కాలమే.

♣ భూమి మీదకు వచ్చే అనేక రకాలైన శక్తిధారలను మూడు రకాలుగా వర్గీకరణ చేయవచ్చు.

① జీవశక్తి - ఖనిజ చేతనత్వము - Animal Magnetism - స్థూల జగత్తు - భూర్ - జాగ్రదావస్థ మొ॥.

② ప్రాణశక్తి - వృక్ష చేతనత్వము - Group Consciousness - రజో గుణము - విష్ణు లేక పాలనా శక్తి - సూక్ష్మ జగత్తు - భువః - స్వప్నావస్థ - మొ॥.

③ కుండలినీ శక్తి - జంతు చేతనత్వము - Cosmic Consciousness - సత్వ గుణము - బ్రాహ్మీ లేక సృజనాత్మక శక్తి - Electricity or Light - కారణ జగత్తు - స్వః - సుషుప్తావస్థ మొదలైనవి..

బీజారోపణ కార్యక్రమాలు ఈ మూడు శక్తిధారలను ఉపయోగించుకొని చేయాలి.

♣ ఈ మూడు శక్తి ధారలు త్రివేణి సంగమము వలె ఒకేచోట కలసి ప్రవహించినా, తమ వ్యక్తిగత విశిష్ట గుణములను కోల్పోవు.

✧ త్రివేణిలో సరస్వతివలె - బ్రాహ్మీ - కుండలినీశక్తి <u>అంతర్వాహిణిగా</u> ప్రవహిస్తూ ఉంటుంది. (Externalisation of Hierarchy - ప్రకటీకృత క్రమానుగత శ్రేణి)

✧ గంగ వలె <u>ఉత్తరాయణ శ్వేత మార్గములో</u> ప్రాణశక్తి పనిచేస్తుంది.

✧ యమునా నది వలె జీవశక్తి <u>దక్షిణాయన కృష్ణ మార్గములో</u> పని చేస్తుంది.

ఈ మూడు శక్తులు పరస్పరము మిళితము కావు.

***మన శరీరంలో కూడా,***

స్థూల శరీరము <u>(యమున)</u>,

సూక్ష్మ శరీరము అనగా ప్రాణమయ, మనోమయ కోశములు <u>(గంగ)</u>,

కారణ శరీరము అనగా విజ్ఞానమయ, ఆనంద మయ కోశములు <u>(సరస్వతి)</u>

త్రివేణి వలె కలసి వున్న భిన్న, భిన్న మార్గాలలో ప్రయాణిస్తాయి. గమ్యము ఒకటిగా వుంటే వీటి మధ్య సామరస్యము ఉండి ఓజస్సు - తేజస్సు - వర్చస్సుల సమ్మిళిత ప్రభావము తుష్టి, పుష్టి, శాంతినిస్తాయి.

✳ బీజారోపణ కార్యక్రమము ఈ మూడు శక్తి ధారల మధ్య సమన్వయము కుదర్చటమే.

గాయత్రీ పరివార్ సభ్యులు అందరూ సమయ, ఇంద్రియ, వాక్, అర్థ సంయమనము వల్ల వ్యక్తిగత స్థూల జగత్తుల శక్తి ప్రవాహాలను తమ అధీనములోనికి తెచ్చుకొను చున్నారు.

- <u>ప్రతి సాధకుడు ఇదివరకు వ్రాసిన ఉత్తరాలలో ఇవ్వ బడిన సూచనలు పాటిస్తూ ఈ నాలుగు సంయమన ముల ఆచరణలో ఎంత కృతార్థులవుతున్నారో నోట్ చేసుకొనవలయును.</u>

- అంతేగాక ప్రతి సాధకుడు ఇంకొక 24 మంది సాధకు లను సాధ్యమైనంత త్వరగా, తనతో కలిపి 25 మంది గల సాధకుల సమూహాన్ని తయారు చేసుకొని, ఈ 10 సంవత్సరాల కాలంలో వారందరూ ఒకే త్రాటి మీద నడిచేటట్లు చూసుకోవాలి.

- అంటే ఈ సమూహములో ఎవరి మధ్య ఏ విధమైన టువంటి అతి స్వల్పమైన భేదాభిప్రాయములు కూడా లేకుండా ఉండాలి.

- సూక్ష్మీకరణ సాధన లేక Group Consciousness కి ఆధారము "సహస్రము".

  పూజ్య గురుదేవులు ఒక శ్రావణ పూర్ణిమ సందేశంలో నేను సహస్రశీర్షున్ని అవ్వాలి అనే కోరిక వ్యక్త పరిచారు.

<u>అక్టోబరులో రాబోయే నవరాత్రులలో దీనికి నాంది ప్రస్తావనగా ప్రతీ ఊరిలోను సహస్ర గృహములలో, 10 రోజులలో రోజుకు ఒక గంట చొప్పున గాయత్రీ జపము చేయించాలి అనే సంకల్పము తీసుకుందాము.</u>

- ఏ సాంప్రదాయమునకు చెందినవారైనా,

  ఏ గురువు శిష్యులయినా,

  విశ్వ కళ్యాణము కొరకు, వాతావరణ కాలుష్య నివారణ కొరకు, సూక్ష్మవాతావరణములో సద్బుద్ధి దాయకమయిన దివ్యతరంగాలను పెంపొందించుట కొరకు నవరాత్రులలో ఒక గంట సమయదానము ఇవ్వగలిగిన వయోభేదము లేకుండా స్త్రీ, పురుషులు అందరికీ ఈ ఆహ్వానము వర్తిస్తుంది.

ఇప్పటి నుండి ప్రయత్నముచేసి ప్రతి ఒక్కరూ తమ తమ నివాస గృహాల సమీపములో చాలా ఎక్కువ మందిని ఈ కార్యక్రమము కొరకు అంగీకరింప జేయు టకు ప్రయత్నించండి

అందరూ కలిసి చేసే ఈ ప్రయత్నములో ఒక గంట సమయదానము చేసే (గాయత్రీ జపము కొరకు) వారి సంఖ్య సహస్రము దాటినా పరవాలేదు, దానికి తగ్గకూడదు.

- ఈ లక్ష్యమును సాధించుటకు మన ప్రయత్న లోపం ఉండకూడదు.

ఒంగోలులో జరిగే "నవరాత్రి విశిష్ట శక్తి సాధనా శిబిరము" యొక్క కార్యక్రమాల వివరణ తరువాత వివరంగా వ్రాస్తాను.

ఈ ఉత్తరములో మీరు చేయవలసిన కార్య క్రమములను <u>under line</u> చేశాను. వాటిని ఉత్సాహవంతు లైన పరిజనులతో చర్చించి ఎలా ఆచరణలో పెట్టాలో నిర్ణయించుకోండి.

ఆసురీ శక్తుల ప్రభావము వలన వచ్చే చిన్న చిన్న అవరోధాలను గమనించి,
అవి వృద్ధి చెందక ముందే ఆపివేయండి.
ప్రేమ లక్ష్య సాధనకు మూలము అని మరవకండి.

మీ

శ్రీరామకృష్ణ

గుంటూరు
20.9.91
7.35 ఎ.ఎమ్.

# నవరాత్రులలో విశిష్ట శక్తి సాధనా శిబిరము - ఒంగోలు

(9.10.91 నుండి 18.10.91 వరకు)

ప్రియమైన గాయత్రీ పరిజనులకు,

నమస్కారములు!

క్రిందటి ఉత్తరంలో విశ్వములో వుండే పరస్పరం మిళితం కాని, ఒకదానికొకటి సహకరించుకొనే, మానవ జీవితాన్ని పుష్పింపజేసే 3 శక్తిధారలు గురించి తెలిపాను.

♣ ఈ మూడు శక్తిధారలు ప్రతిదీ 3 అంశములుగా విభజింపబడి, పాడ్యమి నుంచి నవమి తిథి వరకు ఆ సంఖ్యల పొటెన్సీ ద్వారా మానవ శరీర నిర్మాణములో సూక్ష్మ, కారణ శక్తుల తీవ్ర అభివర్ధన చేసి, జంతు స్థాయిలో వున్న వ్యక్తిత్వాన్ని, దేవతల స్థాయికి కూడ మించగలిగేటట్లు చేస్తాయి.

❀ ఈ శక్తి ధారలు (3 x 3 = 9),
ఉగాదిలో వచ్చే రామ నవరాత్రులు, గాయత్రి జయంతి లేక గంగా దశహరా లో వచ్చే నవరాత్రులు మరియు దేవి నవరాత్రులలో,
సప్త ఋషులనబడే విశిష్ట దైవీ చేతనత్వములతో సీరీస్ నుంచి వచ్చే కిరణములను, మన సూర్యుని నుంచి వచ్చే కిరణములను అభివర్ధన చేయగలిగే సిద్ధశక్తిని ఉపయోగించుకుంటాయి.

శ్రీ అందువల్ల ఈ రోజులలో ఏది చేసినా, ఏ మాట వాడినా, ఏ ఊహ మనస్సులో మెదిలినా, అది అనేక రెట్లు పెరుగుతుంది.

❂ ఈనాటి అదుపు చేయలేని, అత్యంత స్వార్థపూరిత పరిస్థితులకు కారణము ఈ 3 x 9 = 27 రోజులు, లేక నక్షత్ర సమూహాల ఉనికిని మరచిపోయి ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించుటయే.

ఈ ఒకటిన్నర సంవత్సరాల కాలములో సూక్ష్మ జగత్తులో ప్రవేశించిన మహా పురుషులు ఈ రహస్యాన్ని ఉపయోగించుకొని తమ, తమ శిష్యవర్గాలలో సక్రమ భావ సంవేదనల గంగోత్రిని ఉద్భవింపజేయ ప్రయత్నిస్తున్నారు.

అందువల్ల ఆధ్యాత్మికతను, గురుత్వమును వైజ్ఞానిక దృష్టికోణముతో విశ్లేషణ చేయగలిగే సాధకులు అందరూ, జాతి, మత, కుల, లింగ, వయో విచక్షణ లేకుండా, సద్బుద్ధి ప్రవర్ధన కొరకు, వాతావరణ కాలుష్య నివారణ కొరకు, విశ్వ కళ్యాణము కొరకూ, రాబోయే నవ రాత్రులలో రోజుకి ఒక గంట సమయదానం యిచ్చి, వారి గురువుల సమ్ముఖములో ఈ ఒక గంట కాలం గాయత్రి జపం చేస్తామనే సంకల్పాన్ని తీసుకుంటారని ఆశిస్తున్నాము.

✺ ఊహించలేని రీతులలో విద్యుత్తును నియామకము చేసే యురేనస్ గ్రహ శక్తిధారలు ఈ భూమి మీద పరమ గురువుల ఆశయసిద్ధికి తీవ్ర విఘ్నములు కలిగించక ముందే మనమందరము గురువులందరిలో ఉండే ఆ దివ్య ప్రేరణ సత్తాను (ఉనికి) గుర్తించి ఒక సమ్మిళిత శక్తిగా రూపొందాలి.

అదే దుర్గా నవరాత్రులలో అన్ని దేవతా శక్తుల సమన్వయమయిన అష్టాదశ భుజములు గల దేవీ అవతరణ కథ. ఇది కథయే కాకుండా అనేకానేక, ప్రాకృతిక శక్తుల కాలానుగుణ్యంగా జరిగే ఒక సునిశ్చితమయిన ఆధ్యాత్మిక - రహస్యమయ దైవీ ప్రేరిత సంఘటన.

ఇందులో మనము నిమిత్త మాత్రులమే.

విశ్వ ప్రణాళికను తెలుసుకొని, గురువుల ఈనాటి కార్యక్రమాల దిశను అర్థము చేసుకొని, ఈ 9 రోజులలో తమ, తమ గురువుల స్వప్నాలకు సాకారరూపము యివ్వగలుగుతాము అని ఆశించే అన్ని గురు సాంప్రదాయాల సోదర శిష్యగణాలను గాయత్రీ పరివార్ ఈ నవరాత్రి సాధనా శిబిరానికి ప్రేమగా, సాదరముగా ఆహ్వానించుచున్నది.

మీ సహకారము, ఆగమనము కొరకు నిరీక్షిస్తున్నాను.

మీ
శ్రీరామకృష్ణ

☆✡☆✡❀✡☆✡☆



గుంటూరు
23.9.91
9.20 పి.ఎమ్.

ప్రియమైన గాయత్రీ పరిజనులకు,

నమస్కారములు!

నవయుగ నిర్మాణము కొరకు కాలపురుషుడు, పరమ గురువులు, పూజ్య గురుదేవులు (కారణ, సూక్ష్మ స్థూల) నిర్ణయించిన చివరి దశాబ్దములోని, మొదటి సంవత్సరపు శక్తి ఉపాసన చేసే నవరాత్రులు ఆసన్నమవుతున్నాయి.

❋ ఈ 9 రోజుల విశిష్ట శక్తి సాధన కార్యక్రమాలలో ప్రతీ సాధకుడు ఆధ్యాత్మికత యొక్క 3 లక్ష్యాలను జ్ఞప్తికి తెచ్చుకోవాలి.

① The Light is out side you.

(బహిర్ముఖ విభిన్న గురువుల సాధనా పద్ధతులు)

ఇక్కడ మనము అందరి సద్గురువుల సాధనా పద్ధతులను విమర్శనాత్మకముగా విశ్లేషణ చేసి, ఆ విభిన్న పద్ధతులలో వున్న ఏక లక్ష్య సాధన కొరకు జరిగే ప్రయత్నాన్ని గుర్తించి,

మనకు అనువైన బహిర్ముఖ సాధనా పద్ధతిని (Ritual) ఈ నవరాత్రులలో ఎన్నుకోవాలి.

② The Light is inside you.

(అంతర్ముఖ సాధన)

ఈ సాధన "అణోరణీయాన్ మహతో మహియాన్", As above, so below. బాహ్య జగత్తులో వున్న ప్రతీదీ మనలో వున్నది లేక బ్రహ్మాండంలో ఉన్నదంతా పిండాండంలో ఉన్నది అనేది ఈ సాంకేతిక వాక్యాల ద్వారా ఎలా చేయాలో తెలుపబడింది.

ఈ సాధనల ద్వారా వియత్ గంగా సూక్ష్మ శక్తి తరంగాల ప్రవాహాన్ని గుర్తించి, నవగ్రహ సమ్మిళిత చైతన్య శక్తిధారలలో పరిణామ క్రమానుసారంగా కొట్టుకు పోతున్న సాధకుడు, వాటి స్వరూప, నిర్మాణ, శక్తిధారల నియమాలను గుర్తించి <u>తన భవిష్యత్ నిర్మాత తానే అవుతాడు.</u>

❋ ఈ నవగ్రహాల ధనాత్మక, ఋణాత్మక శక్తిధారలే దుర్గ యొక్క అష్టాదశ భుజములుగా అనుకొనవచ్చును.

ఈ సాధనా శిబిరములో ద్వాదశ రాశిక్రమము, వాటి ధనాత్మక, ఋణాత్మక శక్తిధారలు రూపొందే 24

గాయత్రీ శక్తి స్వరూపముల గురించి తెలుసుకుందాము. అవి,

> ఆద్యాశక్తి స్తథాబ్రాహ్మీ వైష్ణవీ శాంభవీ తీచ ।
> వేదమాతా దేవమాతా విశ్వమాతా ఋతంభరా ॥
> మందాకిన్య జపాశ్చైవ బుద్ధిసిద్ధి ప్రకీర్తితే ।
> వైదికానితు నామాని పూర్వోక్తాని హి ద్వాదశ ॥

1. ఆద్యాశక్తి 2. బ్రాహ్మీ 3. వైష్ణవి 4. శాంభవి 5. వేద మాత 6. దేవమాత 7. విశ్వమాత 8. ఋతంభర 9. మందాకిని 10. అజప 11. బుద్ధి 12. సిద్ధి అను పన్నెండు శక్తులు ధనాత్మక శక్తులనబడును.

> సావిత్రీ సరస్వతీ జ్ఞేయా లక్ష్మీ దుర్గా తథైవచ ।
> కుండలినీ ప్రాణ గ్నిశ్చ భవానీ భువనేశ్వరీ ॥
> అన్నపూర్ణేతి నామాని మహామాయా పయస్వినీ ।
> త్రిపురాశ్చైవేతి విజ్ఞేయా తాంత్రికానిచ ద్వాదశా ॥

1. సావిత్రీ 2. సరస్వతి 3. లక్ష్మి 4. దుర్గ 5. కుండలినీ 6. ప్రాణాగ్ని 7. భవాని 8. భువనేశ్వరి 9. అన్నపూర్ణ 10. మహా మాయ 11. పయస్విని 12. త్రిపుర - ఈ పన్నెండు ఋణాత్మక శక్తుల నామములు.

ఈ ద్వాదశరాశుల బహిర్ముఖ, అంతర్ముఖ సమన్వయము నవగ్రహాల ద్వారా ఎలా జరిగేది తెలుసుకోవాలి.

పూజ్య గురుదేవులు శాంతికుంజ్ అకాడమి ద్వారా ఇంకో మూడు గ్రహాలను కలిపి ద్వాదశ గ్రహముల ప్రభావమును Observatory ద్వారా తెలుసుకొనటానికి చేసిన ప్రయత్నము మనకందరికి తెలిసినదే. అప్పుడు ఈ జ్యోతిర్విద్య నిజముగా వేదాంగముగా ప్రకాశిస్తుంది.

(ఈనాటి జ్యోతిశాస్త్ర స్వరూపము ఋషులు ఊహించని విధముగా మానవులు దురుపయోగపరిచే ఆనాటి వేదాంగమే).

❀ ఈ రహస్యాన్ని తెలుసుకున్న సాధకుడు గ్రహముల బంధనము నుండి తప్పించుకుని తన జాతక చక్రములోని గ్రహగతులను తన చేతిలోకి తీసుకొని ఆధ్యాత్మికత యొక్క మూడవ లక్ష్యము వైపు ప్రయాణిస్తాడు.

అంతేగాక ఈ సాధన యొక్క అతి తీవ్ర చరమ స్థాయిలో, పరమ ఉత్కృష్ట స్థితిలో తన గ్రహగతుల శక్తి తరంగాలను పూజ్య గురుదేవుల లక్ష్య సాధన కొరకు ఎలా వినియోగించాలో తెలుసుకొని సమర్పణకు పర్యాయ పద మవుతాడు.

అప్పుడు తృతీయ భూమికలోనికి ప్రవేశిస్తాడు.

③ The Light is everywhere

బహిర్ముఖ, అంతర్ముఖ సాధనలు పరిణతి చెంది, అహం బ్రహ్మాస్మి, సర్వం ఖల్విదం బ్రహ్మ, ఈశావాస్య మిదం సర్వం, వాసుదేవ సర్వమితి అనే వాక్యాల శాబ్దిక అర్థాలే గాక అనుభూతిపరంగా తెలుసుకుని, ఈ సృష్టి రహస్యాన్ని భేదించి తానే సృష్టికర్తగా రూపొందుతాడు (?)

ఈ నవరాత్రులలో మనము మూడు ముఖ్య కార్యక్రమాలు చేస్తున్నాము.

① ప్రతీ సాధకుడు 24 వేల గాయత్రీ మంత్ర జపసంఖ్య ను పూర్తి చేస్తాడు. (గాయత్రీ లఘు అనుష్ఠానం).
- ఈ సాధన కాల పురుషునితో మనకు సంబంధాన్ని ఏర్పరుస్తుంది. (కారణ జగత్తు)

② శ్రీసూక్త, పురుష సూక్త పారాయణ లేక సుదర్శన విద్య.
- ఇది కాల పురుషుని స్వభావ స్వరూపాలను తెలుపు తుంది. (సూక్ష్మ జగత్తు)

③ దుర్గా సప్త శతి పారాయణ.
- ఇది బాహ్య ప్రపంచంలో కాల పురుషుడు కోరుకునే ఆసురీ శక్తి సంహారానికి సాధకుని కారణ, సూక్ష్మ స్థూల శరీరాలలో అవసరమైన మార్పులు తీసుకొని వస్తుంది.

అంతేగాక ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు ప్రతి రోజు జరిగే గాయత్రీ మంత్ర జప సాధన మాతాజీ నిర్దేసానుసారము జరుగుతుంది. దీనివల్ల మనము, మన కుటుంబాలకు మాతాజీ, గురుదేవుల సంరక్షణ, మార్గదర్శనము లభిస్తాయి.

పునరుక్తి దోషము ఉన్నా, మళ్ళీ మళ్ళీ మీకు నేను గుర్తుచేసే విశేషమేమంటే,
ఇటువంటి మహత్తర అవకాశము మానవజాతి చరిత్రలో ఎప్పుడూ లభించలేదు.
అందువల్ల ఈ పరిస్థితులలో అతి స్వల్పమైన మానసిక Differences of Opinion వల్ల
ఈ సాధనలో పాలుపంచుకునే అవకాశాన్ని వినియోగించుకోకుండా ఉండకండి.

మనమందరమూ ఒక సుందర ప్రేమమయ వాతావరణాన్ని నిర్మించి,
ఈనాటి విషమ పరిస్థితులను అధిగమించి,
పూజ్య గురుదేవుల లక్ష్యంలో ఇంకొక మెట్టు ముందుకు వెళ్ళగలుగుతామని ఆశిస్తూ,

మీ
శ్రీరామకృష్ణ

✻✻✻✻✻✻✻✻✻



గుంటూరు
25.9.91
9.35 - 11.00 పి.ఎమ్.

ప్రియమైన గాయత్రీ పరిజనులకు,

నమస్కారములు!

మీకు ఒంగోలు సాధనా శిబిరము తేదీలలో మార్పు తెలియజేసే వుత్తరము అందే వుంటుంది. సాధనా శిబిరము 8.10.91 ఉదయం 4.30 నుంచి మొదలవుతుంది. 17.10.91 సాయంత్రం 6గంటలకు పూర్తి అవుతుంది.

సాధనా శిబిరములోగాని, ఇంటి వద్దనే వుండిగాని (శిబిరమునకు రాలేనివారు), దుర్గా సప్తశతి (దీనినే దేవీ మహాత్మ్యము లేక చండీ మహాత్మ్యము అనికూడ అంటారు) పారాయణ చేయదలచినవారు ముందు సప్తశతి స్తోత్ర ఉత్కీలనము చేయాలి. ఉత్కీలనము కృష్ణ పక్ష అష్టమి (1.10.91) లేక కృష్ణ పక్ష చతుర్దశినాడు (6.10.91) చేయాలి.

- ఉత్కీలనము చేయు విధానము, శివుడు సప్తశతికి చేసిన ఉత్కీలన విధానము -
  "దానము చేసి ప్రతిగ్రహించుట,"
- అంటే, సాధకుడు దుర్గా సప్తశతి పారాయణ సంకల్పించిన రోజుకు ముందు ఒక నెల స్వార్జితమును దేవికి సమర్పించి, ఆ ధనమును 5 భాగములు చేసి, ఒక వంతు గురువుకు, ఒక వంతు పంచ యజ్ఞములకు, మిగతా మూడు భాగములు తనని వినియోగించుకొనమని దేవి ఆజ్ఞాపించుచున్నట్లు భావించాలి.
- ప్రతిగ్రహించిన ఈ మూడు వంతుల ధనము చాలా జాగ్రత్తగా ఒక బ్రాహ్మణుని వలె "అయాచక వ్రతము, అపరిగ్రహ వ్రతము" నిష్టతో పాటిస్తూ స్వ కుటుంబ పోషణార్థము కొరకు వినియోగించాలి.

ఈ సంకల్పము కంటే చాలా తీవ్రమైన సంకల్పం పూజ్య గురుదేవులు ఆదేశించిన "అంశదాన" దీక్ష.

అందువల్ల 6.10.91 కృష్ణ పక్ష చతుర్దశినాడు స్నానానంతరము పూజ్య గురుదేవుల చిత్ర పటము ముందు కూర్చుని 8.10.91 నుండి జరగబోయే నవరాత్రులలో దుర్గా సప్తశతి పారాయణము చేస్తానని సంకల్పము తీసుకొని, ఈ క్షణం నుండి పూజ్య గురుదేవులు నిర్దేశించిన "అంశ

దాన" దీక్షను తప్పక నియమితముగా చేస్తాను అనే పునః సంకల్పము తీసుకోవాలి.

- వేదిక మీదే ఒక జ్ఞానఘటము స్థాపించి,

  నిత్యము 25 పైసలు లేక 50 పైసలు లేక రూ. 1.00 ఘటములో ఒక నెల రోజులపాటు వేయాలి.

  ఈ డబ్బులో సగము హరిద్వార్‌కు పంపి,

  సగము స్థానిక గాయత్రీ పరివార్‌కు ఇవ్వాలి.

చతుర్దశ మనువులు ఏడుగురు అవరోహణ క్రమంలో, ఏడుగురు ఆరోహణ క్రమంలో పృథ్వి మీద 13 రకాల జీవ పరిణామక్రమాన్ని గమనించి శాసిస్తూ ఉంటారు.

- నాల్గవ Root Race లో మనము చాక్షుస మనువు అధీనంలో ఉండి, ఈ 5 వ Root Race కాలంలో వైవస్వత మనువు అధీనంలో ఉన్నాము.
- ఈ 5 వ Root Race లోనే రాబోయే సూర్య సావర్ణిక మనువు ప్రభావం (6th Root Race) పొడసూపుతుంది.
- దుర్గా సప్తశతి పఠనము రాబోయే సూర్య సావర్ణిక మనువు తరమునే గాక, సావర్ణి మనువులయిన దక్ష సావర్ణిక మనువు, బ్రహ్మ సావర్ణిక మనువు, చంద్ర సావర్ణిక మనువుల క్రియాకలాపాల Blue Print అందజేస్తుంది.
- ప్రతీ మనువు కాలములో 13 జీవ ప్రవాహములు పరిణతి చెందుతాయి. అవి Elemental 1, Elemental 2, Elemental 3. - ఇది సప్తశతి ప్రథమ చరితములో ప్రథమాధ్యాయంలో తెలుపబడింది.
- సప్తశతి మధ్యమ చరితములోని 3 అధ్యాయాలు ఖనిజ, వృక్ష, జంతు పరిణామక్రమాన్ని తెలుపుతాయి.
- సప్తశతి ఉత్తమ చరితములో గల 9 అధ్యాయాలు సాధకుని నవ రంధ్రములు - నవ చక్రములు - నవ విధ భక్తి మార్గములు - నవరత్నములు - నవ బ్రహ్మలు - నవ రసములు - నవ ధాన్యములు - నవ నిధులు - నవ గ్రహములు మధ్య ఉన్న అతి రహస్య సంబంధాన్ని తెలుపుతూ వ్రాయబడ్డాయి.
- ఈ 10 సంవత్సరముల కాలము తరవాత ఐదుగురు సావర్ణి మనువుల ప్రభావం, అందులో 6th Root Race లో రాబోయే సూర్య సావర్ణి మనువు ప్రభావం విశిష్టంగా వుంటుంది. ఆయన ప్రభావం గాయత్రీ ద్వారా మన మీద పడుతుంది.

ద్వాదశ రాశి అనుసంధానము,
పంచ సావర్ణి మనువుల 150 కోట్ల సంవత్సరాల భవిష్య ప్రణాళిక,
9 గ్రహములే గాక మిగతా మూడు గ్రహముల ప్రభావములు గమనించిన
విశిష్ట తపో సాధనా సంపన్నుడయిన పూజ్య గురుదేవుల ద్వారా ఎన్నుకోబడ్డ మనము,
ఈ సాధనా శిబిరములో గాయత్రీ మంత్రము యొక్క
ద్వాదశ సాత్విక - ద్వాదశ తాంత్రిక శక్తులను గమనించి, గుర్తించి,
నిత్య జీవితములో ప్రయోగించుట నేర్చుకోవాలి.

ఇంతేగాక 9 గ్రహములకు, మానవ శరీరానికి గల విశిష్ట సంబంధము,
మానవ స్వభావ నైజముల మీద మూడు క్రొత్త గ్రహముల చిత్ర, విచిత్ర ప్రభావములను గుర్తించి,
పూజ్య గురుదేవులు కాల పురుషునికి మనల్ని పూజా పుష్పముగా అర్పించే స్థాయికి
అతి త్వరలో ఎదుగుతామని ఆశిస్తూ,

మీ
శ్రీరామకృష్ణ



ప్లాట్ నెం. 50,
ఎన్.జి.జి.వో. కాలనీ, గుంటూరు,
25.10.91, 6.35 ఎ.ఎమ్.

గాయత్రీ పరిజనులకు,

నమస్కారములు!

యుగసంధి కాలంలోని మొదటి సంవత్సరము యొక్క 4 వ పాదము (చివరి 3 నెలలు) లో వున్నాము.

- మొదటి పాదములో (జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలు) అంకురార్పణ, అంటే "పరా స్థాయి" సిద్ధాంతాల కూర్పు జరుగుతుంది.
- సంవత్సర కాలపురుషుని గమనంలో ద్వాదశ అమావాస్యలు, ద్వాదశ పౌర్ణములుగా జరిగే గాయత్రి ఛందస్సు యొక్క అవగాహన కొరకు "మౌనము" ద్వారా మొదలైన కార్యక్రమాల పరంపర మొదటి 5 పౌర్ణములలో జరిగిన పూర్ణిమ సమావేశాలు + కుండలినీ శక్తి ధారలతో మన పరిచయము (చీరాల సాధనా శిబిరము) గా రెండవ పాదములోని ( ఏప్రిల్, మే, జూన్) "పశ్యంతీ స్థాయి" స్వరూపము ఏర్పడినది.
- గురు పూర్ణిమ, శ్రావణ పూర్ణిమ (మార్కాపురం, ఒంగోలు) లలో (జూలై, ఆగస్టు) కాలము - ఆకాశము TIME - SPACE లకి ఆవల వున్న సిద్ధాంతాలు మూడవ పాదములో (జులై, ఆగస్టు, సెప్టెంబరు) "మధ్యమా స్థాయి" కి దిగింది.

అక్కడ పంచీకరణము జరిగి, కుండలినీ శక్తిధారలతో సంతులనము చెందే ప్రాణ శక్తిధారల సమానాంతర ప్రవాహంతో బ్రహ్మాండ - పిండాండ సమన్వయముగా, భూర్ భువః జనః తపః సత్యం తలములు ఏర్పడుట, మానవ శరీరంలో అవి ప్రతిబింబించుట, పంచకోశ సాధనగా, వినాయక పూజతో కలసిన శ్రీశైలం సాధనా శిబిరములో తెలుసుకోవడానికి ప్రయత్నించాము.

- అక్టోబరులో జరిగిన దేవీ నవరాత్రులలో నాల్గవ పాదముగా రూపొందవలసిన "వైఖరీ స్థాయి" కార్యక్రమాలు, అన్ని దేవతాశక్తుల దుర్గావతరణ రూపముగా, మనకి పరిచయమున్న అన్ని అధ్యాత్మిక సంస్థలను కలుపుకొని 50 వేల దేవస్థాపన కార్యక్రమాల రూపంలో స్థూల స్థాయిలో కనిపించాలని నిర్ణయించుకున్నాము.

  ఇది కుండలినీ, ప్రాణ శక్తిధారలతో కలవకుండా, సమానాంతరంగా ప్రవహించే జీవ శక్తిధారలుగా ఏర్పడుతుంది.

- ఈ అపూర్వమైన త్రివేణి సంగమము, జ్ఞాన, భక్తి, కర్మల ---

  (1. కాలపురుషుని కోరిక,
  2. దానికి మనము ఏర్పరచుకొనే స్వరూపము,
  3. భౌతిక జగత్తులో మనముఏర్పరచుకొనే లక్ష్యము)

  --- ద్వారా డిశంబరు లోపల దశావతారాలో మొదటిదైన మత్స్యావతారంగా అంచలంచలుగా ఎదుగుతూ విశ్వమంతా వ్యాపించాలి.

- పై కార్యక్రమాలను చేస్తూ జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో రాబోయే వసంత పంచమి నాటికి "వరాహ అవతారము" యొక్క పరాస్థాయి నిర్ణయాలు తీసుకోవలసి ఉన్నది.

మత్స్యావతారము ప్రళయములో సప్తఋషులను (కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వశిష్ఠుడు) పడవలో దాటించే సాంకేతిక కథ.

ఇది ఏడు స్వరములు, ఏడు అక్షరములు, ఏడు వర్ణములు వైఖరి స్థాయిలో ఒక అపూర్వ గాంధర్వ గానముగా పరిణతి చెందాలని తెలుపుతుంది.

- కానీ స్పష్టమైన అందమైన సంగీతము తయారు చేసే ముందు, అనేక అపశృతులు, అనవసరమైన స్వరాలు, అర్థములేని శబ్దాడంబరాలు, పరస్పరము ఢీకొని అత్యద్భుతమైన, మహోత్కృష్టమైన ఆనందస్వర ప్రవాహము ఏర్పడటానికి, మనందరి కృషి ఫలించే ముందు, ఒక కోలాహలాన్ని నిర్మించటం సహజమే.

అందువల్ల ఈ నవ నిర్మాణ స్వరలహరిలో అందరూ కలసి మెలసి ఏకాత్మతతో పని చేయగలిగే సహనము, ప్రేమ, అనురాగముతో భవిష్యత్తులో అందరూ కలసి వసుధైవ కుటుంబకము అనే ఋషుల కలను నిజము చేయగలరు అని విశ్వసిస్తూ, అతి సుందరమైన ఈ నిర్మాణ ప్రగతికి మన వల్ల అవరోధము ఏర్పడకుండా ఉండాలి అనే దృఢ సంకల్పము తీసుకోమని కోరుతున్నాను.

నారదుని మహతి వీణ, కలహ భోజనుడి నామము,
పూజ్య గురుదేవుల శిష్యులను వాల్మీకి, ప్రహ్లాద, ధృవులుగా
రూపొందించటానికి ఉపయోగపడి, యుగ యుగాలకి మన అందరి కృషి,
పైన చెప్పిన ముగ్గురి స్థాయిలోనే రూపొందుతుంది అని విశ్వసిస్తూ,

మీ
శ్రీరామకృష్ణ



50, వేణుగోపాల్‌నగర్
గుంటూరు - 4
2-50 పి.ఎమ్., 30.12.91

గాయత్రీ పరివార్ జనులకు

నమస్కారములు!

యుగసంధి దశాబ్దిలో మొదటి సం॥ పూర్తయింది.

- ఈ 10 సంవత్సరాలలో దశావతార ప్రక్రియ వేగాన్ని అందుకొని 1995 నాటికి సౌరకుటుంబములో అనూహ్యమైన మార్పులు సంభవించటానికి అవసరమయ్యే సరిక్రొత్త శక్తిధారలు అనంత అంతరిక్షం నుండి ఉద్భవిస్తున్నాయి.
- ఈ శక్తిధారల వినాశకర ప్రభావము ఒక మహత్తరమైన అణుశక్తిగల దేశమును ఏవిధమైన ఆర్భాటము లేకుండగా కామన్ వెల్తుగా రూపొందించుటలో చూడ వచ్చు.
- రెండవ దేశంలో కూడ అతిత్వరలో ఈనాడు మనము ఊహించని మార్పులు సంభవించబోతున్నాయి.
- ఇదే కాకుండా ఇథియోపియాలోని క్షామము, విచిత్రంగా జరిగిన గల్ఫ్ యుద్ధము, ప్రతి దేశంలోను విభిన్న ప్రాంతాలలో జరిగే హింసాత్మక సంఘటనలు, ఇవన్నీ కూడా సరిక్రొత్త శక్తి యొక్క ఆవిర్భావ చిహ్నములు.
- రుద్రశక్తి - కాళీశక్తి - మహేశ్వర శక్తి అని ఈ పేర్లు దాని వినాశక ప్రవృత్తిని తెల్పుటకు మనకు తెలసిన పేర్లను ఉపయోగించామే తప్ప, నిజానికి 1990 గాయత్రీ జయంతినాడు 5వ ఆయామం నుండి (5th

dimension) ప్రసరించిన ఈ విచిత్రమైన శక్తి ప్రస్థావన ఋగ్వేదంలోని దశమ మండలంలో విశ్వామిత్రుని పౌత్రుని వల్ల దర్శింపబడిన సూక్తంలో చెప్పబడినది.

- గ్రహ ప్రభావం వల్ల "గృహముల" మార్పు ఈ శక్తి ముఖ్య లక్షణము. ఈ విచ్ఛిన్నకర శక్తి ప్రపంచం అంతటా సమానంగా ప్రసరిస్తోంది.
- ఏ శక్తి అయినా నియంత్రణలో లేకపోవుట చేతనే విధ్వంశక శక్తిగా రూపొందుతుంది.

అన్ని శక్తులను నియంత్రించగలిగే శక్తి "ప్రేమ"

- స్వార్థ రహిత, అహంకార రహిత వ్యక్తిత్వ నిర్మాణము "ప్రేమను" ఉపయోగించుకోవటానికి కావలసిన అతి ప్రముఖమైన ఆవశ్యకత.

గాయత్రీ పరివార్ సభ్యులందరూ ఈ మొదటి సం॥లో మత్స్యావతార ప్రక్రియలో పరస్పర అవగాహన అప్పుడప్పుడు తగ్గినప్పటికి, తమ తమ పాత్రలను హిమాలయాల నుండి ఉద్భవించే శక్తి కేంద్రపు ఊహకంటే అనేక రెట్లు ఎక్కువగా నిర్వర్తించారు.

- నూతన సం॥ర శుభాకాంక్షలతో పాటు మత్స్యావతార ప్రక్రియను అత్యుత్తమంగా నిర్వర్తించినందుకు నా కృతజ్ఞతలు, ధన్యవాదాలు అందుకోండి.

అక్టోబరు నెలలో విశిష్ట శక్తి సాధనా శిబిరములో మనం నిర్ణయించిన 50 వేల దేవస్థాపనా కార్యక్రమాల పేర్లు సేకరించటం పూర్తయింది. ఈ ప్రక్రియను కొనసాగిస్తూ ఉండండి. మన సంబంధీకులలో, స్నేహితులలో, ప్రతి ఒక్కరిని దేవస్థాపనకు అవసరమైన మూడు కార్యక్రమాలు అమలు జరిగేటట్లు చూడండి.

హరిద్వార్ నుండి దేవస్థాపన కర్మకాండకు అవసరమైన ప్రక్రియ ఎలా జరుగుతుంది? ఎప్పుడు జరుగుతుంది? అనేది ప్రతి ఊరివాళ్ళు మిగతా వూరివాళ్ళతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకొని నిర్ణయించుకోండి.

- కర్మకాండ కంటే ముఖ్యమైనది ఆచరణ.
  - నిత్య ఉపాసన, బలివైశ్యదేవం, సతత స్వాధ్యాయం, మీ జీవిత విధానంలో ఒక భాగంగా మారాలి.
  - ఇతరులచేత ఎంత ఎక్కువగా చేయించగలిగితే అంత ఎక్కువ చేయించండి. వీలున్న వారు ఇతర ఆధ్యాత్మిక ప్రవృత్తి కలిగిన వ్యక్తులకు నేటి పరిస్థితులకు అవసరమైన విచారక్రాంతి స్వరూపాన్ని వివరించండి. అదే మత్స్యావతార ప్రక్రియ.
- మత్స్యావతార ప్రక్రియను ఆపకుండా ఫిబ్రవరి 8న వచ్చే వసంతపంచమి లోపల కూర్మావతార ప్రక్రియను సాధనలో చేర్చడానికి ప్రయత్నించండి. దీనిని గూర్చి అవసరమైన సాధనా పద్ధతులు - భగవద్గీత 2 మరియు 14వ ఆధ్యాయాలలో లభించవచ్చును.

ఈ సం॥ మత్స్యావతార ప్రక్రియలో భాగంగా నేను అనేక చోట్లకు వెళ్ళవలసి వచ్చింది. అనారోగ్య కారణంగా మీరు చూపిన ఆదరాభిమానాలకు నేను సరిగా స్పందించలేకపోయాను, మాటల్లోగాని, చేతలలోగాని మీ మనస్సుకు ఏదైనా బాధ కలిగించి వుంటే క్షంతవ్యుణ్ణి.

- నూతన సంవత్సర కార్యక్రమాల్లో కూర్మావతార ప్రక్రియను గూర్చి ఆలోచించటమే కాక కనీసం ఊరికి 5 స్వాధ్యాయ మండల సముదాయాలను ఏర్పాటు చేయండి.

మీకు ప్రతినెలా శ్రద్ధాంజలి సమారోహాలలో పునర్ముద్రితమైన పుస్తకాలలో 2 పుస్తకాల నుండి అతి సంక్షిప్త భావ ప్రేరణలను స్వాధ్యాయం కొరకు అందించటానికి ప్రయత్నిస్తాను.

విశ్వ యుగసంధి కాలములో జన్మించి పూజ్య గురుదేవులకు
దగ్గరగా వెళ్లిన మనము, ఎట్టి పరిస్థితులలోను మన ఉత్సాహాన్ని పోగొట్టుకొనక
నూతన ప్రపంచ నిర్మాణాన్కి అవసరమైన పరిస్థితులను కల్పిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం!

మీ
శ్రీరామకృష్ణ

# లేఖామాల - 1992



✧ ఒక్క సంస్థ వలనగాని, ఒక్క వ్యక్తి వలనగాని భూమిపై స్వర్గావతరణ జరుగదు.

అందువలన ఈ బృహత్తరమైన, భయంకరమైన మార్పులలో ప్రజాభిప్రాయానికి విలువనీయకుండ, విశిష్ట లక్ష్యము కొరకు సూటిగా వెళ్ళగల్గే వ్యక్తులను తమ పరిచితులలోను, మిత్రులలోను, బంధువర్గములోను వెతికి (క్రొత్త వాళ్ళయినా సరే) వారితో అతి త్వరలో సహృత్సంబంధాలను పెంచుకోవాలి.

✧ ఇతరులకు గురువులుగా, మార్గదర్శకులుగా దయచేసి మారకండి.

- మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోండి. దానికై ఇతరుల సహాయం తీసుకోండి. అంతేకాని, ఇతరులను ఉద్ధరిస్తున్నామన్న పేరుతో మనోవ్యధ కోరి తెచ్చుకోకండి.

# ముందు మాట

(1992 లో మాస్టరుగారు అందించిన లెటర్స్‌తో కూడిన "లేఖామాల - 1992" అనే పుస్తకానికి వ్రాయబడిన ముందుమాట)



ధీరుడైన పురుషునికి ఒకే విధమైన ఉన్నతి వల్ల తృప్తి కలగకూడదు. మనిషికి జీవనం యొక్క అన్ని దిశలలోను ఉన్నతి లభించుట అవసరము. అదే సర్వతోముఖమైన ఔన్నత్యము. ఈ ఉన్నతికి ఎనిమిది దిశలు ఉన్నాయి.

1. ఆరోగ్యము, 2. విద్య, 3. ధనము, 4. మిత్రులు, 5. ప్రతిష్ఠ, 6. చతురత, 7. సాహసము, 8. ఆత్మబలము లేక ఆత్మోన్నతి లేక ఆత్మవికాసము.

ఈ ఎనిమిది బలాలను పెంచుకోవటానికి, ఎనిమిది మూలలను మెలకువగా ఉంచుకోవటానికి, తగిన మార్గములను చూపుతూ, అహర్నిశమూ పరిజనుల ఆత్మోన్నత్యము కొరకు నిరంతరము వారిని సంరక్షించు ప్రయత్నములో, మాస్టరుగారు (డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు) లేఖల రూపములో అందించిన సందేశములే - ఈ చిన్న సంపుటి.

1995 సంవత్సరము నుంచి 2000 సంవత్సరము వరకు, ఈ పృథ్వి మీద ఎన్నో ఆశ్చర్యకరమైన మార్పులు సంభవించబోతున్నాయని, ఎందరో మహాత్ములు చెబుతున్నారు. ఈ పృథ్విని స్వర్గముగా మార్చుట కొరకు చేసిన ప్రయత్నాలలో కబీరు, సమర్థ గురు రామదాసు, రామకృష్ణ పరమహంస, లాహిరీ మహాశయ, మెహర్‌బాబా, సత్యసాయిబాబా, శ్రీ అరవిందో, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య మొదలగువారి విశిష్ట కృషి సులభంగా గుర్తించ వచ్చును.

కానీ ఈనాడు చాలా మంది సాధకులు కేవలము వాగాడంబరము, కర్మకాండలు, ఆధ్యాత్మికత పేరుతో పురుషార్థహీనులై తమ నిత్య జీవితము లోని చిన్న బాధ్యతలను కూడా గురువుల మీదకు, భగవంతుని మీదకు నెట్టి వేస్తూ, మానవజీవితానికి ఆధారమైన ఆలోచనకు శక్తిహీనులై, జీవచ్ఛవాలుగా జీవిస్తూ, పదభ్రష్టులై, "లక్ష్య"హీనులై జీవిస్తున్నారు.

ఎవరి లక్ష్యము వారికి ఈ లేఖలలో వెదికితే దొరుకుతుందేమో?

****○****



విజయవాడ
24.5.92, 8.55 ఎ.ఎమ్.

ప్రియమైన గాయత్రీ పరివార్ సభ్యులకు

నమస్కారములు!

ఈ ఉత్తరమును మీకు ఎంతో ఆశతోను, బాధతోను వ్రాస్తున్నాను.

***ఆశ ఎందుకంటే,***

1981 వ సంవత్సరములో గుంటూరులో నాటిన విత్తనం ఇంతగా ఈ విధంగా పల్లవించి, పుష్పించినందుకు.

✷ అనేక కల్పాలలో ఒక్కసారి మాత్రమే లభ్యమయ్యే ఈ "యుగసంధి" వేళ ఎంత ప్రాముఖ్యత వహిస్తుంది అంటే,

- మన పృథ్వీ మండలంలో ఉనికిని ఏర్పరచుకొని వున్న పరమ గురువులు,
- హిమాలయాలలోని సిద్ధాశ్రమాలలో గల విచిత్ర శక్తి సంపన్నులైన సిద్ధపురుషులు,
- గాంధర్వ కక్ష్యలో నున్న అనేక మంది మహాత్ములు,
- ఇతర గ్రహవాసులు, ముఖ్యంగా శుక్ర, బుధవాసులు,
- వీరు మాత్రమేగాక సిరిస్ (SIRIUS) నక్షత్రములో నున్న, మన ఊహకందని White Lodge సంఘం లోని సదస్సులు,

  సుమారు 1650 A.D. నుండి వారి వారి శక్తి సామర్థ్యాల నన్నిటినీ పృథ్వి మీద కేంద్రీకరించి వున్నారు.

ఇటువంటి పరిస్థితి ఒకటున్నదని తెలుసుకొన్న, దానికి తగిన వ్యక్తులను ఒక మాలలో కూర్చి కాలపురుషుని మెడలో సంపూర్ణ సమర్పణ గావించుకొన్న శిష్యులను ఒక మణిమాలగా వేయుటకు బుద్ధావతారం యొక్క ఉత్తరార్థముగ, కబీరుదాసుగా, సమర్థ గురు రామదాసుగా, రామకృష్ణ పరమహంసగానే కాక, మనము గుర్తించగల్గే 'లాహిరీ మహాశయ', 'శిరిడీ సాయి', మాస్టర్ సి.వి.వి., చైతన్య మహాప్రభువు, యోగి అరవిందుల సాధనా ప్రమాణాల ద్వారా మన గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య ప్రయత్నము మనకు సువిధితమే.

❂ మణులన్నీ ఒక్కచోటనే దొరకవు గనుక వేర్వేరు చోట్ల నుండి వాటిని సమీకరించి, వారి గత జన్మల సాధనా పద్ధతులను తెలుసుకొని, సకాలంలో అందించవలసి వస్తుంది.

☹ కాలం తక్కువ అగుట వలన సానపట్టటానికి ఉపయోగించే పద్ధతుల్ని తట్టుకోలేని మణులు ఒక్కొక్కసారి ఎందుకూ పనికి రాకుండా కూడా పోవచ్చును.

శ్రీ మణులు ఎక్కడ నుండి వస్తున్నాయనే దానికి ప్రాముఖ్యత నీయకుండా, ఆ మణి యొక్క విలువను తెలుసుకొని, కాలపురుషుని మెడలో పూజ్య గురుదేవులు వేయదలచుకున్న హారములో తమ స్థానాన్ని తెలుసుకొని ఈ యుగసంధి కాలాన్ని పూర్తిగా వుపయోగించుకొనుట గాయత్రీ పరివార్ పరిజనులు నేర్చుకోవాలి.

✧ దీనికి ముందుగా పూజ్య గురుదేవులు ఏర్చి, కూర్చి తయారు చేసిన వ్యక్తులు ఈ క్రింది విషయాలను గుర్తుంచుకోవాలి.

① ఒక్క సంస్థ వలనగాని, ఒక్క వ్యక్తి వలనగాని భూమిపై స్వర్గావతరణ జరుగదు.

అందువలన ఈ బృహత్తరమైన, భయంకరమైన మార్పులలో ప్రజాభిప్రాయానికి విలువ నీయకుండ, విశిష్ట లక్ష్యము కొరకు సూటిగా వెళ్ళగల్గే వ్యక్తులను తమ పరిచితులలోను, మిత్రులలోను, బంధువర్గము

లోను వెతికి (క్రొత్త వాళ్ళయినా సరే) వారితో అతి త్వరలో సహృత్సంబంధాలను పెంచుకోవాలి.

- వీరందరూ వ్యక్తిత్వాలను మరచి, క్రమశిక్షణతో ఒకే గ్రూప్‌గా పనిచేయాలి.
- వారి యొక్క సంస్థ, జాతి, మతము, వయస్సు, విద్యార్హతలతో ఏవిధమైన సంబంధమూ వుండకూడదు.
- ప్రతి ఒక్కరు కనీసం 10 మందిని అయినా జూన్ మొదటి వారానికి ఎన్నుకుంటారని ఆశిస్తున్నాను.
- ఈ ఎన్నికలో లక్ష్యసాధన కొరకు తీవ్రత కావాలికాని, సాధనా కాలము, గురు స్వరూపము, ఎటువంటి సంస్థలో పనిచేస్తున్నాడు అనేదానికి ప్రాముఖ్యత నియ్యవద్దు.

② ఆహార నియమాలు, ఉపాసనా పద్ధతులు, ప్రాణాయామ పద్ధతులు, తిలకధారణ, బాహ్య కర్మకాండలు, ప్రతీకోపాసనలకు ఏవిధమైన ప్రాముఖ్యతను ఈయక,

నేను స్వాధ్యాయ మండలికి పంపిన డిశంబర్ ప్రజ్ఞా అభియాన్‌లో ఈయబడ్డ, పూజ్య గురుదేవులు రచించిన "గాయత్రీ మంత్రముయొక్క భావనాత్మక ఉపాసనకు మీ మనో వాక్కాయ, కర్మలను పూర్తిగా వుపయోగించి, మీ మనస్సులలో పూజ్య గురుదేవుల ఆశయాలను, ఆకాంక్షలను, ఆదర్శాలను నిలుపుకొని, వారి చేతిలోని పనిముట్టుగా మారాలి.

③ వ్యక్తిగతమైన ఆకర్షణలు, నిష్ఠలు, కోర్కెలు-ఆధ్యాత్మిక క్షేత్రంలో భయంకర పతనానికి దారితీస్తాయి.

- అందువల్ల మీ దృష్టిని పూజ్య గురుదేవులు నిర్దేశించిన సాధనా పద్ధతులమీదకాక, ఆయన ఏర్పరచిన ఆదర్శాలను మీ రక్తంగా జీర్ణించుకొని, ఒంటరిగానైనా సరే ముందుకు దూసుకుపోయే మనస్తత్వాలను అలవరచుకోండి.
- "ఆదర్శాలకు పాటుపడని ఉపాసన, స్నానము చేయుట, ప్రాకృతిక అవసరాలను తీర్చుకొనుట లాంటి నిత్యకర్మ మాత్రమే" అని మే 92 అఖండ జ్యోతిలో పూజ్య గురుదేవులు చెప్పారు.

④ అహింస అనేది మీ నరనరాల జీర్ణించుకు పోవాలి.

- మనస్సు యొక్క సృజనాత్మక శక్తిని గుర్తించండి. చివరికి మీ ఆలోచనలో గూడా ఎవరినైనా, కొంచమైనా, పరుషమైన ఆలోచనలు రానీయకండి.
- మీ మనస్సులో మెదిలే ఆలోచనలను జాగ్రత్తగా 24 గంటలు గమనించి, ఏ పరుషమైన ఆలోచనా రానియ్యక నిర్బంధించండి.
- మాటలు, చేతలలో హింస అసలు కూడదుగదా!

⑤ ఇతరులకు గురువులుగా, మార్గదర్శకులుగా దయచేసి మారకండి.

- మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోండి.
దానికై ఇతరుల సహాయం తీసుకోండి.
అంతేకాని, ఇతరులను ఉద్ధరిస్తున్నా మన్న పేరుతో మనోవ్యథ కోరి తెచ్చుకొనకండి.
- పూజ్య గురుదేవుల సూక్ష్మ శక్తి క్రియాకలాపాలకు అడ్డు తగలకుండ, మీరే విధమైన నిర్ణయాత్మకమైన మార్పులు చేయకుండా, మహాకాలుని కరాళప్రళయ ఝంఝామారుతము ఎవరిని ఏ స్థానములో ఉంచాలో, అక్కడే వుంచుతుందని గుర్తుంచుకోండి.
- మీరు మాత్రము నోటి ద్వారా పరుషవాక్కు రాకుండా, ప్రేమమయ హృదయ స్పందనలతో పూజ్య గురుదేవుల లక్ష్యసాధనకు ప్రతిరోజూ ఎంత చేయగలిగాము అన్నది రికార్డు చేసుకోండి.
- దీనికి స్వాధ్యాయ మండలికై నేను పంపిన "హర్ దిన్ నయాజన్మ్ - హర్ రాత్ నయీమౌత్" జాగ్రత్తగా చదవండి.

⑥ దివ్యాత్మలతో సంబంధం ప్రతిరోజూ 2 గంటలు ఏర్పరచుకోండి. దీనినే స్వాధ్యాయము అంటారు.

- ఏదో ఒక పుస్తకాన్ని ఎన్నుకొని, దానిని ఐదుగురు లేక ఆరుగురు కల్సి కూలంకషంగా చర్చించి, అందులోని విషయాల్ని మీరు పూర్తిగా అవగాహన చేసుకొని మీ మాటలలో చెప్పగలగాలి.
- ఆచరణయోగ్యమైన మాటల్ని, స్ఫూర్తినిచ్చే వ్యాక్యాల్ని వేరుగా ఒక పుస్తకంలో వ్రాసుకోండి.

- సంఘీభావంతో 24 గంటలు గురువుగారి లక్ష్యాన్ని మరువకుండా, మీ నిత్య వృత్తిపరమైన విషయాలలో వీటి వలన ఏ అడ్డంకీ లేకుండా ఇతరులకు ఆదర్శం గా నిలవండి.
- మిమ్మల్ని చూసి మనుష్యులు మారాలికాని, మీరు వారికి హితబోధ చేయవద్దు.

⑦ భారతదేశ ఔన్నత్యము సంస్కార ప్రక్రియపై ఆధార పడియున్నది. అందువలన ప్రతి ఒక్కరు ఈ దిగువన ఇవ్వబడిన సంస్కారాలను సమర్థవంతంగా నిర్వహిం చగల్గేటట్లు తయారు కావాలి. మొత్తం మంత్రాలన్నీ నోటికి రావాలి. బుక్ చూసి చదవవద్దు.

1. పుంసవనము, 2. అన్నప్రాసన, 3. విద్యారంభము, 4. ఉపనయనము, 5. జన్మదినము, 6. వివాహ సంస్కారము, వివాహ దినోత్సవము, 7. మంత్రదీక్షా సంస్కారములు.

⑧ పూజ్య గురుదేవులు మనల్ని వారి శిష్యులుగా గుర్తించా లంటే అన్ని పరిస్థితులలోను అయాచక వ్రతము, అపరిగ్రహ వ్రతము వీలైనంత వరకు మనస్సాక్షికి భంగం కలుగకుండా ప్రవర్తించాలి.

- గురుదేవులు ఆజ్ఞాపించిన కార్యక్రమాలు చేస్తూ ఫలితాలు గురించి ఆలోచించవద్దు.

***ఇక బాధ ఎందుకంటే,***

1981 నుండి 1991 నవరాత్రి వరకు సుమారు 3 లక్షల మందిని కల్సుకొనివుంటాను.

పూజ్య గురుదేవులను గూర్చి, పరమ పురుషుల ఆదేశాలు, కాలపురుషుని నిర్దేశము మీ అందరికీ అందించ టానికి ప్రయత్నం చేశాను. సాధ్యమైనంత వరకు వ్యక్తిగత సంపర్కానికి ప్రాముఖ్యత నీయకుండా, పూజ్య గురుదేవుల ఆదర్శాలే మీకు స్ఫూర్తినిస్తూ, ప్రేరణగా వుండాలనీ ప్రయత్నించాను.

✳ నా సాధనలో లోపం వలన, చేతకాని మాటతీరు వల్ల చెప్పదల్చుకొన్న దానిని స్పష్టమైన శబ్దాలలో చెప్ప లేక పోవడంవల్ల మీలో చాలా మందికి బాధ కల్గించి ఉంటాను.

- పూజ్య గురుదేవుల ఆదర్శాలను మీ ముందు సక్రమంగా ఉంచలేకపోవటం పూర్తిగా నాతప్పే.
- దాని వలన అక్కడక్కడ కన్పిస్తున్న, మొలకెత్తిన సంఘర్షణా బీజాలకు కారణం కూడ నేనే.
- కనుక మీ నుండి క్షమాపణలు కోరుతూ, ఒక సంవత్సర కాలం పాటు అన్ని భౌతిక క్రియాకలాపాలకు విరా మాన్ని ఇవ్వటానికి నిర్ణయించుకున్నాను.

నా శరీర ఆరోగ్యదృష్ట్యా, డాక్టర్ల సలహా కూడా యిదే.

నేను పైన చెప్పిన 8 కార్యక్రమాలు, పూజ్య గురుదేవుల, ఇతర మహాత్ముల పుస్తకములు స్వాధ్యాయం చేస్తూ - యుగసంధి కాలాన్ని నిరాశా, నిస్పృహలతో, పరస్పర దోషారోపణలతో వృధాచేయక, పూజ్య గురుదేవులు, పరమ గురువులు, గ్రహాంతరవాసులు, అనేక దివ్యాత్మలు కల్సి మనకందించే నూతన యోగమార్గాన్ని అందుకుంటూ, ఆచరిస్తూ,

ఒక దివ్య ప్రపంచానికి, ఆ ప్రపంచానికి గురుపీఠం వహించే భారత పౌరులుగా
మిమ్మల్ని మీరు మలచుకొంటారని ఆశిస్తున్నాను.

మీ
శ్రీరామకృష్ణ

P.S. : మళ్ళీ నాకై నేను సక్రియ ఆధ్యాత్మిక క్రియాకలాపాలలో పాల్గొంటున్నాననే వరకు నా ఏకాంత మౌనసాధనకు విఘ్నం కల్గించకుండా, మీ సమస్యల్ని, కోర్కెల్ని మాతాజీకి డైరెక్ట్‌గా వ్రాయండి. కామధేనువు వంటి ఆ మాతృమూర్తి చేతులలో మీ భవిష్యత్తు అతి ఉత్సాహజనకంగా, కళ్యాణమయంగా వుంటుందని మీకు మళ్ళీ గుర్తు చేస్తున్నాను. నా కోర్కెను మన్నించి, నా వ్యక్తిగతమైన నా జీవితాన్ని నా కిష్టమొచ్చిన రీతిలో మల్చుకోనిస్తారని ఆశిస్తున్నాను. మళ్ళీ ఎప్పుడో .......... ఉత్తరం వ్రాసే వరకు శెలవా మరి !!!

ఓం

# స్థితప్రజ్ఞత

✧ చైతన్యము ఇంద్రియాలలో, మనస్సులో వర్తిస్తున్న పుడు బహిర్ముఖం అవుతుంది.

✧ అదే బుద్ధిలో పని చేస్తున్నపుడు మనసుకు, ఇంద్రియాలకు, గదిలో లైటు వస్తువులకు వెలుగునిచ్చు నట్లు వెలిగిస్తుంది. కానీ వానిలో వర్తించదు.

- ఈ స్థితిలో ప్రజ్ఞ (చైతన్యము) అంతర్ముఖంగా ఉంటుంది. మనస్సు, ఇంద్రియాలు కూడా అంతర్ముఖం అవుతాయి.
- ఈ స్థితినే "స్థితప్రజ్ఞత" లేక "సమాధి" అంటారు.

(అంతర్ముఖ సమారాధ్యా -
లలిత సహస్రనామం గమనించండి.)

## స్థితప్రజ్ఞత లక్షణాలు

① సంకల్పములు లేకుండుట.

② మౌనము! మనస్సు బుద్ధితో లీనమైనప్పుడు కలిగిన మౌనమే సహజమైన మౌనము.

- రాగము, భయము, క్రోధములు తొలగినవాడు ఏ విధమైన వికారములు కలిగించే సంఘటనలు జరిగినా వాని పట్ల మౌనంగా వుంటాడు. ఈతడే ముని.

(వాల్మీకిర్ముని పుంగవ -
గాయత్రీ రామాయణం మొదటి శ్లోకం).

③ శుభము, అశుభములను వదలుట.

- సంకల్పరహితుడు కనుక, ముని కనుక ఈ విధముగా వుండగలడు.

④ పంచేంద్రియాలను తన ఆధీనంలో ఉంచుకోవటము.

- ఇది "నేను" అనే వెలుగును నిరంతరం స్మరించటంతోనే సాధ్యము.
- ఇంద్రియాలకు, మనస్సుకు, బుద్ధికి కూడా వెనుక గల శక్తియే "నేను".

⑤ ఆత్మపై అభిరుచి గల్గినప్పటి నుంచి అది తరగనిది కనుక, ఇంద్రియార్థముల రుచుల విత్తనములు అల్పమైనవి కనుక సహజంగా జారిపోతాయి.

- ఈ స్థితిలో ఇంద్రియాలు, ఇంద్రియార్థాలతో ప్రవర్తించినా అవి చెదరిపోవు.

⑥ స్థితప్రజ్ఞుణ్ణి ఆత్మవంతుడు అంటారు.

- ఈ స్థితిలో స్వీకరించిన ఆహారాదుల ప్రయోజనం మానవునికి గలిగి, మానవుని ప్రయోజనం విశ్వ శ్రేయస్సుకు వినియోగపడును.

⑦ కామ, క్రోధములవల్ల మనస్సు కలతచెంది తాత్కాలిక విలువలపై ఆసక్తి కలుగుతుంది.
దీనినే సమ్మోహము అంటారు.

- దేహము, ఇంద్రియములు, మనస్సు, తృప్తిననుసరించి పనిచేసేటపుడు మానవుడు వాని ప్రవృత్తుల లోనికి జారి వ్యయమైపోయి, వినాశనానికి కూడా కారకుడవుతున్నాడు.
- ఇలాకాక ఈ నానాత్వాన్ని పరిహరించి సర్వశక్తుల్ని ఏకముఖం చేసేవాడు స్థితప్రజ్ఞుడు.
ఇదే యోగసాధన.

ఎప్పటికప్పుడు జరుగుచున్న పనులను గూర్చి కలిగే భావనలను సన్యసింపగలవాడే యోగియై,
సర్వానికీ అతీతుడై సుఖాన్ననుభవిస్తాడు. అతడి మనస్సు ప్రసన్నత చెందుతుంది.
ఈ స్థితి అనుసరించుటయే స్థితప్రజ్ఞ లక్షణాలను కూర్చుకోవటానికి సాధనం.

మీ
R.K.



# గుణాతీతుని లక్షణాలు

గుణములు 3.

సత్వగుణము - వెలుగు, జ్ఞానము, ప్రసన్నత లక్షణాలు.

రజోగుణము - కార్యాచరణ, పట్టుదల లక్షణాలు.

తమోగుణము - విమూఢత్వము, అలసత్వము లక్షణాలు.

✧ ఇతరులలోని గుణాలను గమనించేటప్పుడు వారిలో సత్వ గుణమున్న వారిని అభిమానించుట, రజస్తమో గుణాలున్న వారిని చిన్నచూపు చూచుట జరిగే ప్రమాదం ఉన్నది.

ఇతరులు మనకు నచ్చినట్లు ఎందుకుండాలి?

వారిలో గుణాలే వర్తిస్తున్నాయని గుర్తుంచుకోవాలి.

- ఈ వివేకంతో మెలిగితే గుణాలు వర్తిస్తున్నాయని తెలిసి మంచివారు, చెడ్డవారు అనే అభిప్రాయాలు దూరం అవుతాయి.

❋ సుఖ దుఃఖాలు మన స్వభావాన్ని అనుసరించి మనసులో పుట్టే అనుభూతులు.

- సుఖం కానీ, దుఃఖం కానీ సన్నివేశాలలో వుండదు. వాటికి వ్యక్తి స్పందించే విధానంపై ఆధారపడి ఉంటుంది.

♠ స్వభావము అంటే త్రిగుణాలు ఒక ప్రత్యేక విధానంపై మేళవించుటము.

✥ గుణములు నేను కాదు అనే వివేకముతో ఎల్లప్పుడూ ఉండాలి.

❋ ఈ వివేకముతో వుండే వానికి కూడా ఇష్టాలు, అయిష్టాలు ఉంటాయి.

- కానీ ఇష్టమైనా, అయిష్టమైనా ఒకేలా అనుభవిస్తాడు. ప్రత్యేకముగా సంతోషించుటకాని, చికాకు పడటము కానీ చేయడు.

వ్యక్తుల్లో గుణములతో కూడిన వారిలో గుణములే వర్తిస్తున్నాయని గుర్తుంచుకోవాలి.

✤ ఎవరైనా తనను మిత్రుడని కాని, శత్రువని కాని అనుకుంటే, అతను కాదనడు.

- తనకు మాత్రం మిత్రులు, శత్రువులు అని వుండరు. తనకు ప్రత్యేకించి ఏవిధమైన భావములు, అభిప్రాయములు ఉండవు.

- కనుక ఏ పనిని తనవద్ద నుండి ప్రారంభించడు.

సర్వారంభ పరిత్యాగి అంటే ఇదియే అర్థము.


❀ ఏ విధమైన మోటివ్ లేకుండా, పనులు జరుగుతుంటే తాను సాక్షిగా గమనిస్తూ ఉంటాడు.

- ఫలితాలపై అతనికి దృష్టి వుండదు.

ఈ వాక్యాలందలి సాధనను ఆచరించి పరివార సభ్యులు గుణాతీతులు కావాలని, కూర్మావతార ప్రక్రియ సందర్భంలో ఆ విధమైన గుణాతీత స్థితి ప్రజ్ఞత్వం కలగాలని ఆశిస్తూ,

ఇట్లు

R.K.



# జీవించటం ఎలా?

✧ మీ యొక్క మానసిక అయస్కాంతము - అనంత పుణ్య సంస్కారాల ఫలితం ఈ మానవ జీవితం.

- దీనిలో గెలుపొందుటకు మీరు మానసిక, కాయక, ఆధ్యాత్మిక శక్తి పెంపొందించుకోవాలి.
- దీనికి మీ "మానసిక అయస్కాంతము" సజీవంగా, సశక్తంగా ఉండాలి.

ఒక పండితుడు ఇలా వ్రాశాడు. "సకల పరారధమై జగమాహి కర్మహిన్ నరపావత నాహి"

శ్రీ వస్తువులు వెనకాతల మనం పరిగెట్టుట వల్ల మన లక్ష్యాన్ని పొందలేము.

- వాటిని మనవైపు ఆకర్షించే 'అయస్కాంతము'ను మనలో వికసింప చేసుకోవాలి.

## మానవ అయస్కాంత నిర్మాణము

❂ ఈ అయస్కాంతము - స్పష్టమైన కోరిక! అతి తీవ్ర కోరిక!!

- తన ప్రశస్తమైన మార్గమును జ్వరము, ప్రతికూలత, శోక రోగాలవల్లకానీ, లోభము వలన కానీ వదలడు.
- ధృఢ నిశ్చయములు ఉన్న వ్యక్తి ధన్యుడు.

శ్రీ పరిస్థితులను ఆకర్షించుకొనుటకు కొన్ని నియమాలు ఉన్నాయి. మామూలు సగటు యోగ్యతగల వ్యక్తి దేనినీ ఆకర్షించలేడు.

- "ఉచ్చస్థాయిలో ఉన్న సచేతన అయస్కాంతము, సర్వోత్కృష్ట వస్తువులను, పరిస్థితులను తన వైపు లాగుకొంటుంది.

✳ మీరు ఏ కార్యాన్ని ఎన్నుకొన్నారో దానిని ప్రేమించండి.

- పూర్తి నిష్ఠ, సహయోగము, ధృఢత్వము, మనోయోగముతో దాని మీద మీ ఇచ్ఛాశక్తిని కేంద్రీకరించవలసి ఉంటుంది.
- మీ ఇచ్ఛాశక్తి తీవ్రతే, మీ అయస్కాంత తీవ్రత!

✳ అనుకూల పరిస్థితుల గురించి ఆలోచించండి.

- యోగ్యత ఉన్నచో లక్షలాది అనుకూల పరిస్థితులు మీ కాళ్ళ దగ్గరికి వస్తాయి.

✳ సాఫల్యము యొక్క మూలం మన అంతరంగంలో ఉంది.

- మీ కామన, కోరిక గురించి నడుస్తున్నా, కూర్చున్నా, వింటున్నా, త్రాగుతున్నా, మెలకువగా ఉన్నా, నిద్ర పోయినా, నిరంతరం ఆలోచిస్తూ ఉండండి.
- ఆ ఆలోచనలు, యోజనలు, దానికి సంబంధించిన కల్పనలు ఒక క్షణం కూడా మీ మనస్సు నుండి వేరు కాకూడదు.

✳ మాటిమాటికి సుఖద ఆలోచనల యొక్క సఫల ఊహా చిత్రాలను భవిష్య గర్భంలో చూడండి.

- "నాకు ఆ వస్తువు లభించినది. నా పరిస్థితి నేను ఊహించుకున్నట్లే ఉన్నది" ఈ భావన మనసుల్లో సర్వత్రా ఉండాలి.

## ఉత్కృష్టతతో నిరంతర విజయం

❀ ఇది ఉత్కృష్టతా (Specialization) యుగం.

- ఉత్కృష్టత ధనమును తన వైపు లాగుకుంటుంది.

- మీరు ఎంచుకున్న క్షేత్రంలో ఉత్కృష్టత సంపాదించండి. అనేక కార్యక్రమాలలో తల దూర్చవద్దు.

## ఏకాగ్రత బహుమూల్య గుణము

- ఇచ్ఛాశక్తిని, మీ సమస్త శక్తులను ఫలసిద్ధి మీద కేంద్రీకరించండి. మనస్సును అన్ని వైపుల నుండి లాగు కొని వచ్చి ఒక విషయం మీద నిలపండి.
- గుర్తుంచుకోండి, 'మనస్సు'కు మీరు దాసులు కాదు.
- సమయము యొక్క ఉపయుక్తము తెలుసుకుంటే మీరు ప్రపంచాన్ని మార్చగలరు.
- 8 గంటలు విశ్రమము, 2 గంటలు మనోరంజనము, 4 గంటలు నిత్యకర్మను తీసివేసినా, నిత్యము 10 గంటలు లక్ష్యసిద్ధి కొరకు ఉపయోగించుకోండి.
- ఇప్పుడు చేతిలో ఉన్న పనిని ద్వేషిస్తూవుంటే, ప్రేమించటం నేర్చుకొని, దిగ్విజయంగా పూర్తిచేయండి.
- ఉన్న పరిస్థితుల నుంచే ఎదగాలి.
- మీ లక్ష్య సాధనకి - ఇప్పటి పరిస్థితుల నుండి - రోజుకి 10 గంటల కాలం పూర్తి పరిశ్రమంలో కష్టపడే టట్లు ప్రణాళిక వేసుకోండి.

మీ జీవితం నుండి ఏమి పొందగోరుతున్నారు?
మీ జీవిత ఉద్దేశ్యము ఏమిటి?

ఈ ప్రశ్నలకు జవాబు మీ దగ్గర ఉన్నదా?
ఉద్దేశ్యహీనులు ఎటు, ఎలా, ఏమి చేయగలరు?

- భావనలు, మన ఆలోచనలు బుద్ధిని సృజిస్తాయి. దాని వల్ల భౌతిక క్రియ చేయాలనే ఉత్సాహము కలుగుతుంది. <u>భావనల స్థాయి సాధారణ కల్పనల కంటే ఉచ్ఛ స్థాయి.</u>
- ఆలోచనలు, భావనల యొక్క మూలము ఆ వ్యక్తి మనస్సు యొక్క క్షేత్రములో లోతుగా పాతుకుపోయి ఉంటుంది.
- లేచినపుడే తెల్లవారినట్టు ఇప్పటి నుండి మీ జీవిత ఉద్దేశ్యాన్ని నిర్ధారించుకోండి.
- మీ జీవితోద్దేశము నిర్ధారించుకున్నప్పుడు క్రింది విషయాలు గమనించుకోండి.

① అది ఉచ్ఛమైనదా?
② సంభవమా?
③ మీరు సాధించగలరా?
④ ఏమి లోట్లున్నాయి, దానిని ఎలా ఎదుర్కొంటారు?
⑤ ఒకవేళ ఆ పని పూర్తి కాకపోతే, <u>ఒక మంచి పనికి ప్రయత్నం చేశాననే తృప్తి కలుగుతుందా?</u>

- చాడీలు చెప్పుట, తప్పులు పట్టుట, నిరాశ పూర్తిగా వదిలివేయండి.
- లక్ష్యసాధనలో మీకు పూర్తిగా సహకరించేవి,

① శారీరక ఆరోగ్యము
② ఆరోగ్యంగా ఉన్న ఉత్సాహపూరితమైన, ఆశావాది దృష్టికోణము గల మనస్సు
③ మిత్రులు, హితులు
④ అనేకుల అనుభవాలసారమైన పుస్తకాలు
⑤ ఆంతరిక శాంతి
⑥ ఇతరుల సహయోగం పొందగలిగే నేర్పు

వీటి సహాయంతో మీ జీవిత ఉద్దేశ్యాన్ని సాధించండి.

మీ
R.K.



ప్లాట్ నెం. 50, వేణుగోపాలనగర్,
గుంటూరు,
8.15 ఎ.ఎమ్., 19.7.92

ఆత్మీయ గాయత్రీ పరిజనులకు,

ప్రేమపూర్వక హృదయాభివందనములు!

చూస్తూ చూస్తూ యుగసంధి కాలములో రెండు వసంత పర్వములు (1991 వసంత పంచమి, 1992 వసంత పంచమి) గడచిపోయినవి.

☆ 1993 వసంత పంచమి నుంచి మన కార్యకలాపాల లోని "ప్రఖరప్రజ్ఞ - సజలశ్రద్ధ", మన శరీరములో ప్రవహించే ఇడ, పింగళనాడుల శక్తిధారల సమన్వయము జరిగి, 1993 గాయత్రీ జయంతి నాటికి సుషుమ్నా మార్గం ద్వారా ప్రయాణించే "ఋతుంభర ప్రజ్ఞ అవతరణము (వరాహావతారము)" అనేక మంది సాధకులలో విశ్వమంతా జరిగి తీరుతుంది.

"శపథ సమారోహ" ఉద్దేశ్యము, సంస్కార పరంపరను నవీన మార్గములో ఋషుల ప్రేరణ మేరకు మనకు అందివ్వటము, ఈ ప్రజ్ఞావతరణ కోసమే.

యోగి అరవిందులు చెప్పిన అతి మానస చేతనత్వాన్ని పూజ్య గురుదేవులు మన పరివార్ సభ్యులకు సుషుప్తావస్థలో ఉన్నప్పుడు అందిస్తారు అన్నది అఖండ జ్యోతి పాఠకులకు విదితమే.

✧ కానీ నిద్రావస్థలో పొందినది జాగ్రదావస్థలో జ్ఞప్తికి తెచ్చుకొనుట అనునది ముఖ్యము.

దీనినే గీతలో అర్జునుడు "నష్టోమోహః స్మృతిర్లబ్ధా" అన్నాడు (నా మోహము పోయినది. నేనెవరినో, నేను చేయవలసిన పని ఏదో నాకు జ్ఞప్తికి వచ్చినది).

❋ మహాభారతంలో సూర్యపుత్రుడైన కర్ణుడి జీవితము (గాయత్రీ మంత్ర సాధకుడు) ఇంద్రియ వశీభూతమైనప్పుడు, ఆ దివ్యాస్త్రాలను అవసరం వచ్చినప్పుడు ఎలా మరచిపోతాడో తెలుపుతుంది.

❂ సూర్యుని పుత్రుడైన కర్ణుడు (ప్రజ్ఞ) పృథ్వీ పుత్రుడుగా మారతాడు (కుంతీదేవికి జన్మిస్తాడు - శ్రద్ధ).

- అప్పుడు సహజంగానే కవచకుండలములుండి అవి సాధకుడిని భూమి మీద ఉన్న వికారాల నుండి రక్షిస్తూ ఉంటాయి.

❂ కానీ ఇంద్రియాలకు అధిపతి అయిన ఇంద్రుడు ఆ కవచకుండలాలను నిర్మోహమాటంగా అడిగేస్తాడు.

- సూర్యుడు వద్దన్నప్పటికీ అహంకారానికి లోనైన కర్ణుడు అడిగిన దానిని లేదనకుండా ఇస్తాడు.

సాధకుడు చేసే తప్పు కూడా అదే.

❀ దీని నుంచి కాపాడటానికి సవితారూపము ఘనీభవించి, రూపుదాల్చిన పూజ్య గురుదేవులు ప్రకృతికి లొంగిపోయే (కర్ణుడు దానశీలతకి లొంగిపోయినట్లు) గుణాన్ని చూసి 4 సంయమాలు పాటించి తీరాలి అని ఆదేశించారు.

అవి మన కర్ణములతో విని పాటించము. అవి,

1. సమయ సంయమనము,
2. ఇంద్రియ సంయమనము,
3. వాక్ సంయమనము,
4. అర్థ సంయమనము.

మీ స్వాధ్యాయ మండలిలో ఈ ఉత్తరము చదివి పై సంయమనాలను పాటించడమే కాక, డైరీ రైటింగ్, దేవస్థాపన కార్యక్రమానికి పూజ్య గురుదేవులు నిర్దేశించిన 1. నియమిత ఉపాసన, 2. సతత స్వాధ్యాయము, 3. బలి వైశ్యదేవము ప్రక్రియలను కూడ మీ యిళ్ళల్లో ఆచరించ

డమే కాక, మీ బంధు, మిత్ర, పరివార సభ్యులు అందరికి వాటి ప్రాముఖ్యతను తెలుపుతూ, సాధనలో తీవ్రతని పెంచుతారని ఆశిస్తున్నాను.

ఇక నుంచి మీకు వ్రాసే ఉత్తరాలలో 1993 వసంత పంచమికి సూక్ష్మజగత్తులో గురుదేవులందిస్తున్న అనంత జ్ఞాన సంపదను మనము స్పష్టముగా తెలుసుకొని ఇతరులకు సులభముగా తెలిసే రీతిలో చెప్పగలిగే సాధనా పద్ధతులను తెలపటానికి ప్రయత్నిస్తాను.

ఈ విశిష్ట సాధనా కార్యక్రమంలో పాలుపంచుకునే వారు ఏ ఊరి వారైనా తమ అడ్రసులను నాకు వ్రాయవచ్చు.

మీ
శ్రీరామకృష్ణ

P.S. : పైన చెప్పిన నాలుగు సంయమనాలను కచ్చితంగా పాటిస్తాను అని నిర్ణయము తీసుకున్న వ్యక్తులు ఏ ఆధ్యాత్మిక సంస్థకు చెందినవారైనా తమ పేర్లను అడ్రసుతో సహా పంపించవచ్చు. సాధకుల సంఖ్య ఎంత పెంచితే అంత మంచిది.



50, వేణుగోపాలనగర్,
గుంటూరు
6.45 పి.ఎమ్., 23.12.92

ఆదరణీయ యుగ నిర్మాణ యోజన ఔత్సాహికులకు,

- గురు-సత్తా, మహాకాలుని జంట ప్రేరణలతో భువి, అంతరిక్షమును మథించటానికి జరుగుచున్న అనేక అతి గుప్తమైన కార్యక్రమాలు ఒకదాని తరవాత ఒకటి భౌతిక రూపమును దాల్చే సమయము ఆసన్నమైనది.
- (గురుసత్తా పద ప్రయోగాన్ని గమనించి అర్థము చేసుకోవటానికి ప్రయత్నించండి).
- మానవజీవితంలో పంచవర్ష ప్రణాళికలు ఏ విధంగా ఒక జాతి సామూహిక జీవితాలను నిర్దేశిస్తుందో,

  అదే విధంగా సుమారు "2400 సంవత్సరాల యుగ చక్ర అవధి" భూమిలోని ఖనిజ, వృక్ష, జంతు, మానవ జాతులను ఒక నిర్దుష్ట లక్ష్యం వైపుకు తీసుకువెళ్ళటానికి ప్రయత్నిస్తుంది.
- ఒక మహత్తరమైన అతి మానస జగత్తులో నివసిస్తూ, భూమి కాలమానం ప్రకారం 200,00,30,000 సంవత్సరాలు జీవించగలిగే దేవతా స్థాయిని అధిగమించిన వ్యక్తుల పరిషత్తు ఈ 2400 సంవత్సరాల అవధిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో నిర్ణయిస్తుంది.
- ఈ 'యుగ నిర్మాణ యోజనా' 'ప్రణాళికా సంఘము' 2400 సం॥ అవధిని రాశిచక్రం పేర్ల ద్వారా గుర్తిస్తారు.
- శ్రీకృష్ణ నిర్యాణము తరవాత రెండు ప్రణాళికలు పూర్తి అయి (మేష యుగము, మీన యుగము, అనగా 2400 + 2400 = 4800 సంవత్సరాలు) నవీనారంభ కుంభ యుగా (AQUARIAN AGE) నికి

  1890 నుంచి 1962 వరకు ఉన్న కాలాన్ని మీన - కుంభ సంధిగా ఉపయోగించుకున్నారు.
- అంటే SIRIUS నక్షత్రములోని మహామహిమాన్వితమైన విశిష్ట ప్రణాళికా సంఘము ద్వాపర యుగాంతము తరవాత జరిగిన ఈ 5,000 సంవత్సరాలలో

మేషయుగ నిర్మాణ యోజన ప్రణాళిక, మీనయుగ నిర్మాణ యోజన ప్రణాళికను పూర్తిచేసుకొని, -

- మీన-కుంభ ప్రణాళికా సంధికాలానికి అవసర మయ్యే సాధనా విధి విధానమును -

- (మేష, మీన యుగ ప్రణాళికలకు అవసరమయ్యే శరీర నిర్మాణాన్ని మార్చి నవీన కుంభయుగ పరిస్థితు లకు స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలో స్పందన అను భవించగలిగే, అనుభూతి చెందగలిగే, తక్షణము కార్యా చరణలో ఉపయోగపడే శరీరాల నిర్మాణము) -

- కుంభరాశి, కుంభలగ్నములో అవతరించిన త్రేతా మహాయుగ - ద్వాపర మహాయుగ పేర్ల సమిష్టి చేతనత్వ రూపంలోని శ్రీరామకృష్ణ పరమహంస అవతరణ ద్వారా అందించారు.

✧ పేర్ల సార్థకత ద్వాపర యుగాంతం తరవాత రామకృష్ణ పరమహంస జీవితంలోనే కనిపిస్తుంది.

✧ మీన - కుంభ ప్రణాళికా సంధికాలము 1890 నుండి ఆరంభించబడినది.

ఒక ప్రణాళిక రూపొందించినపుడు, దానిని క్రియా న్వయము చేసే ముందు అవసరమయ్యే దిశానిర్దేశాలు, సంకల్పము తెలుపబడతాయి.

❋ 1911 లో మొత్తము విశ్వ సంకల్పస్థాయిని, నవీన కుంభయుగ ఆవిర్భావమునకు అనురూపమైన సంకల్పాలుగా తయారు చేయుటకు అవతరించిన పూజ్య గురుదేవులు, -

- సుమారు 600 కోట్ల గాయత్రీ జపశక్తితో హిమాలయా లలో త్రేతా, ద్వాపర యుగాల నుంచీ జీవించివున్న అమోఘ శక్తిసంపన్నులయిన మహర్షులను, రాజర్షు లను, బ్రహ్మర్షులను, దేవర్షులను సంప్రదించి, 1956 నుంచి బాహ్యాజగత్తులోని గాయత్రి మంత్ర జప సాధకుల కూటమి ఏర్పాటు చేసిన తరవాత, -

- 1962లో సంభవించిన అత్యద్భుతమైన అష్టగ్రహ కూటమి ద్వారా ఉత్పన్నము చెందిన ప్రచండ శక్తిధార లను ఉపయోగించుకొని యుగనిర్మాణ యోజనా సంకల్పముల కూర్పు జరిగినది.

❋ జ్యోతిశ్శాస్త్రములోని ఒక డిగ్రీ ($1^0$)గమనాన్ని సుమారు ఒక సంవత్సరంగా గుర్తిస్తారు. అందువల్ల 30 డిగ్రీ లలో ఒక రాశి పూర్తి అయి, రెండవరాశి మొదలవు తుంది. 1962 నుంచి 30 సంవత్సరాల (యుగ ప్రభావము) పరిమాణము 1992కు పూర్తి అవుతుంది.

❋ అందువల్ల నవీన కుంభ యుగ ప్రారంభము కొరకు అవసరమయ్యే, స్థూల ప్రకృతిలో జరుపబడే అన్ని ప్రక్రియల క్రియాన్వయము, గురుసత్తా - మహా కాలుని ప్రేరణతో ఎన్నడూ ఎరగనంత భవ్యమైన రీతిలో అశ్వమేధ శృంఖలగా రూపొందించబడినది.

❋ అందువల్ల గాయత్రీ పరివార్ యొక్క సహజమైన పరిణతి యుగ నిర్మాణ యోజనగా అవవలెనని పూజ్య గురుదేవుల ఆకాంక్ష.

❋ యుగ నిర్మాణ సత్సంకల్పములను పరిశీలించిన అవి దేశ, కాల, జాతి, ధర్మ, వయో భేదము లేకుండా మానవజాతి మొత్తానికి ఉపయోగపడతాయని నిస్సం దేహంగా తెలుసుకోవచ్చును.

- సెక్యులర్ వ్యక్తులు, జన సమూహాలు, దేశాధినేతలు ఈ సంకల్పాలకు అనుగుణ్యమైన జీవిత సూత్రాలను ఏర్పరచుకొనగలిగితే మహాకాలుని ఆకాంక్షతో పాటు గురుసత్తా (SIRIUS లోని పరిషత్తు చేతనత్వము) ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి.

✣ చేతనత్వాన్ని సమీకృతం చేసి ఒక దేశంలో రకరకాల వ్యక్తి సమూహాలను ఒకే లక్ష్యంవైపు వారి ఆలోచన లను, భావనలను, స్థూల క్రియాకలాపాలను క్రియా న్వయము చేయుటకు చేసే తాంత్రిక, జ్యామితీయ (GEOMETRY), వర్ణాత్మక (COLOUR), మంత్రాత్మక (SOUND), సాంఖ్యక (NUMBER) విధి విధానమే "జాతీయ పతాకములు".

✣ రాబోయే కుంభయుగ ప్రతీకాత్మక విభిన్న సామూహిక వర్గ విభజనే అశ్వమేధ యాగములోని విభిన్న ధ్వజ ములు, పతాకములు.

✣ రాబోయే కుంభయుగ ఆలోచనా సరళిని దృష్టిలో ఉంచుకొని పూజ్య గురుదేవులు యుగ గాయకులు,

యుగ సాహిత్యము మొదలగు అనేక ఆలోచనాత్మక (Thoughts), భావనాత్మక (Emotions), క్రియాత్మక (Actions) జీవిత విధానాన్ని మూడు పాదాలలో గాయత్రి మంత్ర సాధనగా - సంజీవినీ విద్యగా ప్రసాదించారు.

- <u>అంతేకాక గురువు అనే పదాన్ని తీసివేసి గురుసత్తా (సామూహిక సద్గురువుల ప్రేరణ) నిర్దేశాలను పొందటం నేర్చుకోండి అని ఆదేశించారు.</u>

అంతేకాక వసుధైక కుటుంబకమే అనేది సూక్ష్మ జగత్తులో ప్రవేశించాక జరుగుతుందని తెలియచేయటానికి యుగము మార్చటము కొంతమంది వ్యక్తి సమూహాల పనికాదని, పరా ప్రకృతిలో ఉత్పన్నమయ్యే ప్రచండ దిశా నిర్దేశక శక్తిధారల ప్రవాహములో జాతి, మత, కుల, లింగ వయో భేదము లేకుండా ఒక్క మానవజాతేకాక ఖనిజ, వృక్ష జాతులు కూడా తమ స్వభావాన్ని మార్చుకొనుట ప్రభావమేకాని కారణము కాదు (It is an effect but not a cause) అనేది తెలియచేయటానికే యుగసంధి శతాబ్ధములోని చివరి దశాబ్ధములో గాయత్రి జయంతి 1990 నాడు భౌతిక శరీర అవధులను అధిగమించారు. తత్ఫలముగా ఉత్పన్నమైన శక్తి తరంగాల ప్రభావము అశ్వమేధ శృంఖలగా పరిణతి చెందినది.

సూక్ష్మ జగత్తు యొక్క ఆలోచనా సరళి నవంబరు 1992 అఖండజ్యోతిలో దేవ సంస్కృతి దిగ్విజయ యాత్ర - దేవాసుర సంగ్రామము (P.3), మహాయజ్ఞముల వల్ల మహాప్రాణ కుండలినీ ఆలోకనము (P.14), అశ్వమేధము - సవిత - గాయత్రి సాధనలో (P.40) ఇవ్వబడినది. సాధకుని మానసిక స్థితి, అందుకు కావలసిన సాధనాత్మక వివరణ భగవద్గీత 11 వ అధ్యాయంలో ఇవ్వబడినది.

1990 నుంచి 2000 సం॥ల వరకు జరిగిన, జరుగు తున్న, జరగబోయే సంఘటనలను అర్థము చేసుకొని ఉపయోగించుకోవటానికి యుగ శిల్పులుగా మారదలచిన వారు తమ వ్యక్తిగత సాధనను గురుసత్తా యొక్క సార్వభౌమిక శక్తి కేంద్రాలతో సమతుల్యముగా (Similar Vibrations) నిరంతరమూ ఉంచుకోవటానికి కృషి చేయాలి. (మామనుస్మర యుధ్యచ)

ఈ పరిస్థితులలో ఏ విధమైన కార్యక్రమములు చేపట్టాలి అనేది నేను నిర్ణయించుకోలేక ప్రకృతి ఆదేశాల కొరకు నిరీక్షిస్తున్న తరుణంలో డాక్టర్ల సలహా మేరకు ఒక 5, 6 నెలలు శారీరక, మానసిక శ్రమకూడదు అని తెలిసినది.

అంతేకాక అనేక కోట్ల సంవత్సరాల తరవాత లభించే, దేవతలు కూడా కాంక్షించే అద్భుతమైన ఈ కాలాన్ని ఒక సంస్థాగత భౌతిక కార్యకలాపాలకు మాత్రమే ఉపయోగించి, ఏది చేయవచ్చో, ఏది చెయ్యకూడదో అనే వ్యర్థమైన చర్చలలో కాలాన్ని వృధా చేస్తూ, భావాత్మక పరిణతి, ఆలోచనాత్మక దిశ ఏర్పరచుకొనకుండా ఉండటం ఎంతో అన్యాయముగదా!

అందువల్ల 1-1-93 నుండి ఒక 5 నెలల పాటు విశిష్ఠ భావనాత్మక, ఆలోచనాత్మక, సాధనల పరంపర చేపట్ట దలిచాను. ఈ కారణంగా ఏ విధమైన భౌతిక, సంస్థాగత కార్యకలాపాలలో పాలుపంచుకొనను.

1980 నుండి గుంటూరు నుండి మొదలెట్టిన ఈ గాయత్రి పరివార్ కార్యకలాపాలు ఈనాడు రాష్ట్రమంతటా వ్యాపించాయి. అనేకమంది వ్యక్తులతో సంపర్కము ఏర్పడి వారినుంచి అనేక రకాల ప్రేరణను పొందాను.

సాధనలో ఉండవలసిన అతి ముఖ్యమైన 'అరతిర్ జన సంసది' అనే గీతా వాక్కును కొంత విస్మరించటం జరిగింది. అంతేకాక వ్యక్తిగత ఆలోచన సరళిలో భేదాలు సహజమైనప్పటికి నా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిలో తట్టుకోలేక పోతున్నాను. అందువల్ల ఇక మీదట నన్ను వ్యక్తిగతంగా 1-1-93 నుండి కలుసుకొనుటకానీ, సామూహిక కార్యక్రమా లకు పిలవటము, పాల్గొనమని అడగటమూ చేయవద్దు.

సాధనలో అభిరుచి ఉన్న వ్యక్తులు తమ తమ గ్రామాలలో స్వాధ్యాయమండలి ఏర్పాటు చేసికొని పురుష సూక్తము, శ్రీసూక్తము, భగవద్గీత 11 వ అధ్యాయం పారాయణ మొదలెట్టండి. కొన్ని శ్లోకాల అర్థము ప్రతిరోజూ చదవండి. మీ గ్రామాలలోని ఏ చిరునామాకు నా ఉత్తరాలు పంపాలో (సాధనా నిర్దేశాలు) తెలియచేయండి.

దయయుంచి వ్యక్తిగతంగా నన్ను కలుసుకోవద్దు.

సామూహిక కార్యక్రమాలకు నన్ను పిలవద్దు.

మీ

శ్రీరామకృష్ణ



సుకృతావిల్లా,
50, వేణుగోపాలనగర్.
గుంటూరు
7-52 పి.ఎమ్., 30-12-92

నవయుగ నిర్మాణ సూత్రధారులకు,

నూతన సంవత్సర శుభాకాంక్షలు!

పూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీ, వేదమాత గాయత్రిదేవి అనుగ్రహ ఆశీర్వాదాలు మీకు నిరంతరము లభించాలని గురుసత్తాని ప్రార్థిస్తున్నాను.

☆ జూన్ 2, 1990 గాయత్రి జయంతి విశ్వ ఇతిహాసంలో కొన్ని కోట్ల సంవత్సరాల వరకు ఒక చిరస్మరణీయమైన, ఆధ్యాత్మిక జగత్తులో ఇది వరకు ఎప్పుడూ జరగని, ఇక ముందు ఎప్పుడూ జరగబోని చారిత్రాత్మక సంఘటనగా నిలచిపోతుంది.

- మూడు మహాయుగాల తరవాత (మూడు కల్పముల తరవాత ) నాల్గవ యుగము యొక్క మధ్య భాగంలో జరిగిన ఈ విశిష్ట సంఘటన ఈ కల్పానంతరము మళ్ళీ ఏడు కల్పాల తరువాత మాత్రమే జరుగుతుంది.

- ఖనిజ జగత్తులో పరమాణు విస్ఫోటన జరిగిన రోజు ప్రపంచ చరిత్రలో ఏవిధంగా నిలబడిపోయిందో, పూజ్య గురుదేవులు పంచ వీరభద్ర సాధన, విశ్వ కుండలినీ జాగరణ, భారతదేశ కుండలినీ జాగరణ తరవాత జరిపిన ఆ విస్ఫోటన వల్ల జూన్ 2, 1990 మానవజాతి చరిత్రలో అదే విధంగా నిలబడిపోతుంది.

☆ ఆ రోజు గురుదేవులు యొక్క స్థూల, సూక్ష్మ కారణ శరీరాలు విస్ఫోటన చెంది అతి మానస జగత్తు (Supramental World) కి, మానవుల సమ్మిళిత మానసిక జగత్తు (Cosmic Mental World) కి మధ్య ద్వారాలను తెరచింది.

- కానీ ఈ మార్గము ఇంకా అందరికి సానుకూలము కాలేదు.

☆ అందుకొరకు 1990 నుంచి 2000 సం॥నికి మధ్య దశావతార ప్రక్రియ శక్తిధారలను సమీకరించి సంవత్సరానికి ఒక విశిష్ట అవతార శక్తిధారతో పృథ్విలోని సమస్త ఖనిజ, వృక్ష, జంతు సముదాయాలను స్వర్గావతరణ స్పందనలకు అనుకూలంగా మార్చే భగీరథ ప్రయత్నము పూజ్య గురుదేవుల నిర్దేశానుసారము జరుగుతుంది.

☆ 1990 వసంత పంచమి నుంచి 1991 వసంత పంచమి వరకు మత్స్యావతార శక్తిధారలు,

- 1991 వసంత పంచమి నుంచి 1992 వసంత పంచమి వరకు కూర్మావతార శక్తిధారలు,

- 1992 నుంచి 1993 వరకు వరాహావతార శక్తిధారలు ఉపయోగించుకొని,

- 1993 వసంత పంచమి నుంచి నారసింహావతారము యొక్క అతి ఉగ్ర శక్తిధారలు దివి నుంచి భువికి దింపే సన్నాహాలు జరుగుతున్నాయి.

✡ ఈ ప్రచండ, తీవ్ర, ఉగ్ర శక్తుల జంఝామారుతాన్ని పృథ్వి, దాని మీద నివసించే ఖనిజ, వృక్ష, జంతు, మానవ సముదాయాలు తట్టుకొనుటకు వీలుగా,

ప్రపంచమంతటా విభిన్న ప్రదేశాలలో వినియోగ కేంద్రాలుగా (Distribution Centres) మూడు రోజుల అశ్వమేధ యజ్ఞ ప్రక్రియ స్థూల, సూక్ష్మ, కారణ వాతావరణాలను పరిమార్జితము (Modify) చేయటానికి రూపొందించబడినది.

- భవిష్యత్తులో జరుగబోయే సంఘటనలు, జాతీయ స్థాయిలో మార్పులు, నరసింహావతార ప్రక్రియను మనస్సులో ఉంచుకొని ఊహించుకొనవచ్చును.

- నూతన ఖనిజాల ఆవిర్భావము,
- రేడియో ధార్మిక పదార్థాలను విశిష్ట మానసిక రోగాలలో ఔషధముగా ఉపయోగించుట,
- అంతరిక్షములో కొత్త ఉనికిని గుర్తించుట,
- వృక్షజాతులలో కొన్ని జాతులు సమూలంగా నశించి "తులసి" ప్రాధాన్యత పెరిగి ఐదు ఆయుర్వేద మూలికల బహుళ ప్రచారము,
- చేదు పదార్థాలలో మార్పు,
- ఆగ్నేయ దిశలుగా భయంకర అగ్ని ప్రమాదాలు,
- హిమాలయాల్లో ఒక విశేష నగర ఉనికిని గుర్తించుట,
- 4 నుంచి 8 సం॥ వయసు గల పిల్లలకు విశేష విద్యా విధానము రూపొందించబడుట,
- అమెరికా, రష్యా ఆర్థిక, రాజకీయ విధానాలలో ఊహించని మార్పు,
- టిబెట్ ఒక విశిష్ట ఆధ్యాత్మిక కూటమికి కేంద్రముగా మారుట,
- చైనా, జపాన్ భౌతిక సరిహద్దులు మారుట,
- భారతదేశంలో నవనిర్మాణ క్రాంతికి ఒక విశిష్ట మేధావి వర్గ (Intelctuals) కూటమి లాంటివి ఏర్పడుట జరుగవచ్చు.
- Medical (వైద్య) Methods (విధానము) లో ఆయుర్వేద ప్రాశస్త్యము కాంతి కిరణ సంయోగాలతో ముద్రల ఆధారంగా అభివృద్ధి చెందవచ్చు.

- పైన చెప్పిన మార్పులు జరగవచ్చును అనే స్థితి నుంచి జరిగినవి అనే స్థాయికి తీసుకొని వచ్చే గురుతర బాధ్యత పూజ్య గురుదేవుల - గురుసత్తా నుండి ప్రేరణ పొందగలిగే ప్రతి వ్యక్తి మీద ఉన్నది.

- కాలము అనుకూల పరిస్థితులు ఏర్పరచినా, వ్యక్తిగత కారణాల వల్ల ఈ బృహత్తర సదవకాశాన్ని ఉపయోగించుకొనలేకపోతే విశ్వ సౌర కుటుంబ చరిత్రలో మళ్ళీ ఇటువంటి అవకాశము లభించదు.

- అశ్వమేధ యజ్ఞము మూడు చరణాలుగా విభజింపబడింది. 1. ప్రయాజ 2. యాజ 3. అనుయాజ.

- ఇందులో ప్రయాజ అశ్వమేధ కర్మకాండకు ముందు జరుపబడే పూర్వ పీఠిక అయితే (Prologue),
- యాజ మూడు రోజుల విశేష కర్మానుష్ఠానము,
- అనుయాజ ఉత్తర పీఠిక (Epilogue) అవుతుంది.

ఇప్పటి దేశ కాల పరిస్థితులు, ప్రస్తుతము గాయత్రీ పరివార్ సభ్యుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ఆంధ్ర ప్రదేశ్‌లో మూడు రోజుల అశ్వమేధ యజ్ఞ కర్మకాండ ఎక్కడ, ఏ రోజులలో చేయాలో ఇప్పుడే నిర్ణయించుకొనటము బదులు, ప్రస్తుతం విస్తృతమైన ప్రచార కార్యక్రమం చేపట్టి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి మండలం, వీలైతే మండలంలోని ప్రతి గ్రామాన్ని గాయత్రి మంత్రముతో పరిచయము చేసి, అప్పుడు ఏర్పడిన విశాల పరివారముతో, సువిశాల కార్య సాఫల్యము కొరకు అనుకూల సామర్థ్యము గల వ్యక్తులతో చర్చించి స్థలము, తారీఖుల నిర్ణయము చేస్తే మంచిది. ఈ కార్యక్రమాలకి డిశంబరు 1993 లక్ష్యముగా నిర్ణయించుకుని, మే 1994 కి అశ్వమేధ యజ్ఞం స్థల, తారీఖుల నిర్ణయము హరిద్వార్‌తో సంప్రదించవచ్చు.

- ప్రయాజలో గాయత్రి మంత్ర సాధకులను ఆంధ్ర ప్రదేశ్‌లో 50 లక్షల మందిని తయారుచేసే లక్ష్యము ఏర్పరచుకొని కార్యక్రమాలు ప్రారంభించండి.

- యుద్ధ ప్రాతిపదికగా ఈ ఉత్తరము అందిన మరు నిముషము నుంచి ఈ క్రింద కార్యక్రమాలు గాని లేక వీలునిబట్టి చేయగలిగినన్ని కార్యక్రమాలు మీరు చేపడుతూ మీ ప్రభావ పరిధిలోని ప్రతి ఒక్కరికి ఈ విశిష్ట సమయ ప్రాముఖ్యతను వివరించి కార్యోన్ముఖులను గావించండి.

1. నిత్యము 108 సార్లు గాయత్రీ మంత్ర జపము చేసేవారి సంఖ్య పెంచుట.
2. రోజుకి 24 సార్లు గాయత్రీ మంత్ర లేఖనము చేసేవారి సంఖ్య పెంచుట.

3. గాయత్రీ చాలీసా నిత్య పారాయణ చేసే వారి సంఖ్య పెంచటం.
4. సాధనలో రుచి ఉన్నవారికి లఘు అనుష్ఠాన (9 రోజులు), అనుష్ఠాన (40 రోజులు), గాయత్రీ అభియాన్ (1 సంవత్సరము) సాధనా పద్ధతులు తెలియజేయుట.
5. ఉపాసన, సాధన, ఆరాధన పద్ధతులు తెలపటం.
6. సమయ సంయమనము, ఇంద్రియ సంయమనము, వాక్ సంయమనము, అర్థ సంయమనము నిత్య జీవితములో పాటించుట.
7. పంచకోశ సాధనలను తెలియజేయుట.
8. ప్రజ్ఞాయోగము - దాని వివరణ.
9. ప్రజ్ఞా పురాణ సప్తాహాలు నిర్వహించుట.
10. సంస్కారాల ప్రాముఖ్యత వివరించి జన్మదిన, వివాహ దిన సంస్కారాలు అందరూ చేసుకొని తీరాల్సిందే అని కోరుట.
11. యుగ గాయకులను గుర్తించి వారిని ఉత్సాహ పరచుట.
12. యుగ నిర్మాణ యోజనా సత్సంకల్పములను బహుళ ప్రచారము చేయుట.
13. పూజ్య గురుదేవుల జీవితము యొక్క బహుముఖీ వ్యాపకత్వము వివరించుట (గాయత్రీ మంత్ర ప్రభావము)
14. దేవ సంస్కృతి దిగ్విజయ యాత్ర విశేషాంకము (నవంబరు 1992 అఖండజ్యోతి) లోని ప్రతీ వ్యాసమును కూలంకశంగా చదివి తెలుసుకొని అశ్వమేధం గురించి ఇతరులతో చర్చించుట. వీలయితే ప్రతి ఊరిలోను వారానికి ఒక రోజు అందరూ కలసి ఈ చర్చలో పాల్గొనవచ్చును.

నవంబరు 1992 అఖండజ్యోతి తెలుగు అనువాదం వ్రాత ప్రతి కావలసినవారు క్రింది చిరునామాలో సంప్రదించి వ్రాత ప్రతి ఒక కాపి స్వయముగా వ్రాసుకొని తీసుకొనవలసినదిగా ప్రార్థన.

శ్రీమతి ఎల్. రాజ్యలక్ష్మి, మాథ్స్ అసిస్టెంట్,
జడ్.పి.పి. గరల్స్ హైస్కూలు,
వేటపాలెం - 523 187,
చీరాల తాలూకా, ప్రకాశం జిల్లా.

పై కార్యక్రమాలు, మిగతా విషయాలు కేవలము నా సూచన మాత్రమే. కానీ ప్రతి ఒక్కరూ తమ పూర్తి సామర్థ్యంతో, శక్తి వంచన లేకుండా తమకు అనుకూలమైన పద్ధతులలో ఈ విశాల ప్రచార కార్యక్రమానికి మీ సహకారాన్ని అందజేస్తారని ఆశిస్తున్నాను.

నూతన సంవత్సర శుభాకాంక్షలతో నవయుగ నిర్మాణ యుగసంధి కాలంలో
యుగ శిల్పులుగా మీవంతు కార్యక్రమాన్ని నిర్వహించుటయే గాక,
యుగనేతలుగా మీరందరూ రూపొందుతారని కోరుకుంటూ,
గురుసత్తా ప్రేరణలు మీకు అందుతాయని ఆశిస్తూ,

మీ

శ్రీరామకృష్ణ

పునశ్చరణ : పైన చెప్పిన విషయాలు కేవలము నా సలహాలు మాత్రమే. ఆధ్యాత్మిక సాధనలో ప్రతి ఒక్కరికి స్వయం నిర్ణయ అధికారము ఉన్నది. అందువల్ల పైన చెప్పిన మాటలలో మీకు నచ్చిన అంశాలు మాత్రమే తీసుకొన ప్రార్థన. ఏ విషయములో అయినా మీకు నచ్చని అంశము ఉంటే క్షమించ ప్రార్థన.

మీ

R.K.

# లేఖామాల - 1993



❋ ఏ ఆధ్యాత్మిక సంస్థ యొక్క ఉద్దేశ్యమైనా - పూర్వకాలపు ఋషి పరంపరకు పరాకాష్ఠయైన దధీచి నుండి ఈనాడు మన మధ్యనే జీవించి యున్న శ్రీసత్యసాయి బాబా వరకూ - భూమిపై స్వర్గావతరణే ముఖ్యము.

- కానీ అందరూ ఇతరుల్ని మార్చాలనే ప్రయత్నం చేస్తున్నారు తప్ప, తాను ఏ విధంగాను మారటానికి ప్రయత్నం చేయటం లేదు.

❁ మీరు మారండి - మీ కుటుంబాన్ని మార్చండి - మీ స్నేహితులను మార్చండి - సమాజము మారుతుంది.

- అంతే తప్ప మీరు మారకుండా, ఒక సంస్థలో మెంబర్‌షిప్ ఉండటం వల్ల ఇతరుల కంటే చాలా గొప్ప స్థాయిలో ఉన్నాము అనే అహంకారాన్ని వదిలి వేయండి.

# ముందు మాట

(1993 లో మాస్టరుగారు అందించిన లెటర్స్‌తో కూడిన
"లేఖామాల - 1993" అనే పుస్తకానికి వ్రాయబడిన ముందుమాట)



ప్రియ మిత్రులకు,

ఈ చిన్న పుస్తకముతో మన మాష్టారుగారు సాధక స్నేహితులకు అప్యాయంగా వ్రాసిన ఉత్తరములను 3వ సంపుటిగా ప్రచురిస్తున్నాము.

మన శ్రీరామకృష్ణగారు వారు గణించిన అపార సాధన అనుభవ ములను ఈ మహత్తర యుగసంధి కాలంలో అందరికి అందించాలనే ఆపేక్ష గలిగి వున్నారు. మన భారతదేశములో అనేకమంది మహాత్ములు జన్మించి, కాలానుగుణముగా ప్రజలకు సాధనా మార్గము చూపిస్తున్న ప్పటికి, వారి వారి అనుయాయులు వారు బోధించిన లక్ష్యములు, సాధన పద్ధతులకన్న, సంస్థాపరమైన విషయములకు ప్రాధాన్యతనిచ్చి, చివరకు అసలు లక్ష్యం మరచినట్లు గోచరిస్తున్నది.

మనిషిలో దైవత్వ ఉదయము, భువిపై స్వర్గావతరణ ప్రతి గురువు, ప్రతి ఋషిల లక్ష్యం. ఈ రోజున గురువుల గొప్పతనం ప్రచారం చెయ్యటంకన్నా, వారు బోధించదలచుకున్న ఆత్మవిద్య నేర్చుకుని, ఆ విద్యలో పారంగతులైతే, ఆ గురువులు ఎంత ఆనందిస్తారో!

మిగిలిన విద్యలవలెనె, ఆత్మవిద్యకు ఒక సిలబస్ వుందని, ఈ సిలబస్‌ని యుగసంధికాలంలో మిగిలివున్న సుమారు 6 సంవత్సరాల కాలములో తేలికగా నేర్చుకొనవచ్చని, నిష్ణాతులు అవచ్చని అనేక మందికి ప్రేరణ నిచ్చి, సాధనా మార్గములో నడిపిస్తున్నారు శ్రీరామకృష్ణగారు.

ఈ లేఖామాల సాధకులందరు తిరిగి చదువుకోటానికి,
ప్రేరణ పొందటానికి, కొత్తవారికి కూడా
ఉపయోగపడతాయని ఆశిస్తూ,

మీ
ముక్కామల రత్నాకర్

☆✻☆✻✺✻☆✻☆



1346/4, GURGOAN,
14-5-93, 10-30 పి.ఎమ్.

# విశిష్ఠ సమర్పణ, సాధనా సత్రము

## గాయత్రీ నవరాత్రులు

(మే 22 నుండి మే 30 వరకు)

---

అశ్వమేధ యజ్ఞ పృష్ఠ భూమిలో పౌరుషము గల్గిసంపూర్ణ ఆత్మోత్సర్గము చేసుకోగల సాధకులందరికి గురుసత్తా యొక్క అరుదైన ఆహ్వానము!

- 'నవ' అనే పదానికి చాలా విపులమైన, గూఢమైన ఆధ్యాత్మిక అర్థము ఉన్నది.
- (9 ని ఎన్ని రెట్లు చేసినా, ఆ సంఖ్యను కూడితే 9 వస్తుంది. ఎగ్జాంపుల్, 9 x 6 = 54, 5+4=9) నవ దుర్గలు, నవ కన్యలు, నవ ధాన్యాలు, నవ గ్రహాలు, నవ రత్నాలు, నవ రంగులు, నవ రాత్రులు మొ॥
- 1991-99 వరకు ఉన్న తొమ్మిది సంవత్సరములు, యుగసంధి ఉత్తరార్థముగా, -

  (1980 నుంచి 2000 వరకు యుగసంధిగా పూజ్య గురుదేవులు తెలిపారు)

  - ఒక అత్యద్భుతమైన ఆధ్యాత్మిక బహుమతిగా, ప్రచండ ధైర్య సాహసముగల సాధకులకు ఒక Challenge గా (సవాల్‌గా) పిలుపునిస్తోంది.
- ఈ కాలములో పూజ్య గురుదేవుల "ప్రతిరోజు క్రొత్త జన్మ, ప్రతి రాత్రి క్రొత్త మృత్యువు" (హర దిన్ నయా జన్మ్, హర రాత్ నయా మౌత్) అనే సూత్రమును అనుసరించి జీవించగలిగితే,
- మహాభారతములోని అశ్వినుల స్తోత్రములో చెప్పినట్టు 360 లేక 720 జన్మల అనుభూతులను ఒక సంవత్సర కాలంలో పొందవచ్చును.

షష్టిశ్చగావః త్రిశతశ్చ ధేనవః
ఏకం వత్సం సువతేతం దుహంతి ।
నానాగోష్ఠా విహితా ఏకదోహనాః
తే అశ్వినౌ దుహతో ఘర్మ ముక్థ్యమ్ ॥

(360 గోవులు ఒకే దూడను ప్రసవించి పాలిచ్చుచున్నవి. అశ్వినీ దేవతలు అనేక గోష్ఠములందు ఒకే పొదుగు నేర్పరచి ఎండ వేడిమిని ఆహారంగా పిండుచున్నారు.)

ఏకాం నాభిం సప్త శతా అరాః శ్రితాః
ప్రధిష్వన్యా వింశతి రర్పితా అరాః ।
అనేమి చక్రం పరివర్తతేఽజరం
మాయాశ్వినౌ సమనక్తి చర్షణీ ॥

ఒకే కన్నం చుట్టూ 720 అరలు ఇమడ్చబడియున్నవి. వాని సందులందు మిగిలిన విభాగములు అమర్చబడియున్నవి. అట్టి చక్రమును అశ్వినులు ఆనందమునకై అమర్చి త్రిప్పుచున్నారు. ఆ చక్రమునకు పరిధి లేదు. అది పాతబడదు.

("అశ్వమేధము" లోని సౌరశక్తి సందోహనము అనే Title లేక Nov. 1992 హిందీ అఖండ జ్యోతిలో ఇదే Title గల వ్యాసము చూడండి.)

- ఇన్ని జన్మల అనుభూతులు అచిరకాలంలో పొందటానికి ధైర్య సాహసాలతో పాటు, అంత విపరీతమైన వేగంతో జీవించగలిగే వివేక విజ్ఞానాలు కావాలి.

దీనికి పూజ్య గురుదేవులు అందించిన యుగ నిర్మాణ యోజన సత్సంకల్పాలను ప్రాణాలైనా ఒడ్డి తు. చ. తప్పకుండా పాటించే ధీశక్తి కావాలి.

- ఒక రోజులోనే ఒక జన్మకు సరిపడిన అనుభూతులను పొందటానికి పూజ్య గురుదేవులు కొన్ని సూత్రాలను అందించారు.
- ఒక పిసినారి డబ్బును ఎలా ఖర్చుపెడతాడో, అలాగే సాధకులు తమ కాలాన్ని తూచి తూచి యోజనాబద్ధ ప్రణాళికగ అవసరమైన దిశలోనే నిరంతర జాగరూకత తో ఉపయోగించుకోవాలి.

- దాని కొరకు క్రింది సూత్రాలను గుర్తుంచుకోండి.

① నాటు, కోసుకో

② Give fully or take fully in all transactions

③ ఉపాసన, సాధన, ఆరాధన : సమయ, ఇంద్రియ, వాక్ అర్థ సంయమనాలు పాటించటం

④ "వహ శక్తి హమే దో .., విధాతా తూ హమారా హై.." అనే పాటలను ఉపయోగించుకోవాలి. (సాధనా రహస్యాలు అనే పుస్తకంలో వివరాలున్నాయి )

E.K. గారి సుపర్ణ సూక్తము, సరస్వతీ సూక్తము, విష్ణు సూక్తము, రుద్ర సూక్తము, అశ్వినీ దేవతలను పూర్తిగా మథించండి. Nov. 92, Dec. 92, Jan 93, Feb. 93, Mar. 93, Apr. 93 హిందీ అఖండ జ్యోతులను భావనలు ఎలా పెంచుకోవాలి? ఏ సాధన ఎలా చేయాలి తెలుసు కోవడం కోసం కనీసము 5, 6 సార్లు అక్షరం అక్షరం విడవ కుండా చదవండి. ఒక జన్మ అనుభూతి ఒక రోజులో ఎలా వస్తుందో బోధ పడుతుంది.

కాలచక్ర ప్రవాహం ఆగదు. కొన్ని వేల సంవత్సరాల నుండి గ్రహ గ్రహేతర మహాత్ములు ప్రణాళికా బద్ధంగా ఏ యుగసంధి కొరకు (1980-2000) సంపూర్ణ శక్తితో సన్నాహాలు చేశారో, దానిలోని 12 సంవత్సరాలు గడిచి పోయాయి (1980-92 వరకు). 13వ సం॥ నడుస్తోంది.

- గడచిన 12 సంవత్సరాలు మహాభారతంలో జూదంలో ఓడిపోయిన తర్వాత పాండవ వనవాసంతో సమానం.
- అక్కడ మహాభారతంలో పంచ పాండవులు ఈ 12 సంవత్సరాల కాలంలో పడిన అగచాట్లు, సాధనలు, మహర్షుల రాకపోకలు, అర్జునుడికి ఊర్వశీ శాపం, భీముడు కమల పుష్పం తేవటం మొదలగునవి,

  సామూహిక చేతనత్వంలో 1. సాయి 2. సత్యసాయి 3. E.K., 4. చిన్మయ 5. గాయత్రీ పరివార్ సమూహాలు 1980 నుండి 1992 వరకు సాధించినవి చూస్తే తెలుస్తుంది.

- 1993 అజ్ఞాత వాసమైన 13 వ సంవత్సరము. మహాభారతంలోని విరాట్ పర్వం, నల-దమయంతి చరిత్ర నుండి ఈ సంవత్సర సాధనా పద్ధతులు తెలుసు కోగలుగుతాము. వాటిని బట్టి మే 22 నుండి మే 30 మధ్య జరిగే అతి విచిత్ర గాయత్రీ నవరాత్రులలో ఎంత తీవ్రమైన సాధన చేయాలో తెలుస్తుంది.

(ఈ వివరణ చాలా జాగ్రత్తగా లోతుగా ఆలోచించి, తరచి తరచి మీ వ్యక్తిగత సాధనా పద్ధతి నిర్ణయించుకోండి.)

- 1990-2000 మధ్య అవతార ప్రాకట్య శక్తిధారలు కూడ భూమి మీద తమ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. దాని ప్రకారం ఈ సంవత్సరం నరసింహ శక్తిధార సంవత్సరము.

- (మన ప్రధాని పేరు కూడ అదే కావటం యాదృచ్ఛికం కాదేమో! మే 22 నుండి మే 30 - 1993 వరకు భారతదేశానికి చాలా ప్రాముఖ్యత సంతరించుకున్న రోజులు కావచ్చు !!)

అందువల్ల పాండవుల అజ్ఞాతవాసంతో పాటు ప్రహ్లాద చరిత్ర మీద కూడ ఆధారపడాలి. "ప్రకర్షణేన ఆహ్లాదః యస్యస ప్రహ్లాదః"

- అంటే దెబ్బ మీద దెబ్బ తిన్నప్పుడు కూడ ఆ సర్వాంత ర్యామి యొక్క అనంతమైన దయను అతి కష్టమయ పరిస్థితులలో కూడ అనుభూతి చెందగలగాలి, ఆనం దించగలగాలి. అదే ప్రహ్లాద తత్త్వం.

1980 నుండి 2000 వరకు (యుగసంధిలో) జరిగే ఈ విచిత్రమైన అద్భుత మహా సంగ్రామంలో (Read Spear of Destiny if you can procure it) మానవజాతి

తనకి ఇష్టమున్నా లేకున్నా ఇరుక్కుపోయింది. $12^1/2$ సంవత్సరాలు గడచిపోయాయి. జరిగిందేదో జరిగింది. ఇప్పుడైనా 'అహం' మమత్వాల బంధములు విడనాడి, ఎక్కడ ఉన్నా తమ తమ ఉద్యోగ, కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ ("యోగః కర్మసుకౌశలం") ప్రణాళికా బద్ధమైన జీవితాన్ని వేగంగా జీవించటం నేర్చుకోండి.

శ్రీ ప్రతి రాత్రి మరుసటి రోజు కార్యక్రమాలను స్పష్టంగా, వివరంగా, కేటాయించబడిన కాలంతో పాటు వ్రాసుకోండి. (వ్రాసుకోకుండా, డైరీ లేకుండా సాధన జరగదు.) దాన్ని తు. చ. తప్పకుండా ఆచరించండి.

- అనేక జన్మల పుణ్యఫలంవల్ల లభించిన ఈ మహత్తర అవకాశాన్ని, కేవలం బద్ధకంవల్ల, ఎవరి మీదో అయిష్టత వల్ల వంకలు పెట్టుకుని చేజార్చుకోకండి.

శ్రీ ఈ యుగసంధి కాలం యొక్క చివరి $6^1/2$ సంవత్సరాలు నిద్రలోనే గడిచిపోతాయేమో చూచుకోండి.

- మీ Personal లక్ష్యాలు, ఆత్మ, కుటుంబ, సమాజ నిర్మాణ లక్ష్యాలకొరకు తీసుకోవలసిన Time Bound Plan స్పష్టంగా ఇప్పుడే కాగితం మీద పెట్టండి.
- ఈ గాయత్రీ నవరాత్రులలో పూజ్య గురుదేవులకు (లేక గురుసత్తా) పూర్తి ఆత్మ సమర్పణ చేసుకుని, లక్ష్యం చేరుకోవటానికి అవసరమయ్యే అద్భుతమైన శక్తులను, అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందండి.

గాయత్రీ జయంతి (జ్యేష్ట శుద్ధ దశమి) బ్రహ్మ నుండి సృష్టి ఆదిలో గాయత్రి ఆవిర్భవించిన రోజు. మహాభాగవతంలో దీనికి సంబంధించిన వివరణ యిలా వుంది.

ఆదిలో సృష్టి ఎలా ప్రారంభించాలో తెలియక దిక్కుతోచని బ్రహ్మకి (గాయత్రీ మంత్రంలోని) 16వ అక్షరం 'త' 21 వ అక్షరం 'ప' సాధన చేయమని ఆకాశవాణి వినిపిస్తుంది. అది రెండు సార్లు వినిపిస్తుంది. (తప, తప). 1000 సంవత్సరాల ఆ తపస్సు ద్వారా వేదమాత, విశ్వమాత, దేవమాత స్వరూపంగా అపౌరుషేయమైన త్రిపద గాయత్రీ ఆవిర్భవించింది. (పై పేర్లు సాధన రహస్యాలు తెల్పుతాయి. విష్ణు సహస్రనామం కూడా సాధనా విధానాలు తెలుసుకొనుటకు ఉపయోగపడుతుంది.)

* ప్రకృతీ పరిణామక్రమంలో మళ్ళీ సృష్టి ఆది లోని Crisis, గంగావతరణ సమయంలో వచ్చింది. ఆ Crisis Point ని భగీరధుని ప్రయత్నం దాటించింది.

శివుని జటలోంచి విడుదలైన గంగ 3 ధారలుగా 1. స్వర్గంలో 2 పాతాళంలో 3 పృథ్విలో ప్రవహించింది. అందుకే గంగను "త్రిపథ గామిని" అంటారు. భగీరధుని గంగ యొక్క సంపూర్ణ వృత్తాంతము మరి యొక త్రిపుటిగా - శక్తిధారగా ఆవిర్భవిస్తుంది. గంగావతరణ తిథి, గంగా దశహరాగా, గాయత్రీ జయంతినాడే జరుపుకొంటారు.

* మళ్ళీ అటువంటి Crisis Point June 2, 1990 నాడు వచ్చింది. విశ్వ కుండలినీ జాగరణ పృష్ఠ భూమిలో భారతదేశ కుండలినీ జాగరణకు నాందిగా June 4, 5, 6, 1990 లో భారతదేశంలోని 6 నగరాలలో షట్చక్ర జాగరణకు ప్రతీకగా -

(ఇది కూడ సామూహిక సాధన అని గుర్తించండి. వ్యక్తి యొక్క Personal సాధనకు ఈ కాలంలో Possibility లేదు. అందుకొరకు వ్యక్తిగత స్థాయి పెంచుకొనుటకు సాధనలు చేయవద్దు.)

- 6 చోట్ల విరాట్ దీప యజ్ఞ ప్రక్రియ చేపట్టారు.

* ఆంధ్రప్రదేశ్‌లోని 'మహానంది' లో 7వ చోట అదే రోజులలో ఈ ప్రక్రియ జరిగినది.
* దీనికి అవసరమయ్యే శక్తి June 2వ తేదీ 1990 ఉదయం 8 గంటలకు ఒక బ్రహ్మాండమైన, మరి ఇంకెప్పుడు కనీ వినీ ఎరుగని స్థాయిలో జరిగిన విస్ఫోటన వల్ల లభించింది.

- ఇది కూడ గాయత్రీ జయంతి నాడే జరిగింది.
- ఉపాసన - సాధన - ఆరాధన., ప్రజ్ఞ - నిష్ఠ - శ్రద్ధ., రిద్ధి - సిద్ధి - వృద్ధి., ఓజస్సు- తేజస్సు- వర్చస్., స్థూల- సూక్ష్మ- కారణ., మహర్షి - బ్రహ్మర్షి - దేవర్షి మొ॥ అనేక త్రిపుటీ శక్తుల మూర్తిరూపం దాల్చిన పూజ్య గురుదేవుల సూక్ష్మ శరీరం "సమర్పణ" శక్తిగా రూపొంది, -

- దధీచి పరంపరను అనుసరించి ఒక విరాట్ విస్ఫోటన చెంది, (స్థూల శరీరం) 'సమర్పణ' ఖనిజ,

వృక్ష, జంతు, మానవ, దేవ సామూహిక చేతనత్వ మును నవయుగానికి అవసరమయ్యే మూడు నవీన శక్తిధారలను Idea (ఆలోచన) Ideal (ఆదర్శము), Idol (మూర్తి) అనే శక్తిధారలుగా రూపొందించింది. ఈ మూడు పదాలే "విచార క్రాంతి"కి ఆధార శిలలు.

✳ ఈ విధంగా గాయత్రీ శక్తి, భగీరథ శక్తి, శ్రీరామ శక్తిల త్రిపుటిని ఈ గాయత్రీ నవరాత్రుల్లో సమర్పణ ద్వారా సాధించాలి.

సమర్పణ విధానము గీతలోని ఈ క్రింది శ్లోకాలను వివరంగా చదువుకొని 9 రోజులలో ఆచరణలో పెట్టండి.

7/14, 8/14,22, 9/22, 11/54, 12/6,7, 14/24, 18/66 Most Important.

✳ అంతేగాక భ్రూమధ్యంలో అఖండజ్యోతి, Deep Breathing, ఉడ్డియాన బంధము, శక్తి చాలినీ ముద్ర, నేను పూజ్య గురుదేవుల Broadcasting Station గా మారుతున్నాననే నిరంతర స్మరణ.

మీరు తీసుకునే నిర్ణయాలు అమలాపురం శ్రీ శ్యామలరావు గారికి పంపుతారని ఆశిస్తూ,

మీ

శ్రీరామకృష్ణ

❀✳❀✳✪✳❀✳❀

1346/4, GURGOAN

6-45 ఎ.ఎమ్., 15.5.93

ప్రియమైన యుగసైనికులకు, యుగ శిల్పులకు,

మీకు సమర్పణ సాధన వివరాలు అందే వుంటాయి.

✳ పూజ్య గురుదేవులు "సామూహిక దీక్ష" (Group Initiation) త్రిపుటిలలో మొదటిది ఉపాసన, సాధన, ఆరాధన అయితే, ఆయన అవతార పరాకాష్టగా సాధించి మూర్తీభవింప చేసి విశ్వములోని అణువు, అణువులో జూన్ 2, 1990 నాడు ప్రవేశపెట్టిన సామూహిక దీక్షా త్రిపుటి నరమేధ, గోమేధ, అశ్వమేధము.

దీన్ని గుర్తించి ఈ నవరాత్రులలో పై 3 మేధా యజ్ఞాలను మానసిక, బౌద్ధిక, చిత్త అహంకార స్థాయిలో స్వయంగా అందుకుని దానిని భౌతిక కక్ష్యలో సమూహాలకి అందించాలి.

✳ 'సమర్పణ' ఈ 9 రోజుల్లోనే కాదు, నిరంతరం జరుగుతూనే ఉండాలి.

- కానీ నవరాత్రులు చాలా ప్రముఖ శక్తిధారల సంగమం కనుక ఈ 9 రోజులు సమర్పణా మనోభూమిని అలవర్చుకొనుటకు విశేష శ్రమ చేయండి.
- అందులో గాయత్రీ జయంతి నూతన యుగనిర్మాణ త్రివేణీ ధారల సంగమం - సంగమ తిథి కూడా.

✳ 'సమయం సరిపోదు' - అనకుండా మనకి సాధ్యమైనంతగా సమర్పణ చేసుకుందాం.

- సమర్పణతో పాటు గాయత్రీ అనుష్ఠాన నియమాలన్నీ జపసంఖ్యతో పాటు పూర్తిచేయాలి.
- ఉత్సాహంతో నవయుగ నిర్మాణ శిల్పులుగా 9 రోజులలో సంజీవనీ శక్తి పొందండి.
- మీకనుకూలమైన మార్పులు, చేర్పులు చేసుకోండి. ముఖ్యంగా సమర్పణ అలవాటు చేసుకోండి.

పూజ్య గురుదేవుల అవిరళ కృపావర్షంలో మీరు సంపూర్ణంగా తడిచిపోవాలని కోరుతూ,

మీ

శ్రీరామకృష్ణ



50, సుకృతవిల్లా
10.30 ఎ.ఎమ్., 10.7.1993

## ఆధ్యాత్మిక సాధనలో అభిరుచి కలిగిన వ్యక్తులందరికి కొన్ని ముఖ్య విషయాలు

యుగసంధి కాలము యొక్క ఈ చివరి $6\frac{1}{2}$ సంవత్సరాలలో పాటించవలసిన సూత్రాలను గురించి చర్చించాలని ఉన్నది.

- ✵ స్వాతంత్ర్యము లభించిన తర్వాత నేను జైలుకు వెళ్తాను అంటే ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో, ఈ $6\frac{1}{2}$ సంవత్సరాల తరవాత మేము నూతన యుగ నిర్మాణం కొరకు పాటుపడతాం అంటే అలాగే ఉంటుంది.
- ✵ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఆరోగ్యము బాగాలేదని, కుటుంబంలో ఎవరూ సహకరించడంలేదని, ఇతరులు ఎవ్వరూ ఆదర్శంగా జీవించటంలేదని ఈశ్వర ప్రదత్తమైన వాక్కులను A.K. 47 రైఫిల్‌లాగా వాడుతూ, టెర్రరిస్టులుగాని టెర్రరిస్టులుగా జీవిస్తూ, ఏదో గురువు శిష్యులమని చెప్పుకుంటూ, (ఆ గురువు మనల్ని శిష్యులుగా స్వీకరించారో లేదో చూడకుండా) Organisation పేరుతో "నేను చెప్పిందే నిజము", పాటించవలసిన సత్యములని ఆధ్యాత్మికత గురించి ఓనమాలు కూడా తెలియని వ్యక్తులు ప్రపంచోద్ధరణకు కంకణము కట్టుకున్న ఈ తరుణంలో,
- \- యుగం మార్చడమంటే స్వయంగా మారటానికి సాహసము కావాలని,
- \- పృథ్విపై స్వర్గావతరణ జరగాలంటే, ముందుగా వ్యక్తి స్వయంగా దేవతగా మారాలని,
- \- జ్యోతిని వెలిగించాలంటే, జ్యోతి యొక్క బొమ్మను పట్టుకొని ఊరేగటంకాదని - స్వయంగా జ్యోతివలె మారటం అని అర్థము చేసుకోలేని పరిస్థితులలో అన్ని ఆధ్యాత్మిక సంస్థలలోను నేతృత్వము, పేరు కావాలనే ఆకాంక్షలేని వ్యక్తులు కూడా, ఏమి చెయ్యాలో తోచక దిగ్భ్రాంతులు అవుతున్నారు.
- ✵ నేను వ్రాసే ఈ పంక్తులు ఆధ్యాత్మిక సంస్థలలో ఉన్న వ్యక్తులను ఉద్దేశించి వ్రాసినవి కావు.
- \- సాధనలో తీవ్రత తెచ్చుకొని, సమర్పణ యొక్క పరాకాష్టని అందుకొని,
- \- ఆ సమర్పిత వ్యక్తిత్వాన్ని "గురుసత్తా" చేతిలో ఒక మైనపుముద్ద వలె మార్చి,
- \- ప్రజ్ఞావతరణ కొరకు కావలసిన పరిస్థితులు నెల కొల్పుకొని, నిష్కళంక కల్కి అవతారము అందజేసే బాధ్యతలను, అన్ని పరిస్థితులలోనూ ఎంతో ఉత్కృష్టమైన త్యాగంతో చేయగల పౌరుషవంతులకు ఈ వాక్యాలు వ్రాస్తున్నాను.
- ✵ ఏ ఆధ్యాత్మిక సంస్థ యొక్క ఉద్దేశ్యమైనా - పూర్వ కాలపు ఋషి పరంపరకు పరాకాష్ఠగా, దధీచి నుండి ఈనాడు మన మధ్యనే జీవించియున్న శ్రీసత్యసాయి బాబా వరకూ - భూమిపై స్వర్గావతరణే ముఖ్యము.
- \- కానీ అందరూ ఇతరులను మార్చాలనే ప్రయత్నం చేస్తున్నారు తప్ప, తాను ఏ విధంగాను మారటానికి ప్రయత్నం చేయటం లేదు.
- ✵ నేటి వైజ్ఞానికతను ఋషి పరంపరతో కలిపి ఒక వైజ్ఞానిక ఆధ్యాత్మికతను తీసికొని రావటానికి,
- \- స్థూల జగత్తులో సిక్ గురువులు, మహమ్మద్, 1857 తిరుగుబాటు వీరులు ప్రయత్నిస్తే,

- సూక్ష్మజగత్తులో - సూఫీ మతస్థులు క్రైస్తు, మీరా, చైతన్య మహాప్రభు, తులసీదాసు, త్యాగరాజు, పోతన, సెయింట్ పాల్ మొదలైనవారు ప్రయత్నిస్తే,
- మానసిక జగత్తులో రావలసిన మార్పులు కొరకు కబీరు, లాహిరి మహాశయులు, ముక్తానంద, రామ చంద్రజీ (షాజహాన్‌పూర్) శ్రీరామకృష్ణ పరమహంస ప్రయత్నిస్తే,
- అతి మానస చేతనత్వ స్థాయిలో Ayn Rand, Harold Sherman, Florence Shinn, Jane Roberts, యోగి అరవిందులు, పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య, సాయిపథము తమ తమ వంతు (అంశాలను) అందిస్తున్నారు.

✷ స్థూల జగత్తు నుంచి ప్రాణమయ కోశము, అక్కడ నుండి మనోమయ కోశము, తద్వారా అతి మానస చేతనత్వమును తెలిపే ప్రజ్ఞా స్థాయిని అందుకొను టకు, పైన చెప్పిన మహానుభావులేగాక, ఇంకా అనేక మంది రూపొందించిన సూత్రాలను ప్రాణవంతము చేయుటకు,

హిమాలయములను కేంద్రముగా పెట్టుకొని 20,000 సం॥ కంటె ఎక్కువ వయస్సున్న యోగులతో ఏర్పడిన ఋషుల కూటమి, 'సవితా' ద్వారా, సప్తర్షిమండలం, ధృవమండలం, సిరీస్ నక్షత్రం శక్తి ప్రవాహాలను సాధకులకు అందజేస్తుంది.

❂ వీరందరి సహాయము వద్దని, అసలు నేను నమ్మిన స్థూల రూపధారి గురువుకి తప్ప, మిగతా ఎవరికీ సత్యానుభూతి లేదని నమ్మేవారికి ఏం చెప్పగలము?

- సాధారణ వైజ్ఞానికతయే రోజు రోజుకు తన రూపాన్ని మార్చుకొంటున్నప్పుడు నిత్య, శాశ్వత, సనాతన, నూతనమైన చేతనత్వము పరిణామ క్రమములో ఎంత తీవ్రమైన మార్పులను, ఎంత త్వరితగతిలో చెందుతుందో మనం ఊహించుకోవచ్చును.

నూతన యుగపు వైజ్ఞానిక ఆధ్యాత్మికతను నేర్చు కొనుటకు ముందు మూడు తీవ్రమైన భావసంవేదనల్ని మనము ఏర్పరచుకోవాలి.

① నా ఆర్థిక వనరులకు, కుటుంబానికి నేను ట్రస్టీని మాత్రమే.

- ఉన్న ఆర్థిక వనరులను సత్‌ప్రవృత్తుల వికాసము కొరకు ఇతరుల మీద ఏవిధమైన అథారిటి చెలాయిం చకుండా, మృదుభాషణతో, నిరంతర ప్రేరణతో, సాధించాలి.

② మనము భగవంతుని ఉనికిని విశ్వసిస్తాము గనుక ఈ ఉత్తరము అందిన క్షణము నుంచి ఆ భగవంతుని ముఖాముఖి చూడటానికి ఎంత తీవ్ర ప్రయత్నము చేయగలమో కాగితము, పెన్ను తీసుకుని ఒక ప్రణాళికా బద్ధముగా మనము "All Out" ప్రయత్న స్థాయిలో కృషి సలపాలి.

- మీ ప్రయత్నానికి ఈ 6 సంవత్సరాల కాలములో అనేక పురాతన, నూతన ఋషుల ఆశీర్వాద శక్తి పని చేస్తుంది.
- ఈ కార్యక్రమములో ప్రాణయామ, జప, ధ్యాన, వ్యాయామానికి అవసరమైన టైమ్ కల్పించుకోండి.
- ఒక్కొక్క రోజు గడుస్తూంటే, ఇవాళ కూడా భగవత్ సాక్షాత్కారం పొందలేకపోయామే అనే తీవ్ర వ్యాకు లత చెందండి.

③ భారతదేశాన్ని ఒక మట్టిగడ్డలాగా గాక,
ఋషులు దర్శించిన భారతమాతగా దర్శించి,
తిరిగి భారతమాతను జగద్గురు పీఠానికి అధిష్ఠాత్రిగా
చేయటానికి కావలసిన స్వాధ్యాయము,

- రామకృష్ణ పరమహంస చరిత్రలో,
- వివేకానందుని రచనలలో,
- యోగి అరవిందుల సాధనాక్రమములో,
- C.V.V., Blavatsky సంకల్ప బలములో,
- లాహిరి మహాశయ - పరమహంస యోగానంద క్రియాయోగములో,
- సాయితత్వ భావనలో,
- పూర్వకాలపు ఋషుల పరంపరలో చేతనత్వమును తిన్నగా తాకే సంస్కార పద్ధతిలో,
- Jesus Christ యొక్క Crucifixation లో,

- మహమ్మద్ యొక్క Brotherhood లో,
- జొరష్టర్ చెప్పిన అగ్నిపూజలో,
- Ayn Rand యొక్క Golden Path లో,
- Florence Shinn యొక్క Affirmations లో,
- E.K. గారి జ్వాలాకూల్ ప్రేరణలో,
- పూజ్య గురుదేవులు అందించిన ప్రజ్ఞాయుగ లక్షణాల్లో ఆ భారతమాత మాతృత్వ స్వరూపాన్ని దర్శించాలి.

దీనికి నిరంతర, అవిరామ స్వాధ్యాయము, భారతదేశ ఔన్నత్యము గుర్తుంచుకొనుట అవసరము.

శ్రీ ఈ మూడు లక్షణాలు పెంపొందించుకొనటానికి అవిశ్రాంత ప్రయత్నము చేస్తున్నవారు ఈ క్రింది సాధనలను ప్రాణాలయినా ఇచ్చి వేయగల స్థాయిలో ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించండి.

- ఈ ప్రయత్నం ఒక మానసిక పొంగులాగ కాక, నిత్య జీవితములో దిగటానికి డైరీ వ్రాయటం అలవాటు చేసుకోండి.

## చెయ్యవలసిన ప్రయత్నాలు

## నాలుగు సంయమాలు

① సమయ సంయమనము : కనీసం 8 గంటలు సాధన, స్వాధ్యాయ కార్యక్రమాలకు వినియోగించాలి.

② ఇంద్రియ సంయమనము : రసేంద్రియము, జననేంద్రియము పూర్తి నియంత్రణలో వుండాలి.

③ వాక్ సంయమనము : సాధ్యమైనంత వరకు మౌనము. అవసర మొచ్చినపుడే మాట్లాడుట - ఇది కూడ ప్రేరణ ఇవ్వటానికి, ఉత్సాహం ఇవ్వటానికి ప్రయత్నించాలి.

④ అర్థ సంయమనము : ఈనాడు మనకు వ్యక్తిగతముగా వున్న ఖర్చులను బేరీజు వేసుకొని, దానిని 50% తగ్గించుకొనుట.

వీలయితే సణగకుండా, బలవంతము చేయకుండా కుటుంబములోని ఇతర సభ్యులకు కూడా ప్రేరణ ఇచ్చుట.

## నాలుగు నియమాలు

నిత్య జీవితములో క్రింద చెప్పబోతున్న నాలుగు నియమములను Guiding Light గా ఉపయోగించుకోండి.

① ఇంగిత జ్ఞానము (Commonsense) సమర్థుడవలె

భౌతిక జగత్తులో శ్రమకు తగిన ఫలితమే లభించినపుడు, ఆధ్యాత్మిక జగత్తులో ఈ నియమాన్ని పూర్తిగా మరిచిపోయి కేవలం Lip Service ద్వారా చేసే జపం వల్ల అనంతమైన లాభాలు కలుగుతాయనే మూర్ఖత్వాన్ని వదలండి.

- సాధన చెయ్యండి. తదనుసారం సిద్ధిని పొందండి.
- రూ. 1-00, 1-25 విలువ చేసే గోదానాలు చేయకండి.

② ధైర్యము (Courage) బలోదుల

పైన చెప్పిన 3 సూత్రాలు, 4 సంయమాలు పాటించటానికి అవసరమైన ధైర్య సాహసాలను ప్రదర్శించండి. ఎందువల్లంటే, సమాజము, కుటుంబము మీలో వచ్చిన మార్పును చులకనచేసి మాట్లాడినపుడు దానికి తట్టుకొని, సాధనా మార్గములో నిలబడుటకు, వ్యంగ్యోక్తులను సహించటానికి చాలా ధైర్యం కావాలి.

③ బాధ్యత (Responsibility) జిమ్మేదార

పైన చెప్పిన కార్యక్రమాలు చేస్తున్నపుడు వచ్చే చిరాకు కలిగించే పనులకుకాని, ఆనందపరచే సంఘటనలకుకాని, పూర్తిగా వ్యక్తిగతమైన బాధ్యత స్వీకరించాలి.

④ త్రికరణ శుద్ధి (Sincerity) ఇమాన్‌దార

అన్ని కార్యక్రమాలను ఎంత తీవ్రముగా పాటించామో మనకి మనమే Sincere గా ఎంచుకోవాలి.

నిత్యజీవితములో పై 4 నియమాలు పాటించుకుంటూ, ఉపాసన, సాధన, ఆరాధన నిర్వర్తిస్తూ, 18 యుగనిర్మాణ సత్సంకల్పాలను అక్షరాలా పాటించటానికి ప్రయత్నించండి. పైన చెప్పిన 3 లక్ష్యాలు, 4 సంయమములు, 4 మార్గదర్శక సూత్రాలు, 3 సాధనా పద్ధతులు, 18 సత్సంకల్పాలు ఏ దేవతా ఆరాధకుడైనా, ఏ గురువు శిష్యుడైనా,

ఏ సంస్థ మెంబరయినా తమ దేవతకు కానీ, గురువుకు కానీ, సంస్థకు కానీ ద్రోహము చేయకుండా పాటించవచ్చు.

- మీరు మారండి - మీ కుటుంబాన్ని మార్చండి - మీ స్నేహితులను మార్చండి - సమాజము మారుతుంది.
- అంతే తప్ప మీరు మారకుండా ఒక సంస్థలో మెంబర్ షిప్ ఉండటం వల్ల ఇతరుల కంటే మీరు చాలా గొప్ప స్థాయిలో ఉన్నాము అనే అహంకారాన్ని వదిలి వేయండి.

దీన్ని గురించి నన్ను కలవడం గానీ, ఏ విధమైన ఉత్తరాలు కానీ వ్రాయకండి. నేను యింక ఎవరినీ కలవను. ఎవరికీ ఏ విధమైన సలహాలు యివ్వదలచు కోలేదు.

నేను మీ అందరికీ తెలియజేసే చివరి మాటగా ఈ ఉత్తరంలోని విషయాలు మీ ఆధ్యాత్మిక ప్రగతికి తోడ్పడితే ఉపయోగించుకోండి. లేకపోతే చింపి పారవేయ కుండా ఇతరులకు ఎవరికైనా అందచేయండి.

మీ
శ్రీరామకృష్ణ

✻☆✻☆✻☆✻☆✻



ప్లాట్ నం. 50,
వేణుగోపాల్ నగర్,
ఎన్.జి.జి.వో. కాలనీ,
గుంటూరు - 4
30-7-93

## ఒంగోలులో అక్టోబర్ 22, 23, 24, 1993 లో పరాప్రకృతి పరిమార్జన కొరకు జరిగే త్రి దివసీయ సహస్రకుండీ గాయత్రీ మహాయజ్ఞం సందర్భంగా అనుష్ఠింపబడుచున్న గాయత్రీ మహాపురశ్చరణకు (24 కోట్ల మంత్రజపము) ఆహ్వానము

వేదముల ప్రవృత్తి యజ్ఞ కర్మముల కొరకే.

యజ్ఞో వేదేషు ప్రతిష్ఠితః
(గోపథ బ్రాహ్మణము 1-1-38)

యజ్ఞము మూడు లక్ష్యాలతో చేయాలి.

① దేవ పూజనము - అంటే దైవీ సద్గుణాల అనుసరణ.
② సంగతీకరణము - అనగా సంఘీ భావము.
③ దానము - అనగా ఉదార సహృదయత.

✻ భౌతిక ప్రగతికి ఆధారమైన శిక్షణ (training), శ్రమ (Regular dedicated Practice),
ఆధ్యాత్మిక జగత్తులో యోగము, తపస్సుగా పరిణితి చెందుతాయి.

యజ్ఞాగ్ని తెలిపే అనేక ఆదర్శాలలో,

① ఎల్లప్పుడూ వేడిగా (స్ఫూర్తి, ఉత్సాహము), సక్రియ ముగా వుండుట.
② జ్యోతిర్మయముగా ఉండుట, అనగా అనుకరణీయ మైన ఉదాహరణగా ఉండుట. ఆదర్శము.
③ తన సంపర్కంలోకి వచ్చిన వారిని తనవలె తయారు చేయుట.
④ పొందిన సామాగ్రిని సమాజమంతటికి పంచిపెట్టుట.
⑤ నిరంతరం అగ్ని శిఖలు ఎత్తుగా ఉంటాయి. అంటే ఆలోచనా సరళి, స్వాభిమానము క్రిందకు పడకుండా వుంచుట. (అశ్వమేధము పేజి 8,9)

- ❋ పైన చెప్పిన 5 ఆదర్శాలను, యోగమును, తపస్సును ఉపయోగించి, యజ్ఞము యొక్క మూడు లక్ష్యాలను (పరిష్కృత వ్యక్తిత్వము, సంగతీకరణము, దానము) సాధించుటే మన ఉపలబ్ధి.
- ❋ దీని కొరకు సిద్ధించిన మంత్రము, నిర్ధారించబడిన హవన సామాగ్రి ఉపయోగించబడతాయి.
- ❋ "పౌర్ణిమాస్యేష్టి" యజ్ఞము ద్వారా సూర్య (కుడి నాశిక) చంద్ర (ఎడమ నాశిక) నాడుల రహస్యాన్ని తెలుసు కొని, ప్రాణ విద్యలో ప్రతిష్ఠాపితుడై, పశుబంధ యజ్ఞము చేయాలి.
- అనగా పంచకోశ సాధన + ఆత్మబోధ ద్వారా ఐదు ఇంద్రియములు + ఆరవది మనస్సు అనే పశు బంధము చేయాలి.
- ❋ ఆ తరవాత శరీరములో వున్న ఇంద్రియాధిష్ఠాన దేవతలకు, శరీరములోని వీర్యము యొక్క సూక్ష్మ రూపమును శీర్ష స్థానమునకు తీసుకువెళ్ళి సోమ పానము చేయించుటయే <u>వాజపేయ యజ్ఞము.</u>
- ఈ విధముగా తిరిగి తిరిగి యజ్ఞం చేయుట వలన (శతక్రతు) ఇంద్ర పదవి లభిస్తుంది.
- ❋ ఈ విధముగా రాజసూయ యజ్ఞము (పే.1, అశ్వ మేధము) ద్వారా తనపై సామ్రాజ్యము స్థాపించుకున్న సాధకుడు ఆత్మరూపమైన ( విశ్వరూపమైన ) "సామ్రాజ్యం" స్థాపించటానికి త్రిదివసీయ సహస్ర కుండీ మహాయజ్ఞము చేస్తాడు.

త్రి రాత్రం యజ్ఞక్రతుం యజతే

- శతపధ బ్రాహ్మణము 13/4/1/2

అందువల్ల శతక్రతు స్థాయి నుండి మూడు రోజుల సహస్ర క్రతువు చేయవలసి వుంటుంది. (సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్)

విశ్వరూపం హరిణం జాత వేదసం
పరాయణం జ్యోతిరేకం తపంతం।
సహస్ర రశ్మిః శతధా వర్తమానః
ప్రాణః ప్రజానా ముదయత్యేష సూర్యః॥

అనగా "సహస్ర రశ్మి" అయిన "శతథా" ఈ ప్రపంచాన్ని పాలించే ప్రాణ స్వరూపుడైన సూర్యుడు ఒక్కడే (అశ్వమేధం, పే. 68 ).

- ❋ అందువల్ల ప్రాణశక్తిని పూర్తిగా ఉపయోగించుకొనే విధి విధానము గాయత్రి మంత్రం మీద ఆధారపడి వుంటుంది.
- ఒంగోలులో 1993 అక్టోబర్ 22, 23, 24 తారీఖులలో జరుగబోయే త్రి దివసీయ సహస్ర కుండీయ గాయత్రీ మహాయజ్ఞమునకు కావలసిన సవితాశక్తి (ప్రాణశక్తి) కొరకు 24 కోట్ల గాయత్రీ మంత్ర జప సంపత్తి కావాలి.
- ❋ దీనిని ప్రక్కన ఉన్న పట్టికలో వివరించబడిన విధంగా సాధించవచ్చును.

లక్ష్యము : 24,00,00,000 గాయత్రి మంత్ర జపము

కాలము : 50 రోజులు లేక అంతకంటె తక్కువ.

ప్రక్కన ఉన్న పట్టికలో తెలియజేసిన విధముగా 4 గ్రామాలలో 25,00,000 జపము జరిగితే 1 కోటి అవుతుంది. అలాగే 96 గ్రామాలలో జరిగితే 24 కోట్ల జపము సులభముగా ఈ క్రింది విధముగా సాధించవచ్చును.

| | | |
|---|---|---|
| | 2-8-93 నుండి 20-9-93 వరకు | (50 రోజులు) |
| లేక | 7-8-93 నుండి 25-9-93 వరకు | " |
| లేక | 14-8-93 నుండి 2-10-93 వరకు | " |
| లేక | 22-8-93 నుండి 10-10-93 వరకు | " |
| లేక | 27-8-93 నుండి 15-10-93 వరకు | " |

<u>16-10-93 నుండి 24-10-93 వరకు నవరాత్రులు</u>

| జప సంఖ్య (రోజుకు) | రోజులు | సాధకుల సంఖ్య | మొత్తము జప సంఖ్య (లక్ష్యము 25,00,000) |
|---|---|---|---|
| | దధీచి వర్గము (నిత్యము 3000 జపము చేసేవారు) | | |
| 3,000 (30 మాలలు) | 50 | 17 | 25,50,000 (లక్ష్యము కంటే 50,000 ఎక్కువ) |
| 3,000 (30 మాలలు) | 24 | 35 | 25,20,000 (లక్ష్యము కంటే 20,000 ఎక్కువ) |
| | వశిష్ఠ వర్గము (నిత్యము 1500 జపము చేసేవారు) | | |
| 1,500 (15 మాలలు) | 50 | 34 | 25,50,000 |
| 1,500 (15 మాలలు) | 24 | 70 | 25,20,000 |
| | విశ్వామిత్ర వర్గము (నిత్యము 500 జపము చేసేవారు) | | |
| 500 (5 మాలలు) | 50 | 100 | 25,50,000 |
| 500 (5 మాలలు) | 25 | 200 | 25,20,000 |

పై సంఖ్యను అనేక మార్పులు, చేర్పులతో 25,00,000 లక్ష్యాన్ని పొందవచ్చును. ఉదాహరణకు,

| జప సంఖ్య (రోజుకు) | రోజులు | సాధకుల సంఖ్య | మొత్తము జప సంఖ్య |
|---|---|---|---|
| 3,000 (దధీచి) | 50 | 5 | 7,50,000 |
| 1,500 (వశిష్ఠ) | 50 | 10 | 7,50,000 |
| 500 (విశ్వామిత్ర) | 50 | 40 | 10,00,000 |
| | | 50 రోజుల మొత్తము జపసంఖ్య | 25,00,000 |

పై సాధకులు తమ సాధన పూర్ణాహుతిగా సహస్ర కుండి యజ్ఞంలో పాలుపంచుకుంటారు. 50 రోజుల సాధన Maximum. కాని కొంతమంది సాధకులు అంత కంటే తక్కువ సమయములో జప సంఖ్య పూర్తిచేసి, జపము ఆపివేయవచ్చు. (పై పట్టిక ప్రకారము) వారు కూడా త్రి దివసీయ సహస్ర కుండి మహాయజ్ఞములో పాలుపంచుకోవచ్చు.

ఎవరెవరు ఏ ఏ గ్రామాలలో ఏ విధముగా 25 లక్షల గాయత్రి జప లక్ష్యము సాధించదలచుకున్నారో తెలియచేయండి. 3000 జపం చేసేవారు ఎంతమంది, ఎన్ని రోజులు, వారు సాధించిన మొత్తం జపం + 1500 నిత్య జపం ఎంతమంది ఎన్ని రోజులు, వారు సాధించిన మొత్తం జపం + 500 నిత్య జపం ఎంత మంది ఎన్ని రోజులు, వారు సాధించిన మొత్తం జపం ఈ విధముగా ధధీచి వర్గం జప సంఖ్య + వశిష్ఠ వర్గం జప సంఖ్య + విశ్వామిత్ర వర్గం జప సంఖ్యవల్ల ఆ గ్రామానికి 25,00,000 మంత్ర జపం పూర్తికావాలి.

రోజుల సంఖ్య 50 రోజుల కంటె ఎంతైనా తగ్గించుకోవచ్చు. వీలయితే నగరాలలో విభిన్న సమూహాలుగా పేటలవారీగా ఒక్కొక్క సమూహము 25,00,000 జప లక్ష్యాన్ని సాధించవచ్చు. ఈ వివరాలన్నీ నాకు త్వరలో తెలుపుతారని ఆశిస్తూ,

మీ

శ్రీరామకృష్ణ

❊❊❊❊✤❊❊❊❊



సుకృతవిల్లా,
50, వేణుగోపాలనగర్,
గుంటూరు - 4
3.15 పి.ఎమ్., 10.9.93

## పరాప్రకృతి పరిమార్జన, సౌరశక్తి సందోహన, విశ్వకుండలిని ఆలోకన కొరకు

## అశ్వమేధిక ప్రయాజ సందర్భముగా భావనాశీలురకు విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్‌లో అశ్వమేధ మహా యజ్ఞము త్వరలో జరపబడాలని కోరుకుంటున్నాము.

❋ యజ్ఞంలోని కర్మకాండ సాధకుని ఆంతరిక స్థితిని తెలుపుతుంది.

❋ అశ్వమేధ యజ్ఞ స్థితిలో ఉన్న సాధకుడు తన ప్రాణ రూపి అశ్వాన్ని శరీరములోని సమస్త నాడుల లోనికి ధ్యాన విజయము కొరకు పంపుతాడు.

- శరీరరూపి రాష్ట్రములోని నాడులే ప్రాణరూపి అశ్వము యొక్క విచార క్షేత్రము.
- ఎక్కడైనా వికారము వుంటే, ప్రాణరూపి అశ్వ మార్గము అధిరోహింపబడుతుంది. అదే విధంగా రాష్ట్రములో ఎక్కడైనా వికారరూపి శత్రువు వుంటే అతడు ప్రాణరూపి అశ్వాన్ని కట్టేస్తాడు.
- ఇటువంటి పరిస్థితులలో అవరోధాన్ని నివారించుటకు అశ్వమేధకర్త చేసే ప్రయత్నాలే యుద్ధాలు.

ఈ యుద్ధాలు వాస్తవిక భౌతిక జగత్తులోని యుద్ధాలు కావు.

తనలో "స్వరాజ్యము" స్థాపించుకున్న తర్వాత విశ్వ సామ్రాజ్య స్థాపనకు ఆధారాలు యుద్ధానంతరం శత్రుత్వం సమసిపోయి, గెలవబడ్డవారు కూడా బంధువులవలె అశ్వమేధ యజ్ఞంలో పాలుపంచుకొనుట మహాభారతంలో వర్ణింపబడిన వివరణలో చూస్తాము.

Blue Print లేకుండా భవనాన్ని ఎలా నిర్మించ లేమో, ఆధ్యాత్మిక పృష్ఠభూమి లేకుండా ఏ యజ్ఞాన్నీ నిర్వహించలేము.

❋ "అశ్వము" గతిశీలత, శౌర్య పరాక్రమాల చిహ్నం.

- "మేధా" అనే పదము మేధాశక్తి, శ్రేష్ఠ బుద్ధికి ప్రతీక.
- అందువల్ల అశ్వమేధము యొక్క సహజ అర్థము "శౌర్య పరాక్రమాల, కళ్యాణకరమైన మేధా శక్తుల సంయోగ సంగమము".
- <u>అశ్వము</u> క్షాత్ర శక్తికి, <u>మేధా</u> బ్రహ్మతేజస్సుకు ప్రతీక అయినపుడు వీటి సంయోగము ఒక పవిత్ర మహత్తర మైన యజ్ఞకర్మగా మారటంలో ఆశ్చర్యమేముంది?

❋ సృష్టిలో ఏ కార్యమైన రూపుదాల్చాలంటే, దానియొక్క అతి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక మనసులో ఉండాలి.

- అవసరమైన కార్యం కొరకు ఏర్పరచుకునే, ఆలోచనా జగత్తులోని నిర్మాణ శక్తిధారలనే <u>"పరా జగత్తు"</u> అంటాము.

❋ ఈనాటి ఆలోచనా జగత్తు ఎంత భీతావహముగా ఉన్నదో అందరికి తెలుసు. ఒక పని సాధించటానికి <u>కూడని మార్గములే</u> ఎన్నుకొనబడుతున్నాయి.

- అందువల్ల దైవీ వాతావరణము ఏర్పడటానికి పరా ప్రకృతిని శోధించవలసి వుంటుంది.

ఈ విధానాన్నే <u>"పరాప్రకృతి పరిమార్జన"</u> అంటాము.

పరాప్రకృతి పరిమార్జన కొరకు గాయత్రి సాధన చేసే వ్యక్తుల సహకారము జాతి, మత, కుల, లింగ భేదము లేకుండా ఆహ్వానించబడుతుంది.

- విలక్షణమైన, అద్భుతమైన గాయత్రీ మంత్రము నేటి పరిస్థితులను మార్చి, తిరిగి దైవీయ వాతావరణము స్థాపించగలదు.
- పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య సూక్ష్మప్రేరణ, వందనీయ మాతా భగవతీ శర్మ, సప్త సరోవర్, హరిద్వార్ వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో యుగాన్ని పరివర్తన చేసే బృహత్ ప్రణాళికలు రూపు దాల్చుకుంటున్నాయి.
  - అందులో భాగంగా నిత్యము 30 మాలలు జపము చేసే వారిని ధధీచి వర్గముగా,
    15 మాలలు జపము చేసే వారిని వశిష్ఠ వర్గముగా,
    5 మాలలు జపము చేసే వారిని విశ్వామిత్ర వర్గముగా విభజించటమైనది.
  - ఈ సాధన 50 రోజులు చేయాలి.
- నేటి ఊర్జా సమస్య (energy crisis) నివారణకు సౌరశక్తిని ఉపయోగించుటయే ఏకైక సమాధానము.
  - దీని కొరకు 50 వేల మంది ఒక మాల జపము సౌరశక్తి ఆకర్షణ పురశ్చరణగా 50 రోజులు చేయాలి. వీరిని జమదగ్ని వర్గం అంటారు.

ఏ వర్గం వారయినా, ఏ రోజు నుంచి అయినా తమ సాధన మొదలు పెట్టి 50 రోజులు ఈ సాధన చేయాలి.

ఉజ్జ్వల భవిష్యత్తు కొరకు, నేటి అవాంఛనీయతను రూపుమాపటానికి, ఆధ్యాత్మికత యొక్క వైజ్ఞానికతను గుర్తించే వారందరు ఈ జపయజ్ఞ కార్యక్రమములో పాలు పంచుకుంటారని ఆశిస్తున్నాము.

- యజ్ఞాలలో దేవదక్షిణా కార్యక్రమము ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఇంటింటా యుగ యజ్ఞాలు నిర్వహించాలి. ఇంటిలో ఉన్న ప్రతి సభ్యునితో తనకు ఉన్న ఒక దురలవాటు మానివేసి, ఒక సత్ప్రవృత్తిని పెంచుకుంటాను అనే దీక్ష తీసుకోమనాలి.

ఈ దేవ దక్షిణా సంకల్ప పత్రాలు గాయత్రీ యజ్ఞంలో పూర్ణాహుతిగా సమర్పించబడతాయి.

- ప్రతీ వారు యుగయజ్ఞ పద్ధతి నేర్చుకుని (దీనికి సుమారు 30 నిమిషముల సమయము, 3 రూపాయల ఖర్చు వుంటుంది) కనీసము 108 ఇళ్ళలో నిర్వహిస్తాము అనే సంకల్పము చేసే వారిని యాజ్ఞవల్క్య వర్గముగా గుర్తిస్తాము.

యుగ యజ్ఞము చేసిన ఇంటిలో వీలున్నంత వరకు ఈ క్రింది మూడు నియమములు పాటిస్తాము అని ఆ కుటుంబములోని వారు నియమము తీసుకొనగలిగితే బావుంటుంది.

1. నియమిత ఉపాసన, 2. నిరంతర స్వాధ్యాయము, 3. బలివైశ్య దైవము. ఈ మూడు కార్యములు ఆ ఇంట్లో దేవస్థాపనకు కారణమవుతాయి.

Note: అశ్వమేధిక మహాయజ్ఞ ప్రయాజ సందర్భముగా పరాప్రకృతి పరిమార్జనకు త్రిదివసీయ సహస్ర కుండీ గాయత్రీ మహాయజ్ఞము ఒంగోలు P.V.R. హైస్కూలు ఆవరణలో, 1993 అక్టోబరు 22, 23, 24 తేదీలలో (దుర్గాష్టమి, నవమి, విజయదశమి) జరుగనున్నది.

అందరూ సాదరముగా ఆహ్వానితులే.

మీ
శ్రీరామకృష్ణ

ఎవరెవరు పై కార్యక్రమములు తలపెట్టారో ఈ క్రింది చిరునామాలకు తెలుప ప్రార్థన.

| | |
|---|---|
| యమ్. లక్ష్మీనారాయణ, | ముక్కామల రత్నాకర్, |
| 10-7-4, | 6-4-104, |
| లాయర్‌పేట, | అరండల్‌పేట, |
| ఒంగోలు - 523 002. | గుంటూరు - 522 002. |



గుంటూరు
7.45 ఎ.ఎమ్., 26-11-93

ఆత్మీయులకు,

1993 సం॥లో 25-12-93 (Christamus) కు చాలా ప్రాముఖ్యత ఉంది.

❀ ఆధ్యాత్మికత వేరు, ఆధ్యాత్మిక సంస్థలు వేరు అనే విషయం ఆ రోజు నాటికి మనం పూర్తిగా అర్థం చేసుకొని తీరాలి.

అందువల్ల మీ అందరికి ఈ విషయాలు గురించి పూర్తి అవగాహన ఉన్నా, మళ్ళీ ఒకసారి మననం చేసుకొని, మన ప్రయత్నాలు అనవసర దిశలో ప్రవహించకుండా నిరోధించగలుగుతారు అని ఆశిస్తున్నాను.

❀ ఏదైనా ఒక మార్గంగుండా మనం ప్రయాణించదలచు కొన్నప్పుడు "లక్ష్యం" (aim or goal) స్పష్టంగా మనం తెలుసుకొని, దానిని చేరే వరకు నిరంతరం స్మరణలో ఉంచుకొనకపోతే సహజంగా పదభ్రష్టులు అవుతాము.

భగవద్గీతలో ఏ లక్ష్యాన్ని చేరుకోటానికైనా అవసర మయ్యే ఈ లక్షణాలనే అనేక శ్లోకాలలో తెలిపాడు.

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్

(భ.గీ. 9-22)

ఏకాగ్ర చిత్తంతో నిరంతరం నన్నే స్మరిస్తూ సేవించే వాళ్ళ యోగక్షేమాలు నేనే చూస్తాను.

పై శ్లోకములో జగద్గురువైన శ్రీకృష్ణుడు, లక్ష్యాన్ని నిరంతరము గుర్తుంచుకున్నవాళ్ళ భౌతిక, ఆధ్యాత్మిక వనరులు సాధకునికి అందించే మార్గము తానే స్వయముగా చూస్తాను అని ప్రతిజ్ఞ చేస్తున్నాడు.

మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సఙ్గవర్జితః
నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాణ్డవ.

(భ.గీ. 11-55)

అర్జునా ! నా కోసమే కర్మలు చేస్తూ, నన్నే పరమగతిగా భావించి, నామీదే రక్తి కలిగి, దేనిమీద ఆసక్తి లేకుండా సమస్త ప్రాణులపట్ల శత్రుభావం లేనివాడు నన్ను పొందుతాడు.

❀ సాధకుడు లక్ష్యమును గుర్తుంచుకుంటూ, రెండు మానసిక ప్రవృత్తులను అభివృద్ధి చేసుకొమ్మని పైన చెప్తున్నాడు. ఒకటి,

సంగవర్జితః - అంటే ఏ వ్యక్తిగతమైనటువంటి, సంస్థకాని, దేశము కాని, జాతి కాని, సాధనా విధానము మీద కాని ఆసక్తి లేకుండా, రాగము పెంచుకొనకుండా, అభిమానము పెంచుకొనకుండా "వాటిని లక్ష్య సాధన కొరకే ఉపయోగించుకోవాలి".

రెండవ మానసిక ప్రవృత్తి,

నిర్వైరస్సర్వభూతేషు - అనగా సమస్త భూతముల యందు అంటే మానవమాత్రులే కాక ఖనిజ, వృక్ష, జంతువుల యందు కూడా శత్రుభావం ఉండకూడదు. శత్రుభావ మనే పదములో, శత్రుత్వం పైకి చూపించకపోయినా లోపల అంతర్గతముగా ఉండవచ్చును. కనుక ఆ భావన కూడా లేశ మాత్రము కూడా ఉంచుకోకూడదు.

❀ భగవద్గీత 12 వ అధ్యాయములో చెప్పబడిన 20 శ్లోకాల్లో ఆధ్యాత్మిక లక్ష్యము గల సాధకుడు కచ్చితంగా అలవర్చుకొనవలసిన మానసిక ప్రవృత్తులు తెలుప బడినవి.

ఇక్కడ మన లక్ష్యము స్పష్టంగా గుర్తుంచుకోవాలి. అది మీ అందరికి తెలిసినదే అయినా తిరిగి మళ్ళీ దాన్ని గుర్తు తెచ్చుకోవటం మంచిది.

❀ ప్రతి సాధకుడు ఇతరుల (తనకు అతి దగ్గరగా ఉండే కుటుంబ సభ్యులతో సహా) దోషాలను గుర్తించటము

మానివేసి, తనకు తాను మనోవాక్కాయ కర్మేణా తనలో యున్న దైవీ ప్రేరణలను గుర్తించగలగాలి.

- ఎదుటివాడు గుర్తించలేకపోయాడు, అతనికి చేత కావటము లేదు, అతను తప్పు మార్గంలో వెళ్తున్నాడు అనే ఆలోచన కూడా రానీయవద్దు.

- ఈశ్వరీయ ప్రేరణను ఆచరించటానికి మనకు ఉన్న ఐదు పరికరములు - అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలు.
- ప్రతి కోశమును పరిపూర్ణమైన Working Order లో పెట్టుకొనుటయే సాధన లక్ష్యము.
- కూటస్థముగ - ఆ దివ్య చేతన అనాదిగా మనలో సక్రియముగానే యున్నది. ఉపకరణములు కావలసినంత శక్తిని కలిగియుండటమే మన లక్ష్యము.
- ప్రపంచములోకి వచ్చిన ప్రతి ఆధ్యాత్మిక గురువు ఈ లక్ష్యమును సాధించటానికి అవసరమైన ప్రేరణ మాత్రమే ఇచ్చారు.

అందువల్ల ఈ పంచకోశ సాధనా విధానములో (మళ్ళీ మీరు ఈ పేరుకి మాత్రమే అనురాగము అభివృద్ధి చేసుకొనకండి.) తీవ్ర కృషి సలుపదలచినవారు, జగద్గురు వాక్కును గుర్తుంచుకొని,

తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్యచ

సర్వకాలములలో అనగా భూత (Past), వర్తమాన (Present) భవిష్య (Future) కాలాలలో యున్న, ఉండబోయే మానసిక ప్రవృత్తులను గుర్తించి, వాటిని గీతలోని 12వ అధ్యాయములో చెప్పిన ప్రవృత్తులుగా మార్చగలగాలి.

దీని కొరకు ఒక ఆసనము కాని, ఒక ఉపాసనా దేవత కాని, ఒక నిర్దిష్టమైన క్రియామార్గముకాని లేదు.

- వ్యక్తిగత, కుటుంబ, సామాజిక స్థితులలో ఏ చిన్న పని చేస్తున్నప్పటికి పంచకోశములను గీతలో చెప్పబడిన 12వ అధ్యాయములోని లక్షణాలతో ఉపయోగిస్తున్నామా లేదా అనేది చూసుకోండి.

అందువల్ల ఒక ఉపాస్య దేవతకు కాని,
ఒక ఆధ్యాత్మిక సంస్థకు కాని చెందకుండా,
మనలోని దివ్య చేతనకు స్పందించకలిగే ఉపకరణాలను
తయారుచేసుకొనటానికి సాహసము కల వ్యక్తులు, పైన చెప్పిన
మనోవృత్తులను అభివృద్ధి చేసుకోవటానికి 24 మంది కలసి సాధన చేయండి.

ఇటువంటి వెయ్యి మంది సాధకులు మన రాష్ట్రంలో తయారు అయితే,
వారి ప్రయత్నాలు అతి త్వరలో ప్రపంచమంతా వ్యాపించగలుగుతాయి.

అందువల్ల ఈ లక్ష్యము కలిగినవారు,
తమపై వేసుకున్న ఆధ్యాత్మిక సంస్థల ముద్రలు చెరిపి వేసికొని,
ఒక కూటమిగా ఏర్పడి లక్ష్య సాధనకు ప్రయత్నిస్తే మంచిది.

మీ
శ్రీరామకృష్ణ



# డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారి సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 6. | శ్వాస ధ్యానము | 20.00 |
| 7. | నవ్యయుగావతరణకు ఏకాదశ పుష్పాలు | 18.00 |
| 8. | అనుగ్రహ మాలామంత్రము | 35.00 |
| 12. | పతంజలి యోగసూత్రాలు | 10.00 |
| 13. | స్వర్ణయుగము మాసపత్రిక పాఠసంచికలు | 160.00 |
| 15. | శ్రీమహాకాల చక్రవర్తి యంత్ర ధ్యానము | 75.00 |
| 16. | గుప్తవిద్య - ఒక పరిచయం | 45.00 |
| 001. | సాయి భక్తుల జీవిత విధానం | 5.00 |
| 002. | సాయి అనుగ్రహానికి ఆచరణ సూత్రాలు | 5.00 |
| 003. | నా లక్ష్యము - నా సందేశము | 5.00 |
| 004. | ప్రకృతి ఎల్లప్పుడూ కరెక్టే | 5.00 |
| 005. | త్రిముఖీ గాయత్రీమాత ధ్యానవిధానము | 5.00 |
| 006. | కాలము - లక్ష్యము | 5.00 |
| 007. | యుగసైనికులుగా మన కర్తవ్యము | 5.00 |
| 008. | భూమిపై సశరీరంగా ఉన్న కల్కి అవతారమూర్తి | 5.00 |
| 009. | శ్రీచక్రము | 5.00 |
| 010. | మహాత్ములు నివసించిన స్థల ప్రభావము | 3.00 |
| 013. | టైమ్ అండ్ స్పేస్‌ని అధిగమించే ప్రక్రియ | 3.00 |
| 014. | కృష్ణ చేతనత్వం వైపు ప్రయాణం | 3.00 |
| 015. | పృథ్వీగ్రహానికి రక్షణా కవచం | 3.00 |
| 016. | నిరంతర మౌనము | 3.00 |
| 017. | ఒకే విశ్వము - ఒకే ధర్మము - ఒకే భాష | 3.00 |
| 018. | సమస్యల పరిష్కారానికి 3 అద్భుత సూత్రాలు | 3.00 |
| 019. | హిమాలయ శక్తిధారలు | 3.00 |
| 020. | వైద్యాలయము - విద్యాలయము - దేవాలయము | 3.00 |
| 021. | సమయదానము - అంతదానము - ప్రతిభాదానము | 3.00 |
| 022. | గతకాలపు తప్పిదం - ఈనాటి కర్తవ్యం | 3.00 |
| 023. | దీక్షా విజ్ఞానము - గురువు యొక్క పాత్ర | 3.00 |
| 024. | లక్ష్యాన్ని సాధించటానికి స్వాధ్యాయంతో సాగండి | 3.00 |
| 029. | దేవాలయాలు - మానసికస్థితి | 3.00 |
| 030. | భగవన్నామము యొక్క మహిమ | 3.00 |
| 031. | స్వాధ్యాయంతో సామూహిక కుండలినీ జాగరణ | 3.00 |
| 032. | గురువుకు తగిన శిష్యులం కాగలమా? | 3.00 |
| 033. | ఆధ్యాత్మిక విజ్ఞానము - నియమాలు | 3.00 |
| 034. | విప్లవకారులం కాగలమా? | 3.00 |
| 035. | ఆలోచనలలో విప్లవం - విచారక్రాంతి | 3.00 |
| 036. | గాయత్రీ మంత్రంతో ప్రతిరోజూ క్రొత్త జన్మ | 3.00 |
| 037. | యుగసంధి - ఈశ్వరేచ్ఛ | 3.00 |
| 038. | 2000 A.D. తరవాత వస్తోన్న మార్పులు | 3.00 |
| 039. | ఈనాటి ఈశ్వరేచ్ఛ పృథ్వి స్వర్గంగా మారటం | 3.00 |
| 040. | అనుగ్రహ మ్హాలామంత్రము | 3.00 |
| 041. | ప్రశ్నోత్తరాలు | 3.00 |
| 042. | నూతన యుగపు వివాహ వ్యవస్థ | 3.00 |
| 043. | ధ్యానానికి మొదటి మెట్లు యమ, నియమాలు | 20.00 |
| 044. | భగవద్గీత ఉపన్యాసాలు - 1 | 20.00 |
| 045. | భగవద్గీత ఉపన్యాసాలు - 2 | 20.00 |
| 046. | భగవద్గీత ఉపన్యాసాలు - 3 | 20.00 |
| 047. | భగవద్గీత ఉపన్యాసాలు - 4 | 20.00 |
| 048. | భగవద్గీత ఉపన్యాసాలు - 5 | 20.00 |
| 049. | భగవద్గీత ఉపన్యాసాలు - 6 | 20.00 |
| 050. | భగవద్గీత ఉపన్యాసాలు - 7 | 20.00 |
| 051. | భగవద్గీత ఉపన్యాసాలు - 8 | 20.00 |

ప్రతులకు:

పి. సీతారాముడు, H/o. శ్రీ కె. భాస్కరరావు, 7-3-14, నరసయ్య అగ్రహారం,
భీమవరం - 534 203, ప.గో. జిల్లా.    ఫోన్ నెం. 94407 53115